తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక


ఆగస్టు 2020 వెల రూ.5/-



గోవిందాశ్రిత గోకులబృందా
పావన జయ జయ పరమానందా
- అన్నమయ్య

గోకులాష్టమి

12-08-2020



## తిరుమల
# శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవం
### 2020 సెప్టెంబరు 19 నుండి 27 వరకు

**19-09-2020**
శనివారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**20-09-2020**
ఆదివారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**21-09-2020**
సోమవారం
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

**22-09-2020**
మంగళవారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**23-09-2020**
బుధవారం
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**24-09-2020**
గురువారం
పగలు: హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం

**25-09-2020**
శుక్రవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**26-09-2020**
శనివారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**27-09-2020**
ఆదివారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



## గీతాశ్లోకార్థసారం

**శ్లో :** తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽ భవత్ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-13వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** తతః= పిమ్మట; శంఖాః చ= శంఖములును; భేర్యః చ= నగారాలును; పణవానక గోముఖాః= డోళ్లు, మృదంగములు, కొమ్మువాద్యములు మొదలగునవి; సహసా, ఏవ= ఒక్కసారిగా; అభ్యహన్యంత= మ్రోగినవి; సః శబ్దః= ఆ శబ్దము; తుములః= మిక్కిలి భయంకరమైనదిగా; అభవత్= అయ్యెను.

**భావం:** మరుక్షణమే శంఖములు, నగారాలు, తప్పెటలు, మృదంగములు, కొమ్మువాద్యములు మొదలైనవి ఒక్కసారిగా మ్రోగింది. దిక్కులను పిక్కటిల్ల జేయు ఆ వాద్యనాదములు భయంకరములై ఒప్పినవి.

## చిన్ని శిశువు చిన్ని శిశువు

చిన్ని శిశువూ చిన్ని శిశువూ
యెన్నఁ డుఁజూడమమ్మ యిటువంటి శిశువూ ॥

తోయపుం గురులతోడఁ దూగేటి శిరసు, చింత
కాయలవంటి జడలగములతోడ,
మ్రోయుచున్న కనకంపు మువ్వల పాదాలతోడ
పాయక యశోదవెంటఁ బారాడు శిశువూ॥ (1)

ముద్దుల వ్రేళ్లతోడ మొరవంక యుంగరాల
నిద్దపుం జేతుల పైఁడి బొద్దుల తోడ
అద్దపుం జెక్కులతోడ నప్ప లప్ప లనినంత
గద్దించి యశోదమేనుఁ గౌఁగిలించు శిశువూ (2)


బలుపైన పొట్టమీఁది పాలచాఱలతోడ
నులివేఁడి వెన్నదిన్న నోరితోడ
చెలఁగి నేఁడిదే వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువూ (3)

(శృంగార సంకీర్తన-6-1)

అన్నమాచార్యులవారు ముద్దుల చిన్నికృష్ణుణ్ణి వర్ణిస్తున్నారు. ఇంత మనోహరమైన శిశువే నేడు "ప్రత్యక్షదైవమై" ఏడుకొండలమీద నున్నాడట. ఆహా!!-చిన్నారి పాపడైన ఈ ముద్దుకృష్ణుని వంటి శిశువును ఎందునా చూడలేము. ఇతడు అంత అద్భుతమైన శిశువు.

ఒక పద్ధతి ప్రకారం అలంకరించిన ముంగురులు కలిగిన శిశువు ఈ కృష్ణయ్య. చింతకాయల గుత్తుల వంటి జడలు కలిగిన శిశువితడు. చిన్నారి పాదాలపై బంగారుమువ్వలు ఘల్లు ఘల్లున మ్రోగుచున్నవి. ఆ విధంగా యశోదాదేవి వెంటబడి పారాడుచున్న ఈ మురిపాల శిశువును చూడండి.

ముద్దులొలికే వ్రేళ్ళకు ఉంగరాలు మెరుస్తు న్నాయి. నునుపైన చేతులకు బంగారపు కడియములు అలంకరింపబడియున్నవి. 'ఆయ్ అమ్మా!' అని యశోద అంటే గట్టిగా కౌగలించుకొనే శిశువు. ఇటువంటి మురి పాల శిశువును చూడండి.





ఉబ్బుకొచ్చిన చిన్నారి బొజ్జ మీద అప్పడే త్రాగిన పాలు చారికలు కట్టి కనిపిస్తున్నాయి. అప్పడే తీసిన వెన్న తిన్నట్లు నోరున్న ఈ చిన్నారికృష్ణుని చూచి పులకిస్తున్నాను. ఆ మురి పాల కృష్ణుడే నేడు శ్రీవేంకటాద్రిపై నెలకొని విరాజిల్లుతున్న శ్రీవేంకటేశ్వరుడై లోకములన్నింటినీ ఉద్ధరించుచున్న శిశువు.

# గోమాత

ఎ.ఎల్.సువర్చల

మనకు జన్మను ప్రసాదించిన మాతృమూర్తి, మాతృదేశం, మాతృభూమి, మాతృభాష, గోమాత పరమపూజనీయమైనది.

వేదాలు, ఉపనిషత్తులు, ఆధ్యాత్మిక గ్రంథాలలో గోవును మాతగా అభివర్ణించడం జరిగింది. మాతృమూర్తి, జగన్మాత, ప్రాణికోటికి జీవనాధారమైన భూమాత ఎంతటి పూజనీయమో, గోమాత గూడా అంతటి పవిత్రతను కలిగి ఉన్నది. అందుచేతనే వేదాలు "గావో విశ్వస్య మాతరః" అని స్తుతించాయి. గోవును విశ్వానికే మాతగా అభివర్ణించడం జరిగింది.

గోవు ద్వారా లభించే పాలు, పెరుగు, నెయ్యి, మున్నగునవి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

గోవుకు మూపురం క్రింద ఉన్న వెన్నుపూసలో సూర్యశక్తిని గ్రహించగల దివ్యమైన ప్రాణశక్తితో కూడిన 'సూర్యనాడి' ఉంటుంది. ఆవు మూపురముపైన సూర్యకిరణాలు ప్రసరించినప్పుడు ఈ సూర్యనాడి ఉత్తేజితమై, సూర్యశక్తిని గ్రహించి బంగారు తత్త్వముతో కూడిన పసుపు పచ్చరంగులో ఉంటుంది. కనుకనే ఆవుపాలు బంగారు ఛాయను కలిగి ఉంటాయి.

ఆవుపాలు రోగనిరోధక శక్తిని కలుగజేయడమే గాక, వృద్ధాప్యాన్ని దూరం చేస్తాయి. ఆవుపాలు మనసును, బుద్ధిని వికసింపజేసి, సాత్త్వికగుణాన్ని వృద్ధి పరుస్తుంది. కాశీఖండంలో ఆవుపాలను పుణ్యగంగాజలంతో పోల్చడం జరిగింది.

యజ్ఞయాగాదులు, పూజలు, అభిషేకాలకు ఆవుపాలనే వినియోగించడం జరుగుతుంది. గర్భిణి స్త్రీలు ఆవుపాలను సేవిస్తే సద్గుణ సంపన్నులైన బిడ్డలకు జన్మనిస్తారు. ఈ ఆవుపాలు తీసుకోవడంద్వారా ప్రతివారికి తేజస్సు, ఓజస్సు అభివృద్ధి కల్గుతాయి. ఆవువెన్న శాంతి, సత్త్వగుణాలతో కూడిన మనసును ప్రసాదిస్తుంది.

ఆవునెయ్యితో దీపారాధన చేయడం ఎంతో మంచిది. దైవారాధనకు దేవుని దీవెనలు పొందడానికి ఇది శ్రేష్ఠము. కనుక యజ్ఞయాగాదులలో సైతం ఆవు నెయ్యినే వినియోగిస్తుంటారు. ఈ ఆవునెయ్యి మనం తీసుకునే ఆహారపదార్థాలలో తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని, మేధాశక్తిని కలుగజేస్తుంది.

పంచగవ్య సేవనం సర్వపాపాలను హరిస్తుంది. ఇందులోని రసాయనాలు అనేక దీర్ఘవ్యాధులను నివారిస్తాయి. నిజానికి భూమాతకు తల్లి గోమాత అనే చెప్పాలి. పూర్వం గురుకులాలు, సన్న్యాసులు, సాధుపుంగవులు నివసించే ఆశ్రమాలను గమనిస్తే పంచగవ్యాన్ని ఎక్కువగా ఉపయోగించేవారని తెలుస్తుంది.



గోమయంతో అలికిన ఇల్లు, వాకిళ్ళు క్రిమి కీటకాదులను నివారించడానికి ఎంతో ఉపకరిస్తాయి. పాదరక్షలు లేకుండా సంచరించడంవల్ల గోమయంలో గల జీవశక్తి పాదముల ద్వారా దేహమంతటా వ్యాపించి ఆరోగ్యమును, తేజస్సును ప్రసాదిస్తుంది.

గోవునుండి ప్రసరించే శక్తితరంగాలు మహత్తరమైనవి. కనుకనే గోశాల కూడా దేవాలయమునకు ఉన్నంత పవిత్రతను కలిగి ఉన్నది.

అందుకే ఇటీవల ప్రతి దేవాలయానికి ఒక గోశాలను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా గోవును పూజించటం, అన్ని దైవాలతో సమానమైందని తెలియజేస్తున్నారు. గోమాతను సేవించడం ద్వారా సర్వ దేవతలకటాక్షం లభిస్తుంది.

'వందే గోమాతరమ్'

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 ఆగష్టు, 2020 సంచిక : 03



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥

గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకుడు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| గోమాత | ఎ.ఎల్.సువర్చల | 04 |
| వందే గణనాయకం | డా॥ రేవూరు అనంతపద్మనాభరావు | 07 |
| సందేహాలు - సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 10 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ పుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 11 |
| కర్తలను బట్టే కర్మలు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 12 |
| జ్ఞానానందమయుడు-హయగ్రీవుడు | శ్రీ అప్పరుసు రమాకాంతరావు | 13 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 15 |
| మహిమాన్వితదైవం శ్రీఆదివరాహస్వామి | శ్రీ మేడూరి అప్పలాచార్యులు | 16 |
| గోవింద గోవిందయని కొలువరే... | డా॥ ఎన్.వి.శ్రీనివాసరావు | 18 |
| శ్రీవిఖనస మునీంద్రుల ఉపదేశసారం | ఆచార్య వేదాస్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు | 20 |
| శ్రావణఉపాకర్మ | శ్రీ వేదార్థం మధుసూదనశర్మ | 22 |
| 'శ్రీయామునాచార్యుల' వైభవము | డా॥ ఎమ్.టి.ఆళ్వార్ | 24 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| నమామి నంద సంభవమ్ | శ్రీమతి యర్రమిల్లి విజయలక్ష్మి | 32 |
| భేదం | మాస్టర్ జె.శ్రీవివస్వత్ | 34 |
| 'గాయత్రీ'సాధన | డా॥ వై.శివరామప్రసాద్ | 35 |
| 'శ్రీ'నివాసం | డా॥ ఎస్.లక్ష్మి | 37 |
| పరమపావనం-వామనచరిత్ర | శ్రీ వేమరాజు అనంతపద్మనాభం | 38 |
| శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రము, సింగరాయకొండ | శ్రీమతి జి.సత్యవతి | 40 |
| బలరామవైభవం | డా॥ మరింగంటి లక్ష్మణాచార్యులు | 43 |
| ప్రత్యక్షదైవం- పరమదయాళువు | శ్రీమతి రాచపూడి శరత్‌కౌముది | 45 |
| భక్తప్రహ్లాదుని ఉపదేశాలు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 46 |
| 'విద్యాదదాతి వినయం' | డా॥ గంగిసెట్టి లక్ష్మీనారాయణ | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య మరియు కిరణ్ భట్ | 49 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 50 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| ఔషధ గుణాల పవిత్రవృక్షం.. శమీవృక్షం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 52 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : శ్రీకృష్ణస్వామివారు, తిరుమల
వెనుక చిత్రం : శ్రీవిఖనసాచార్యస్వామివారు, తిరుమల

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# సంపాదకీయం

# యతో ధర్మః తతో జయః

“యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత। అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం॥”– అన్న శ్రీకృష్ణభగవానుని వచనం ప్రకారం, ఎప్పుడైతే ధర్మానికి హాని, అధర్మానికి అభ్యుదయం కల్గినపుడు ఎల్లవేళలా తాను అవతారం దాల్చుతానని స్పష్టంగా సెలవిచ్చాడు. అసలు ధర్మం అంటే ఏమిటి? దానికి అవరోధం ఎలా ఏర్పడుతుంది? నిజానికి మనం ‘ధర్మ’మన్న శబ్దాన్ని నానా రకాల అర్థాలలో వాడుతున్నాము. వాస్తవానికి ధర్మమంటే ‘ధరించి, ధరింపబడేది’ ప్రాకృతికమైన ప్రవృత్తికి భిన్నమైంది, హృదయస్పందకమై, ఆలోచనాత్మకమైన సామాజిక సారూప్యత ‘ధర్మ’మని చెప్పుకోవచ్చు! అనంతమైన జీవకోటిలో మానవుణ్ణి ఇతర ప్రాణుల కన్నా వేరు చేసేది అతనికున్న ‘వివేచనాశక్తి’ మాత్రమే. అంతర్లీనమైన ఈ సదసద్వివేకమే మనిషి బుద్ధిని, నడతను నడిపించి మంచి మార్గాన భగవంతునితో సమానమవడానికి తోడ్పడుతుంది. అంటే మనిషి పదిమందికి హితం కలిగేది హితమని, కీడు కలిగించేది పరిహార్యమని తన బుద్ధివికాసానుగుణంగా గ్రహించగలుగుతాడు. మనిషి ప్రవృత్తి ‘సమాజం’ మీద పనిచేసి ధర్మానికి–ధృతియో క్షితియో జరుగుతుంది. ఆ ధర్మక్షీణత అధికమై సమాజానికి సంకట పరిస్థితి ఏర్పడినప్పుడు సమాజ ధర్మ–కర్మ నిర్వహణకు అనంత చైతన్యశక్తి అవసరమవుతుంది. దివినుండి భువికి దిగి వచ్చిన ఆ విధానాన్నే మనం ‘అవతారం’గా పేర్కొంటాం. నిజానికి ప్రతి అవతారంలోనూ భగవానుడు జీవతత్త్వంపట్ల, జీవలోకం పట్ల తనకున్న గౌరవాన్ని ప్రకటిస్తూనే ఉన్నాడు. భగవంతుని అవతారాలు అనంతమైనప్పటికీ విభిన్నతకు ఆలంబనమైనది పది అవతారాలే. ప్రతి అవతారంలోను పరమప్రయోజనం పరహితంగా ప్రకటించాడు. ముఖ్యంగా శ్రావణమాసంలో దశావతారాల్లో వరాహావతారం, వామనవతారం, బలరామ–కృష్ణావతారాలు లోకోద్ధరణకై భగవానుడు ధరించి అవతరించాడు.

వరాహావతారం జలం నుంచి భూమి పుట్టినట్టే, జల జలభూయుక్త తత్త్వానికి విడిగా ప్రాణకోటి ఆవిర్భావాన్ని సూచిస్తుంది. నీటి పరిమాణం, ప్రమాణం భూమి కన్నా ఎక్కువ కదా! అని  జలంలో కలిపి వేయాలని ప్రయత్నం జరిగితే పరమాత్మ యొక్క శక్తి తనకు నచ్చిన రూపంలో అంటే ‘వరాహ’రూపంలో అవతరించి ప్రతిఘటించి భూమిని ఉద్ధరించింది.

ఇక వామనావతారం ప్రజ్ఞాప్రభావజనితమైంది అంటే ఇక్కడ ఓడించగల శత్రువు కన్నా ఓడించిన విధం విశేషం. రాజ్యాలిస్తానన్న బలిచక్రవర్తి దానాహంకారాన్ని మూడడుగులతో అణగద్రొక్కిన అద్భుత బుద్ధిశాలి అవతారం ఇది. అడిగిన దానికంటే తన దగ్గర ఉంది కదా! అని ఇచ్చేస్తానంటే అది దయాగుణఫలం మాత్రమే గాని, దాని ప్రాధాన్యాన్ని గుర్తించి కాదు. అంటే దానగ్రహీతను అవమానించినట్టే. ఆ తర్వాత గ్రహీతది పై చేయి అయి దాత తలక్రిందులవుతాడు. మనకుంది గదా, ఇచ్చేద్దాం అన్న అహంకారంతో గాక, గ్రహీత అవసరాన్ని గుర్తించి సహానుభూతితో ఇచ్చే దానం కొండంత ప్రయోజనం కల్గిస్తుందని నిర్దేశించిన అవతారమిది.

జీవి కాలప్రవాహంలో కలిసేవాడైనా కోరేది ప్రశాంత జీవితాన్నే. అందుకే తనలోని శక్తులను దాచిపెట్టి, వీలైనంత వరకు ఆనందంగా ఉండటానికి ప్రయత్నిస్తాడు. అయితే కోపం కల్గితే  తనంత వాడు తానే ఔతాడు. అంతటి ప్రళయశక్తి బలరామావతారం ఈ తత్త్వాన్ని కూడి ఉంది. మరి అతనితోపాటే తమ్ముడుగా అవతరించిన భగవానుడు అక్రమాల నిరోధానికి, ధర్మరక్షణ కొరకే అవతరించారని చెప్పవచ్చు. అంటే ఈ ద్వాపరాంతానికి, కలియుగానికి మధ్య జరిగిన కృష్ణ చరిత్రలో కలి ధర్మాలు చాపకింద నీరులాగా చల్లగా ప్రవహించి పరిమిత బుద్ధులకు అవతార భావనకు ప్రయోజనాన్ని ఏర్పరచారు. ఇక్కడ హయగ్రీవులు, విఖనసమునీంద్రులు, ఆళవందార్లు కూడా ధర్మాన్ని నిలపడానికి తోడ్పడినవారని తప్పక స్మరించాలి.

సామాజికన్యాయాన్ని అతిక్రమించటం ఎప్పుడు ప్రారంభమౌతుందో అప్పుడే ధర్మ గ్లాని ప్రారంభమౌతుంది.

కృతత్రేతాదులలో మానవసమాజంలో భ్రూణ శిశుహత్యాదులు జరిగినట్లు కన్పించదు. ద్వాపరయుగంలో సామాజిక న్యాయం కొరవడి సర్వం వీరభోజ్యం అనే విధంగా, కలవాని కండబలం అనే ఆగడాలు సాగి అరక్షణీయ స్థితి ఏర్పడింది. కంసుడు, జరాసంధుడు లాంటి ఆతతాయిప్రభువుల ఆగడాలు పెచ్చుమీరాయి. ఇటువంటివారిని యమపురి కంపటానికే కృష్ణభగవానుడు అవతరించింది. తరువాత కురుక్షేత్ర యుద్ధం ఆనుషంగికం మాత్రమే అనిపిస్తుంది.

కాని మనది మాయబ్రతుకు. మాయామోహితులం. కనుకనే అవతారప్రయోజనాన్ని అర్థం చేసుకోకుండా ఆరాటపడటం జరుగుతున్నది. నిజానికి మన కర్థంకాదని భగవానుడే చెప్పాడు.

అవజానంతి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్, పరం భావ మజానంతో మమ భూత మహేశ్వరమ్.

“మనీషి” కావాలనుకున్నవాళ్ళు మళ్లీ మళ్లీ యత్నించాలి, అంతే. అందుకే “యతో ధర్మః తతో జయః”. ధర్మమే ఎప్పుడు జయిస్తుంది అన్నది నిర్వివాదాంశం.

# వందే గణనాయకం

డా॥ రేవూరి అనంతపద్మనాభరావు

ఓం
గణానాంత్వా
గణపతిగుం
హవామహే కవిం
కవీనాముపమశ్రవస్తమం
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆనశ్శృణ్వన్నూతిభిసీదసాదనమ్ - ఋగ్వేదం 2-23-7

అని ఋగ్వేదసూక్తం గణపతిని స్తుతించింది.

యజ్ఞయాగాదులు, పూజాపునస్కారాలు, వ్రతాలు – ఏవైనా ముందుగా గణపతిపూజతో ఆరంభమౌతాయి. 'శుక్లాం బరధరం విష్ణుం, శశివర్ణం చతుర్భుజం' అని ఆ విఘ్ననాయకునికి చేతులు జోడించి నమస్కరించి, ప్రసన్న వదనుని ప్రసన్నుణ్ణి చేసుకొంటాం. గణపతి జ్ఞానానికి ప్రతినిధి.

పూర్వకవులు తమ కావ్యాలలో ఇష్టదేవతాస్తుతితో విఘ్నేశ్వరుని స్మరించి కావ్యరచన మొదలుపెట్టారు. ఆంధ్ర మహాభాగవతంలో పోతనామాత్యుడు మోదకఖాది అయిన వినాయకునికి మ్రొక్కులిడినాడు.

"ఆదరమొప్ప మ్రొక్కిదుదు అద్రిసుతా...........
మోదకఖాదికిన్, సమదమూషకసాదికి, సుప్రసాదికిన్"

–మూషికవాహనంపై సంచరించే గణపతికి ఆదరంతో నమస్కరించాడు.

## గణాధిపత్యం

ఒకనాడు దేవతలు, మునులు, మానవులు పరమేశ్వరుని సేవించి విఘ్నాలు తొలిగించే అధిపతిని ఇమ్మని కోరారు. జ్యేష్ఠపుత్రుడైన వినాయకుడు తనకు ఆధిపత్యం ఇమ్మన్నాడు. కాదు, కాదు నాకివ్వమని కుమారస్వామి కోరాడు.

పరమశివుడు వారిద్దరికీ ఓ పరీక్ష ఏర్పాటు చేశాడు. ముల్లోకాలలో ఉన్న పుణ్యతీర్థాలలో స్నానంచేసి, ఎవరు ముందుగా తన వద్దకు వస్తారో వారికి ఆ పదవి ఇస్తానని శివుడు సెలవిచ్చాడు. వెనువెంటనే కుమారస్వామి నెమలి వాహనం ఎక్కి వాయువేగంతో బయలుదేరాడు. వినాయకుడు ఖిన్నవదనంతో నిలిచిపోయాడు.

శివుడు కరుణించి–'కుమారా! నారాయణమంత్రాన్ని జపించిన మాత్రాన మూడు వందల కల్పాలలో పుణ్యనదులలో స్నానమాచరించిన ఫలితం కలుగుతుం'దని నారాయణ మంత్రోపదేశం చేశాడు. గణపతి నారాయణమంత్రజపం చేస్తూ పార్వతీపరమేశ్వరులకు ముమ్మారు ప్రదక్షిణం చేశాడు. కుమారస్వామి వెనుదిరిగి వచ్చి కైలాసంలోనే ఉన్న అన్నగారిని చూచి, తన తప్పుతెలుసుకొని అన్నగారికే గణాధిపత్యం కలిగించమని తండ్రిని అర్థించాడు. ఆ విధంగా వినాయకుడు 'గణాధిపతి' అయ్యాడు.

## వినాయకుని ఆకారం-సంకేతం

తెల్లనివస్త్రాలు ధరించి, చంద్రునివంటి వర్ణంతో, నాలుగుభుజాలు కలిగి ప్రసన్నవదనుడైన వినాయకుడు పూజలందుకొంటున్నాడు. గణపతిరూపం భక్తులకిచ్చే సందేశం మహత్తరం. అందులో అనేకానేక అంతరార్థాలు గోచరిస్తాయి. గజముఖం– తలపెద్దది. భావమేమిటంటే భక్తుల ఆలోచనలు



మహత్తరంగా ఉండాలి. అవి ఆచరణాత్మకంగా ఉండాలి. మరి అంతపెద్దతలలో చిన్నికళ్లు. కళ్లకు చంచలత్వం పనికిరాదు. సూక్ష్మదృష్టితో పరిశీలించాలనే సంకేతమిస్తాయి ఆ చిన్నికళ్లు. లక్ష్యం వైపే దృష్టిని సారించాలనే బోధచేస్తాయి. అలానే నోరు కూడా చిన్నది. ఆయన సుముఖుడు. సంస్కారవంతంగా తక్కువగా మాట్లాడాలని దీని సంకేతం. ఆ నోరుతొండంతో కప్ప బడి ఉంటుంది. తొండం వివేకానికి గుర్తు. వివేకవంతంగా మాట్లాడాలనీ, నోటికి వచ్చినట్లు వదరకూడదని సూచన.

చెవులు చేటలంతవి. చెవులు పెద్దవిగా ఉంటే అదృష్టం. అవసరమైన విషయాలనే వినాలి. ధాన్యాన్ని చేటతో చెరుగుతారు. ఊలుగింజలు దొర్లిపోతాయి. మంచిగింజలే మిగులుతాయి.

అదేవిధంగా, అవసరమైన విషయాలనే గ్రహించాలి. బొజ్జగణపయ్య స్థితప్రజ్ఞత్వానికి నిదర్శనం. జీవితంలో కష్ట సుఖాలను జీర్ణించుకొనే శక్తికావాలి. మరి వాహనమో! ఎలుక. చంచలస్వభావంగలది. మానసిక స్థిరత్వం అవసరమనే ప్రబోధం ఇమిడి ఉంది.

## పురాణగణపతి

వివిధపురాణాలలో గణపతిగాథలు వర్ణించబడ్డాయి. స్కాందపురాణంలో నాగరఖండంలో హాటకేశ్వరంలో సూతపౌరాణికుడు ఆ పుణ్యక్షేత్రంలో విఘ్ననివారకుడైన వినాయకుడు దేవతలు, రాక్షసుల విఘ్నాలను తొలగించి, కోర్కెలను భక్తులకు సిద్ధింపజేసినట్లు పేర్కొన్నారు. ఆ గాథప్రకారం మానవులు తీవ్ర తపస్సు చేసి స్వర్గలోకానికి ఏ ఆటంకం లేకుండా వెళ్లగలిగారు. దేవతలకంటె మానవుల సంఖ్యపెరిగిపోయింది. అది చూచి ఇంద్రుడు కైలాసానికి వెళ్లి శివుని ప్రార్థించాడు. గౌరీ సమేతుడైన శంకరుడు కనిపించాడు. ఆ ఆపదనుండి రక్షించమని ఇంద్రుడు పరమ శివుని వేడుకొన్నాడు. శివుడు పార్వతివైపు చూశాడు. ఆమె తన శరీరంపై చర్మాన్ని నలిపి ఆ ధూళితో గజముఖుడు, చతుర్భుజుడైన, బొజ్జగణపయ్యను సృష్టించింది.

గజముఖుడైన ఆతడు తన తల్లిని తన భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదేశించమని కోరాడు. 'మానవులు స్వర్గలోకానికి వెళ్లకుండా చూడమనీ, అవరోధాలు కల్పించమని' ఆమె ఆదేశించింది. 'దేవతలకు నీవు సేనానాయకుడివని' ఆశీర్వదిం

## ఆడికృత్తిక



ఆడికృత్తిక నాడు, సుబ్రహ్మణ్యేశ్వరుని ఆరాధన చేయాలి. ఈ రోజున ఆరు నక్షత్రములచే, ఆరు తల్లుల చేత పెంచి పోషింపబడినవాడు షాణ్మాతుడు అయిన కార్తికేయుడని అంచనా. ఆయనకు అనేక నామాలున్నాయి. సర్వసేనాధిపతి అందులో ఒకటి. ఈయనను 'మురుగన్' అంటారు తమిళులు. అంటే అందమైన వాడు అని అర్థం. సమస్త దేవతలకు, దేవసేనాధిపతిగా మనలో ఉండే సమస్త అభిజ్ఞలకు అతడు నేతృత్వం వహిస్తూ ముందు బెత్తం పుచ్చుకొని మనలను అందరి మార్గదర్శనం చేస్తూంటాడు. మనం సవ్యమార్గంలో ప్రయాణించాలి, ఈ సవ్య మార్గాన్ని ఇలా అంటూ నిర్దేశిత పథాన్ని ఏర్పాటుచేసి తీసుకెళ్లేవాడు కార్తికేయుడు. కనుక, ఆయనను మన దేవసేనాధిపతి అన్నాము. దేవతలు ఎక్కడో కాదు ఈ శరీరంలోనే ఉన్నారు. సకలదేవతానిలయం మనదేహం. బ్రహ్మ, విష్ణువు, సకల దేవతలు అందరూ ఈ హృదయంలో ఉంటారు. ఓంకారము కూడా మన మనసులోనే ఉంది. శరీరం సత్యమార్గంలో ప్రయాణించడానికి మనకు దేవసేనాధిపతి స్వామి అనుగ్రహం కావాలి. అతడే షణ్ముఖుడు. దేవసేనాధిపతి 'కార్తికేయుడు' శరవణ భవుడు ఎన్నో పేర్లు. ఆ స్వామి కృత్తిక నక్షత్రంనాడు జన్మించాడు. సుబ్రహ్మణ్య స్వామిని అర్చించినందువల్ల వారి మాతృస్వరూపాలు అయిన పార్వతి దేవి, కాత్యాయిని, జగజ్జనులు ఎంతో ఆనందిస్తారు. గణపతిని పూజించినా, సుబ్రహ్మణ్య స్వామిని పూజించినా పార్వతీపరమేశ్వరులు ఆనందిస్తారు.

### ఆడికృత్తిక ఎలా చేయాలంటే...

సమీపంలో ఉండే పుట్టలో పాలు పోసి, ఉపవాసంతో నువ్వులు, బెల్లం కలిపి కట్టి దంచిన వాటిని 'చిమిలి' అంటాము. ఈ చిమిలిని నైవేద్యంగా స్వీకరించాలి. అందరికి పంచిపెట్టాలి. అప్పుడు ఎవరైనా ఒక బ్రహ్మచారికి ఎరుపు వస్త్రాన్ని దానంగా ఇవ్వాలి. అలా చేస్తే సుబ్రహ్మణ్యస్వామి, పరోక్షంగా తల్లి జగజ్జనని ఆనందిస్తారు. ఆడికృత్తిక నాడు సుబ్రహ్మణ్యస్వామిని సేవించుకుందాం. అందరికీ క్షేమం కలగాలని కోరుకుంటాం.

చింది. ముప్పదిమూడుకోట్ల దేవతలు వరాలు ప్రసాదించారు. మహేశ్వరుడు కుఠారాన్ని ఇచ్చాడు. కార్తికేయుడు మూషికవాహనాన్ని ఇచ్చాడు. మహావిష్ణువు బుద్ధిని ప్రసాదించాడు. కుబేరుడు సంపదనిచ్చాడు. ఆ బలసంపదతో గణపతి భూలోకానికి వెళ్లి అవరోధాలు కల్పించారు.

## కాశీఖండంలో వినాయకునిగాథ

తెలుగులో శ్రీనాథుని కాశీఖండంలో కాశీ క్షేత్ర మాహాత్మ్యం విపులంగా వర్ణించబడింది. దివోదాస వృత్తాంతంలో వినాయకుని పాత్ర కూడా ఉంది. మనువంశంలో జన్మించిన దివోదాసుడనే రాజు బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపస్సు చేశాడు. బ్రహ్మవరప్రసాదంతో సమస్తభూలోకానికి చక్రవర్తి అయ్యాడు. అతని రాజ్యంలో ఉండే సమస్తదేవతలు అతని రాజ్యాన్ని వదలిపెట్టి ఈశ్వరుని వద్దకు వెళ్లి మొరపెట్టుకొన్నారు. బ్రహ్మవరం వల్ల అతని రాజ్యంలో దేవతలుండరాదు. భూమండలమంతా దేవతాశూన్యమైంది.

ఈశ్వరుడు దేవతల మొరవిని దివోదాసునకు రాజ్య పదభ్రంశం ఎలా చేయాలా? అని ఆలోచించి బుద్ధిమంతుడైన వినాయకుని ఆ పనికి నియమించాడు. మూషికవాహనుడు జ్యోతిష్కుని రూపంలో కాశీనగరం చేరుకొన్నాడు.

ఆ జ్యోతిష్కుడు అక్కడి ప్రజలకు ఎన్నోరకాల చిత్ర విచిత్రకథలు చెప్పాడు. హస్తసాముద్రికం చూచి వారి భవిష్యత్తు తెలియజేశాడు. ముఖాన్ని చూచి– 'నీకు ఇద్దరు కొడుకు'లని ఒకరికీ, 'నీకు ఇద్దరు కూతురుల'ని మరొకరికి జోస్యం పలికాడు. ఆ నగరవాసులతో వావివరసలు కలిపి ఒకరిని 'తాతగార'ని మరొకరిని 'బావగార'ని సరసాలాడాడు.

వ్రతాలు చేయించాడు. పంచాంగం వివరాలు తెలిపాడు. తన చిరుబొజ్జతో వీథులలో సంచరిస్తూ ఉన్నాడు విఘ్నరాజు. నగరకూడలిలో నిలబడి 'కాశీపట్టణానికి అతిత్వరలో అరిష్టాలు కలగనున్నా'యని నొక్కి చెప్పాడు. డుంఠిభట్టారకుడనే పేరుతో రాణిగారి మెప్పుపొంది రాజపురోహితులలో స్థానం సంపాదించాడు.

డుంఠిభట్టారకుడు–'కాశీనగరంలో అరిష్టాలు తొలగాలంటే కొంతకాలం చక్రవర్తి ఈ కాశీనగరం వదలి ఎక్కడైనా ఉండాలని సలహా ఇచ్చాడు. నేటికి పదునెనిమిదవరోజు ఒక పురోహితుడు వచ్చి నీకు హితోపదేశం చేస్తాడని నమ్మబలికాడు. అదేవిధంగా 18వ రోజు శివుడు పంపిన విష్ణువు మాయా వేషంలో – పుణ్యతీర్థుడనే పేరుతో కాశీనగరానికి వచ్చి చక్రవర్తి దర్శనానికి వెళ్లాడు. అదేసమయంలో వినాయకుడు దివోదాసు హృదయంలో ప్రవేశించాడు. విష్ణువు ఆదేశం ప్రకారం దివోదాసు కాశీనగరం వదలిపెట్టి వెళ్లాడు. సమస్తదేవతలకు తిరిగి భూలోకంలో స్థానం లభించింది. ఆ విధంగా బుద్ధిమంతుడైన విఘ్నేశ్వరుడు తండ్రి ఆదేశం పాటించాడు. కాశీక్షేత్రంలో డుంఠిగణపతి ప్రసిద్ధం.

## షోడశగణపతులు

ఆగమశాస్త్రాలు కొన్నింటిలో 21 రకాల గణపతులు, మరికొన్నింటిలో 32మంది ప్రస్తావించబడ్డారు. ముద్గల పురాణంలో 32 రకాల గణపతులు పేర్కొనబడ్డారు. శిల్పాగమ శాస్త్రాలలో 21మంది ప్రస్తావన ఉంది. వామనపురాణంలో వినాయకుడు పార్వతికి జన్మించినట్లు చెప్పబడింది. ప్రసిద్ధమైన షోడశగణపతుల వివరాలిలా ఉన్నాయి–

01) బాలవిఘ్నేశుడు; 02) తరుణగణపతి; 03) భక్తగణపతి; 04) వీరగణపతి; 05) శక్తిగణపతి; 06) ధ్వజగణపతి; 07) పింగళగణపతి; 08) ఉచ్ఛిష్టగణపతి; 09)విఘ్నరాజు; 10) క్షిప్రగణపతి; 11) హేరంబగణపతి; 12) లక్ష్మీగణపతి; 13) మహాగణపతి; 14) భువనేశగణపతి; 15) నృత్తగణపతి; 16) ఊర్ధ్వగణపతి

షోడశగణపతుల ధ్యానానికి వివిధశ్లోకాలు ప్రసిద్ధం.

ముద్గలపురాణంలో గణేశవృత్తాంతం సవిస్తరంగా వర్ణింపబడింది. వినాయకవ్రతకల్పం కూడా ప్రచారంలో ఉంది. గణపతి నవరాత్రులను భారతదేశంలో అనేకప్రాంతాలలో శ్రద్ధతో ఉత్సాహంగా జరుపుకొంటారు.

శ్రీశంకరాచార్యస్వాములవారు గణేశపంచరత్న స్తోత్రంలో వినాయకుని ప్రస్తుతించారు. అదేవిధంగా ప్రాతఃకాలంలో గణపతిని స్మరించడం మన సంప్రదాయం.

ప్రాతఃస్మరామి గణనాథమనాథబంధుం
సింధూరపూర పరిశోభిత గండయుగ్మం ।
ఉద్దండ విఘ్నపరిఖండన చండదండమ్
ఆఖండలాది సురనాయక బృందవంద్యం ॥



# సందేహాలు - సమాధానాలు

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**1) రామాయణం సుందరకాండలో హనుమంతునికి మైనా కునిపై సేదతీరమని చెప్పిన సముద్రుడు, తర్వాత యుద్ధ కాండలో రామునికి మూడు రోజుల దర్భశయనం తర్వాత, రామబాణానికి భయపడి మాత్రమే త్రోవ ఇచ్చాడు. ఎందు కని?** – పి. సామ్రాజ్యలక్ష్మి, నెల్లూరు.

సముద్రుడు సైతం పరమాత్ముడైన శ్రీరామునికి దాసుడే. అందుకే రామకార్యార్థియై వెళుతున్న హనుమకు విశ్రాంతిగా ఆతిథ్యాన్నిమ్మని మైనాకునితో చెప్పాడు. అయితే శ్రీరామునికి కొన్నినాళ్ళ తర్వాత త్రోవ ఇవ్వడంలో ఆంతర్యం ఉంది.

ఎక్కుపెట్టిన రామబాణం ద్వారా, అక్కడికి సమీపంలో ద్రుమకుల్యల ప్రాంతంలో సముద్రుని క్షోభ పెడుతున్న రాక్షసుల్ని సంహరింపజేయాలని సముద్రుని ఉద్దేశం. అందుకే బాణమెక్కు పెట్టే వరకు నిరీక్షించాడు. తర్వాత రాముని ప్రార్థించి, ద్రుమ కుల్యల వద్ద దనుజుల్ని వధించమని ప్రార్థించాడు. రాముడు ఆతని ప్రార్థనను మన్నించాడు. ఇది ప్రధాన కారణం.

అయితే, దీనిలో మరియొక ఆంతర్యం– ప్రకృతి శక్తు లను అనుకూలపరచడానికి సనాతన ధర్మంలో అనేక దీక్షా విధానాలు చెప్పబడ్డాయి. ముందుగా ఆ దీక్షలను చేపట్టి ప్రకృతి శక్తులకు అధిష్ఠానమైన దేవతలను ఉపాసించి, ప్రసన్నం చేసు కోవాలి. అప్పుడు ప్రకృతి అనుకూలమవుతుంది. ఈ ధర్మం మనకు బోధించడానికై, తాను దర్భశయన దీక్ష ద్వారా ఆచరించి బోధించాడు రామచంద్రమూర్తి.

**2) రాముడు అరణ్యవాసానికి వెళ్ళినప్పుడు, కౌసల్యను 'రాముడు అవతారపురుషుడనీ, ఏమాత్రం బాధపడవద్ద'నీ సుమిత్ర ఓదార్చుతుంది. మరి ఈ విషయం కన్నతల్లి కౌసల్యకు తెలియదా?** – ఎస్.రామరాజు, గుడివాడ.

**రామః పిత్రోః పుత్రభావం, రావణాయ మనుష్యతాం**
**ఋషీణాం భగవద్భావం, దర్శయన్ విచచారహ॥**

"రాముడు తల్లిదండ్రులకు పుత్రుని వలె, రావణునకు సామాన్య మానవుని వలె, ఋషులకు తన అసలు స్వరూపమైన భగవంతునిగా గోచరించి విహరించాడు"– అని భరద్వాజ రామాయణ వచనం. కౌసల్యాదశరథుల దృష్టిలో రాముడు తమ పుత్రుడు. ఆ భావంతోనే తరించే పుణ్యఫలం వారిది. తత్కాలంగా విశ్వరూపాన్ని చూపినా, వెంటనే యోగమాయా ప్రభావంతో పసివాని వలె భ్రమింపజేశాడు. ఆ మాయనే రామా వతారంలో కూడా ప్రదర్శించి తన అవతార కార్యాన్ని నెరవేర్చు కున్నాడు. ఆ కారణం చేతనే కన్నతల్లి కౌసల్యకు రాముడు అవతార పురుషుడనే గ్రహింపు లేదు.

రామాయణాన్ని అనుసరించి– సుమిత్ర తత్త్వజ్ఞురాలు. వాల్మీకంలో సుమిత్ర పాత్ర అంతగా కానరాకున్నా, కౌసల్యతో ఆమె పలికిన మాటల ననుసరించి రామతత్త్వం తెలిసినదిగా స్పష్టమౌతోంది. కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం సుమిత్ర ఉపాసనా ధర్మానికి ప్రతీక. అందుకే కైంకర్య స్వభావు డైన లక్ష్మణుడు ఆమెకు జన్మించాడు.

**3) భాగవతం- దేవీభాగవతం. భాగవతం ప్రకారం విష్ణువే అన్నిటికీ మూల మనీ, సృష్టి స్థితి లయలన్నీ ఆయన కార్యాలే ననీ ఉన్నది?** – ఆర్. శారదాదేవి, ఉక్కునగరం.

సృష్టి స్థితి లయలన్నిటికీ ఒకే ఈశ్వర చైతన్యం కారణం. ఇది అవ్యక్తం. ఏ రూపమూ లేనిది. కానీ జగన్నిర్వ హణ కోసం వివిధ దేవతాకృతులతో వ్యక్తమయింది. జీవులకు వారి పూర్వ పుణ్య విశేషాల వల్ల ఒక్కొక్కరికి ఒక్కొక్క దేవత యందు నిష్ఠ ఏర్పడుతుంది. ఆ నిష్ఠను బలపరచి తరింప జేసేందుకు వివిధ పురాణాలను వ్యాసదేవుడు అనుగ్రహించాడు. శివునిగా, శక్తిగా, విష్ణువుగా.. ఇలా పలు విధాలుగా వ్యక్తమై నది ఒకే ఈశ్వర చైతన్యం. అందువల్లనే ఏ దేవతా భక్తునకు ఆ దేవతయందే సృష్టి స్థితులకు మూలమైన ఈశ్వర చైతన్యం అనుభవానికి వస్తుంది.

అందుకే ఏ వివాదాలకు, తర్కాలకు గురికాకుండా – మన ఇష్టదైవాన్ని 'పరమేశ్వరుడు, పరమాత్మ' అనే భావనతో ఆరాధిస్తూ, మిగిలిన దేవతలందరూ ఆ దేవుని స్వరూపాలేననే అవగాహనలో సాధన సాగించడం శ్రేయస్కరం.

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-16

# శ్రీకృష్ణభగవద్విజయం

డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు

యదునాథుడు శ్రీకృష్ణుడు గోష్ఠీమందిరానికి వచ్చే సమయానికి మగధబ్రాహ్మణుడు, బలరాముడు, సాత్యకి సంభాషించుకుంటున్నారు. మందిరంలో ప్రవేశించిన మాధవుడు "బ్రాహ్మణోత్తములకు ప్రణామాలు" అని చేతులు జోడించాడు. బ్రాహ్మణుడు ఆనందంతో నిలబడి "విజయోస్తు మాధవ! విజయోస్తు" అని ఆశీర్వదించాడు. స్వామి కూర్చున్న తరువాత బ్రాహ్మణుడు కూడా కూర్చున్నాడు. స్వామి చిఱునవ్వు చిందించాడు.

**శ్రీకృష్ణుడు :** భూసురోత్తమా! ఏమిటి మగధరాజ్య విశేషాలు? మీ మగధేంద్రుడు బ్రాహ్మణులకు లెస్సగా దానాలు చేస్తున్నాడట కదా?

**మగధ బ్రాహ్మణుడు :** కరుణావతారా! కమలాక్షా! నీవు చూడని విశేషాలు ధరణీ వలయంలో ఏముంటాయి? అడిగావు గనుక ఒక్క విషయం మనవి చేస్తున్నాను. మా జరాసంధ చక్రవర్తి బ్రాహ్మణదానాలతో సంపాదించే పుణ్యాన్ని భైరవ సేవతో సంపాదించేపాపం తినివేస్తున్నది. నూటొక్క వంశాలనుండి ఇరవైవేలమంది ధరణీపతులను బంధించి హింసిస్తున్నాడు. అంతేకాదు. వారినుంచి ప్రతిదిన మొక్కొక్క రాజును వధించి భైరవార్చన చేస్తున్నాడు. ఆ రాజుల బంధువులందఱు ఏకమై నన్ను తమ వద్దకు దూతగా పంపించారు. మాగధుణ్ణి వధించి మమ్ము రక్షించేదెప్పుడు మాధవా?– అంటూ ఆక్రోశిస్తున్నారు నరకాంతకా!

**బలరాముడు:** కృష్ణా! మనమింకా ఆలస్యం చేస్తే ఆ జరాసంధుడు ధరాపతులను సమూలంగా వధిస్తాడు. రాజులు లేనిరాజ్యాలలో చోరులు, ఉగ్రవాదులు విజృంభించి ఉల్లోలకల్లోలాలు సృష్టిస్తారు. ప్రజలు ప్రాణాల నఱచేతిలో పెట్టుకుని పరదేశాలకు వలసపోయి అక్కడివారికి భారమవుతారు. విశ్వకల్యాణ సంధాయకమైన వైదిక ధర్మం క్షీణించిపోతుంది. తత్ఫలితంగా దేవతలకు, మానవులకు ఉన్న పరస్పర సహకార సంబంధం దెబ్బతిని కఱవు కాటకాలు విలయతాండవం చేస్తాయి. కాబట్టి మనం మగధమీద దాడి చెయ్యటమే మంచి దనిపిస్తున్నది.

**సాత్యకి :** అవునన్నా! ఆ వంచకపంచకం మగధలో ఉండగా దండెత్తితే సర్వకార్యాలూ చక్కబడతాయనిపిస్తున్నది.

**శ్రీకృష్ణుడు :** వేగిరపడకు సోదరా! జరాసంధుని మరణం మన చేతుల్లో లేదు. కనుకనే పదునేడుసారులు అతనిని ప్రాణాలతో విడిచిపెట్టాము. అతని అపారసైన్యాన్ని మాత్రం తుడిచిపెట్టాము. పైగా మాగధునికి ఆయుధాల వల్ల హాని లేదు. అటువంటి మహాయోధుణ్ని మట్టుపెట్టగల జగజ్జెట్టి మఱొకచోట ఉన్నాడు. అతనిచేతనే రక్తపాతం లేకుండా మగధవిజయం సాధించాలి. ఇక చేది సోదరద్వయాన్ని, సాల్వ సోదర ద్వయాన్ని మేదినిమీద లేకుండా చేయటానికి ప్రత్యేక సమయాలు, పద్ధతులూ ఉన్నాయి. అన్నీ ఒకదాని తరువాత ఒకటి ఒనగూడి వస్తాయి. అప్పటి దాకా ఆగక తప్పదు.



భూదేవోత్తమా! ఈ వాసుదేవుని నమ్మినభక్తులు మోసపోరని మీ వారికి బోధించండి! క్రమప్రణాళిక ప్రకారం మేమూ, మా యదువీరులు సకలకార్యాలు చక్కబెడతాము.

*(ఇంకా ఉంది)*



భగవద్గీత-యువత

# కర్తలను బట్టే కర్మలు

డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్

ఏ కార్యమైనా విజయవంతమైనప్పుడు లేదా అపజయం పాలైనప్పుడు మొట్టమొదట అడిగే ప్రశ్న కర్త గురించే. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఎంతటి జటిల కార్యమైనా కొందరు వ్యక్తులు నడుం కట్టగానే పూర్తిగా సానుకూలమౌతుంది, ఇంకొన్ని సామాన్యకార్యాలైనా కొందరు వేలు పెడితే చాలు సర్వనాశనమౌతాయి.

అందుకే కార్యసాఫల్యంలో కర్తదే మొదటి పాత్ర. ఈ విషయం అర్థం చేసికొన్నవారు కర్త విషయంలో సావధానులౌతారు.

ఇక ఈ కార్యాల విషయంలో ఒకరి పనులను వేరొకరు చేసే అవకాశం లేదు. వారి పనులను వారే చేసికోవాలి. కాని కొందరు ఏ పని చేపట్టినా విఫలమో లేదా సగం జయం కలగడమో జరుగుతూ ఉంటుంది. మరి అప్పుడు వారేం చేయాలి? భగవద్గీతను ఆశ్రయించి మార్గదర్శనం పొందడం ఒక్కటే దానికి మార్గం!

మనిషి ఏ స్థితిలో ఉండి తన సమస్యను సృష్టించుకున్నాడో అదే స్థితిలో అతడు తన సమస్యకు పరిష్కారాన్ని ఇవ్వలేడు. ఒకవేళ కర్మలు సర్వదా విఫలమే అవుతుంటే మనిషి తాను కర్మలుచేసే పద్ధతిని మార్చుకోవాలి. కర్మలలో నిశ్చయంగా విజయం పొందాలంటే కర్త ఎలా ఉండాలో భగవద్గీత తెలియజేస్తోంది.

కర్త మొట్టమొదలుగా అలవాటు చేసికోవలసింది 'సర్వదా ఉత్సాహంగా ఉండడము'. అహంకారానికి, గర్వానికి అతడు తావు ఇవ్వకూడదు. అతడు తాను పడే కష్టాల గురించి చింతించడు. అతనికి జయాపజయాలు అవరోధాలు కావు. సుఖదుఃఖాలు రెండింటిలోను అతడు సమానంగా ఉంటాడు. అంటే అటువంటి కర్త దృఢనిశ్చయముతోను, ఉత్సాహముతోను ఉండి జయాపజయాలలో చలించకుండ తన కర్మలలో నెలకొని ఉంటాడు. అతడినే 'సాత్త్విక కర్త' అంటారు.

ఇక సాధారణంగా ఉండే కర్తల ప్రవర్తన వేరుగా ఉంటుంది. వారు తాము చేసే కర్మల ఫలాల మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. తాను కార్యం చేయలేకపోతే శోకానికి గురౌతూ, ఇంకెవరైనా దానిని చేస్తే వారి పట్ల అసూయతో రగిలిపోతూ, తనకే విజయం రావాలని లోభంలో మునుగుతూ, అంతర్బాహ్యాలలో అశుచియైనటువంటి కర్తలు 'రాజసిక కర్త'లుగా పిలువబడతారు.

ఇటువంటి వ్యవహారము ఉన్నవాళ్ళు శీఘ్రమే తమ నడవడిని మార్చుకొని సాత్త్వికకర్తగా మారే ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా యువత తమ ఏకైక కార్యసాధన అయినట్టి విద్యాభ్యాసములో సాత్త్విక కర్తలై మెలగుతూ పరమోత్సాహముతో విజయాలను సాధించాలి. వారు రజోగుణ కర్త లక్షణాలను ఒక్కొక్కటిగా తీసేసుకోవాలి. వారు తమోగుణకర్త లక్షణాలను దరిచేరనీయకూడదు.

ఇంతకూ తమోగుణకర్త లక్షణాలేమిటి? కఠోరంగా వ్యవహరించడము, ఇతరులను అవమానించడం, సోమరితనం, కాలయాపన చేయడము, పనిలో సావధానంగా ఉండక పోవడం, చేయవలసిన పనులను దాటవేయడం వంటివి తమోగుణ కర్తల లక్షణాలు. వారు పెద్దల మాటలను, శాస్త్రవచనాలను చెవిన పెట్టరు. తమకు తోచిందే చేస్తారు గాని అనుభవజ్ఞుల మాటలను వారు లెక్కజేయరు. మొండితనము, మోసము వారికి సహజము.

ఇటువంటి ప్రమాదకరమైన వ్యవహారము యువతకు ఏమాత్రము లాభదాయకము కాదు, క్షేమకరము కాదు. తమోగుణకర్తలు కనీసము రజోగుణకర్తలుగా మారే ప్రయత్నం చేయాలి, ఇక రజోగుణ కర్త సత్త్వగుణకర్తలుగా మారడానికి ప్రయత్నించాలి. యువత మాత్రము భగవద్గీత నిర్దేశంలో సత్త్వగుణకర్తలుగానే ఉంటూ విజయసీమలలో ప్రయాణించాలి!

# జ్ఞానానందమయుడు-
# హయగ్రీవుడు

శ్రీ అప్పరసు రమాకాంతరావు



**జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిమ్।**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే॥**

బ్రహ్మాండపురాణం, గరుడపురాణాల్లో శ్రీ హయగ్రీవుడి అవతారం గురించిన వివరాలు ఉన్నాయి. హయగ్రీవుడు శ్రీమహావిష్ణువు అవతారం. హయగ్రీవం(వదనం)తో పాటు జ్ఞానం, వివేకం, ప్రజ్ఞల సమాహారం ఈ అవతారం. నిరతిశయ ప్రదశీల అయిన సరస్వతీ దేవికి హయగ్రీవుడే గురువు. శ్రీమహావిష్ణువు విశ్వాన్ని రచిస్తున్న సమయంలో మధు, కైటభులు అనే ఇద్దరు రాక్షసులు, విశ్వనిర్మాణాన్ని అడ్డగించ ప్రయత్నించారు. నాలుగువేదాలను విశ్వానికి అందించే యత్నానికి సైతం ఈ రాక్షసులు ప్రతిబంధకంగా నిలిచారు. సాధారణ వదనంగల రాక్షసులు, మానవులు, మాయావులు, దేవతలు సైతం వీరిని నిర్జించకుండా శివుడితో వరం పొంది ఉన్నారు కనుక, శ్రీమహావిష్ణువు హయ వదనం (గుఱ్ఱపు ముఖం) ధరించి కాలిడెక్కలతో తెలివిగా, ప్రజ్ఞాపాటవాలతో ఈ దానవులను సంహరించాడు. ఆ సందర్భంలో విష్ణువు ధరించిన అవతారమే హయగ్రీవావతారం. హయగ్రీవుడి శక్తి యుక్తుల గురించి కఠశ్రుత్యుపనిషత్తు, హయగ్రీవ ఉపనిషత్తుల్లో వివరంగా వ్రాశారు. నారాయణోపనిషత్తులో హయగ్రీవావతారం దశావతారాల్లో ఒకటిగా పేర్కొన్నారు.

మధుకైటభులసంహారం సందర్భంలో చతుర్వేదాలను, శ్రీమహావిష్ణువు తన శిరస్సులో దాచుకొన్నాడని నారాయణోపనిషత్తు తెలుపుతోంది. అందుకే హయగ్రీవుణ్ణి జ్ఞానానికి సంకేతంగా భావించి ఆరాధిస్తారు. పాతాళ పాలకుడైన అహిరావణుణ్ణి సంహరించే సందర్భంలో హనుమ పంచముఖాలతో భీకరంగా కనిపిస్తాడు. ఈ అయిదు ముఖాల హనుమ పాతాళంలో తొలుత మకరధ్వజుణ్ణి నిర్జించి అహిరావణుణ్ణి హతమారుస్తాడు. ఈ సందర్భంగా పంచముఖి హనుమాన్‌గా మారిన హనుమ ముఖాల్లో అభీష్ట సిద్ధికోసం దక్షిణానికి ఉన్న ఉగ్రనారసింహ వదనం, సకలసౌభాగ్యం కోసం పడమర వైపు గరుడ ముఖం, ఉత్తరం వైపు లక్ష్మి వరాహవదనం, సర్వవిద్యాజయ ప్రాప్తి కోసం ఊర్ధ్వ దిక్కున హయగ్రీవ ముఖం కలిగి ఉంటాడు. అందువల్లే అహిరావణ వధ సులువైంది అంటారు. పదకొండో శతాబ్దానికి చెందిన కంబరుడు రాసిన కంబ రామాయణంలో హనుమ పంచవదనాల్లోని హయగ్రీవవదనం గురించి మధురాతి మధురంగా కవి వర్ణించాడు. అలా హనుమకు, హయగ్రీవుడికి అవినాభావ సంబంధం ఉంది.

హయగ్రీవుణ్ణి జ్ఞానస్వరూపుడిగా ఆరాధిస్తారు. ఆధ్యాత్మిక ఔన్నత్యానికి, వివేకానికి హయగ్రీవుడు పూజనీయుడు. హయగ్రీవస్వామి వైష్ణవ సంప్రదాయంలో ప్రముఖదేవత. లౌకిక విషయాలపై అధ్యయనం ప్రారంభించినపుడు సైతం హయగ్రీవ స్వామిని తప్పక పూజిస్తారు. హయగ్రీవుడికి సామవేదం అంటే చాలా ఇష్టం. డెబ్భైరెండు మేళకర్త రాగాలలో బాహుదారి, ఈశ మనోహరిరాగాలంటే హయగ్రీవుడికి చాలా ఆనందం. శ్రావణ పూర్ణిమ హయగ్రీవ స్వామి అవతరించిన రోజు. ఆ రోజు ఈ దైవాన్ని అర్చించి, అర్చనానంతరం సామాన్యంగా ఈ రెండు రాగాల్లోనే మంగళ హారతి పాటలు గానం చేస్తారు.' *'సింహాసనస్థితే సుందర గురు గుహ నుత లలితే చిదానందనతోహం వందేహం వందేహం'* అనే కీర్తన దీక్షితార్ భక్తితో హయగ్రీవుణ్ణి (వసంతరాగంలో) స్తుతించాడు. అగస్త్యఋషికి లలితాసహస్రనామం ఉపదేశించింది హయగ్రీవుడే! హయగ్రీవుడి వింటి పేరు

**'తారంగం'**. ఈ తారంగంతోనే హయగ్రీవుడు.... హయగ్రీవుడనే రాక్షసుణ్ణి సంహరించాడు. శ్రీకృష్ణావతారంలో మాధవుడు, హనుమకు తారంగం ధరించి తన రామావతారాన్ని చూపించాడని ఆనంద రామాయణంలో వాల్మీకి రాశాడని అంటారు. అందుకే గ్రామాల్లో నేటికీ చిన్న పిల్లలని ఆడించే సందర్భంలో 'తారంగం... తారంగం తాండవ కృష్ణా తారంగం' అని గానం చేస్తుంటారు.

అథర్వ వేదానికి సంబంధించిన హయగ్రీవ ఉపనిషత్తు గొప్ప వాఙ్మయం. ఈ వేదం రెండో మండలంలో ఈ ఉపనిషత్తు ఇరవైమంత్రాలను కలిగి ఉంటుంది. ఆ మంత్రాలలో సర్వం బీజాక్షరాలే! వైష్ణవ సంప్రదాయంలో దీన్ని మహిమాన్విత ఉపనిషత్తుగా పరిగణిస్తారు. ఈ ఉపనిషత్తును శ్రీరాముడు హనుమకు తన పట్టాభిషేక సందర్భంలో చెప్పాడని తెలుస్తోంది. నూట ఎనిమిది ఉపనిషత్తుల్లో హయగ్రీవ ఉపనిషత్తు వందోది. ఇందులో సర్వశ్రేష్ఠుడైన పరబ్రహ్మం గురించిన వివరాలు మంత్రాల రూపంలో ఉంటాయి. యాభై రెండు ఉపనిషత్తుల సంకలనంలో ఈ హయగ్రీవోపనిషత్తు చాలా ప్రధానమైనదని నారద సూత్రాలు వర్ణిస్తున్నాయి. ఇందులోని మంత్రాలన్నీ తాంత్రికమైనవే. సాధకుడు గురువుల ఉపదేశం అనంతరం మాత్రమే వీటిని ఉపాసన చేయాలనే కచ్చితమైన విధివిధానం ఉంది. హయగ్రీవుణ్ణి అశ్వముఖ, అశ్వ శీర్ష, హయశీర్ష అని సైతం సంబోధిస్తారు.



## శ్రీహయగ్రీవ గాయత్రి మంత్రము

**ఓం వాగీశ్వరాయ విద్మహే**
**హయగ్రీవాయ ధీమహి**
**తన్నో హంసః ప్రచోదయాత్ ॥**

హయగ్రీవ ఉపనిషత్తులో ఇరవై మంత్రాలు ఉన్నాయి. వీటిని రెండు భాగాలుగా విభజించారు. విష్ణు, ఇంద్ర, గరుడ, సూర్య... బృహస్పతులను స్మరిస్తూ ఆవాహన చేసే మంత్రాలు ఇందులో ఉంటాయి. బ్రహ్మ తొలుత తన మానస పుత్రుడైన నారదుడికి ఈ ఉపనిషత్తును ఎరుకపరిచాడు. లోకానులోకాలలో తిరిగే నారదుడికి వివేకం, ఆత్మ జ్ఞానం, స్మృతులు, పురాణాల గురించిన అవగాహనకోసం ఈ హయగ్రీవోపాసక మంత్రాలను నారదుడికి ఉపదేశించాడని బ్రహ్మాండ పురాణంలో ఉంది. హయగ్రీవుణ్ణి ఈ ఉపనిషత్తులో స్థూలవిశ్వానికి అతీతమైన ఉత్తారకుడు, ముక్తిదాతగా కీర్తించారు. రెండోభాగంలో ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదాల సంపూర్ణసారంగా ప్రణతిల్లారు. ఓంకారానికి హయగ్రీవుడే అధినేత. హయగ్రీవ మూర్తిలోని నాలుగు చేతుల్లోని రెండింటిలో శంఖ, చక్రాలు, మూడో హస్తంలో పుస్తకం కనిపిస్తుంది. నాలుగోచేతిలో మహాముద్ర దర్శనమిస్తుంది. హయగ్రీవ నవవింశతి మంత్రం... *'ఓం శ్రీం హ్లౌం ఓం నమో భగవతే హయగ్రీవాయ విష్ణవే మహ్యం మేధం ప్రజ్ఞానం ప్రయచ్ఛ స్వాహా'*, మరో అష్టావింశతి మంత్రం.... *'ఓం శ్రీం హ్రీం ఐం ఐం ఐం క్లీం క్లీం సౌః సౌః హ్రీం ఓం నమో భగవతే హయగ్రీవాయ మహ్యం మేధం ప్రజ్ఞానం ప్రయచ్ఛ స్వాహా'* ఈ రెండు మంత్రాలను గురువుల ఉపదేశం అనంతరమే ఉపాసించాలన్నది నిశ్చిత నియమం. హయగ్రీవోపనిషత్తులోని రెండో విభాగంలో రెండు బీజాక్షర సహిత రెండు మంత్రాలు ఉన్నాయి. మొదటిది 'అమృతం కురు కురు స్వాహా....' ఈ మంత్ర సాధన వల్ల అక్షరాలపై నియంత్రణ, ఐశ్వర్యం. అష్టసిద్ధులు లభిస్తాయని అంటారు. రెండోది 'హ్లౌం సకల సామ్రాజ్య సిద్ధిం కురు కురు' అనే మంత్రం. ఇవన్నీ గురూపదేశం అనంతరమే గురువు ఆజ్ఞతో సాధన చేయాల్సి ఉంటుంది.

సంప్రదాయం అనుసరించి హయగ్రీవుణ్ణి శుద్ధ ఏకాదశిరోజు పూజించాలని అంటారు. శుద్ధఏకాదశి విష్ణువుకు చాలా ఇష్టం. ఈ రోజు హయగ్రీవుణ్ణి పూజిస్తే సకల కార్యాలు, విద్య, జ్ఞానం సిద్ధిస్తాయన్నది ఒక నమ్మకం. ప్రతి గురువారం హయగ్రీవ స్తోత్రం చదవడం అన్నివిధాలా మంచిదన్నది ఆధ్యాత్మిక శాస్త్రీయుల మాట!

*గత సంచిక తరువాయి భాగం.....*



## పద్మావతీదేవి కటాక్షం

తోటి భక్తులు ఎవరూ గ్రహించలేని అతని ఆకలిని గ్రహించిన ఆ అమ్మలగన్నయమ్మ, చాలపెద్దమ్మ, సురారులకమ్మ అయిన అలివేలుమంగమ్మ గ్రహించింది. ఆ సర్వమంగళ మంగళకరమై ఒప్పారు పెద్దముత్తైదువ వేషం ధరించి అన్నమయ్య చెంతకు వచ్చింది. ప్రపంచంలో బిడ్డ ఆకలిని గుర్తించేది ఒక్క తల్లే కదా!

"నాయనా! చూస్తే బాగా అలసిపోయున్నావు. సొమ్మసిల్లి నట్లున్నావు" అని అమ్మ పలకరింపుతో అన్నమయ్య పరవశించి పోయాడు. తనకు ఆకలిబాధ, అలసట తొలగి వేగంగా ఆ తిరువేంకటనాథుని దర్శించే భాగ్యం పొందే మార్గాన్ని ఉప దేశించమన్నాడు.

అనవుడు కమలా మహాదేవి శిశువుఁ
దన కృపామృత ధారఁ దనివినొందించి
బాలక! యీ మహా పర్వతేంద్రంబు
లాలిక సకల సాలగ్రామ మయము
ఘనులకు నిది చెప్పుఁగాళ్ల నెక్కంగఁ
జనదు నీ చెప్పులు సడలించివైచి
కనుగొన కన్నులఁ గనవచ్చు ననిన
విని బాలుఁడట్ల కావింతు నేననుచు

(అన్నమాచార్య చరిత్ర, పుట.157)

"నాయనా! పరమపావనమై, సాలగ్రామ మయమైన ఈ తిరుమల పర్వతంపై పాదరక్షలతో నడవడం వలన నీకు నా స్వామి సందర్శన మార్గము కనబడుటలేదు. ఒక్కసారి ఆ పాదరక్షలు వదలి చూడు నీ చుట్టూ ఉన్న పర బ్రహ్మతత్త్వం గోచరిస్తుంద"ని ఆ కమలనయన చెప్పింది. అమ్మ మాట జవదాటని వాడు అన్నమయ్య. వెంటనే పాదరక్షలు తీసి వేశాడు. అప్పటి వరకు చెట్లు, పుట్టలు, గుట్టలుగా కనిపించిన తిరుమల కొండ ఇప్పుడతని కంటికి సర్వం విష్ణుమయంగా తోస్తున్నది. తనకు ఆ భాగ్యం కలిగించిన ఆ జగన్మాతకు అభివాదం చేశాడు. ఆ తల్లి ఈ బిడ్డడికి తాను వెంట తీసుకు వచ్చిన శ్రీవారి ప్రసాదం అన్నమయ్యకు అందించి తినమని చెప్పింది. ఆ ప్రసాద భుక్తితో అన్నమయ్య సంతుష్టాంతరంగుడై నాడు. అమ్మవారు ప్రసాదించిన ప్రసాదాన్నం తిన్న తరువాత అన్నమయ్యకు పర్వతమంతా భగవన్మయంగా కనిపించింది. తనను కనికరించి, కటాక్షించ దానికి కదలివచ్చిన ఆ తల్లిని అలిమేలుమంగగా భావించి, ఆశువుగా శతకపద్యాలతో అర్చన చేశాడు.

"అమ్మకుఁ దాళ్లపాక ఘనుఁ డన్నఁడు పద్య శతంబుఁ జెప్పెఁగో
కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలు మంగకున్"


(ఇంకా ఉంది)



# మహిమాన్వితదైవం శ్రీఆదివరాహస్వామి

– శ్రీ మేడూరి అప్పలాచార్యులు

ఆదివరాహక్షేత్రం, కలియుగవైకుంఠం తిరుమల నిత్యం వేలాదిమంది భక్తులు తరలి వచ్చే పుణ్యక్షేత్రం. కాని, శ్రీవారికంటే ముందు తిరుమలలో వెలసిన మరొకదేవుడు ఉన్నాడు. విష్ణువు రూపధారియైన వరాహస్వామి తిరుమలకు అధిపతి. శ్రీవారి పుష్కరిణికి వాయవ్యమూలలో తూర్పు అభిముఖంగా వరాహస్వామి ఆలయం ఉంటుంది. శ్రీవరాహస్వామి



ఆదివరాహస్వామిగా అవతరించి భూదేవిని రక్షించి ఈ క్షేత్రంలో వెలసినారట. అందుకే, ఈ క్షేత్రం ఆది వరాహక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. అటు తర్వాత కొంతకాలానికే వేంకటేశ్వరుడు వైకుంఠాన్ని వదలి ఇక్కడ వచ్చి ఉండడానికి వరాహస్వామిని 100 అడుగుల స్థలాన్ని దానంగా అడిగాడట. అందుకు ప్రతిఫలంగా ముందుగా నీకు పూజలు, నైవేద్య సమర్పణ లభిస్తుంది మరియు నా భక్తులు మొదట నీ దర్శనం చేసుకునే, నావద్దకు వస్తారు అనే హామీని శ్రీవారు ఇచ్చారట. అందుకే, ఇప్పటికి ప్రథమ దర్శనం, ప్రథమ పూజ వరాహస్వామికే అన్నట్లుగా తిరుమలలో సాగుతున్నది.

వరాహస్వామి ఆలయ ప్రస్తావన శాసనాలలో దొరుకుతుంది. శ్రీవేంకటేశ్వరస్వామికి ఆదిగురువు వరాహస్వామి. జ్ఞానప్రదాత అయిన గురువు ద్వారానే భగవంతుని దర్శించాలి. వరాహస్వామికి మూడుపూటలా వైఖానసఆగమం ప్రకారం పూజలు నివేదనలు సమర్పిస్తారు. శ్రీవారి ఆలయం నుంచే ప్రసాదాలు తీసుకొని వచ్చి స్వామివారి కంటే ముందుగా శ్రీవరాహస్వామివారికి సమర్పిస్తారు. అలాగే ప్రతి శుక్రవారం వరాహస్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు.

## యజ్ఞవరాహమూర్తి

శ్రీవరాహమూర్తి, వరాహావతారము, వరాహస్వామి ఇవన్నీ శ్రీమహావిష్ణువు మూడవ అవతారమును వర్ణించే నామములు. హిందూ పురాణాల ప్రకారం త్రిమూర్తులలో విష్ణువు లోకపాలకుడు. సాధుపరిరక్షణ – దుష్టశిక్షణకొరకు ఆయన ఎన్నో అవతారాలతో యుగయుగాన అవతరిస్తాడు. అలాంటి అవతారాలలో 21 ముఖ్య అవతారాలను దాల్చాడు. వానిలో అతిముఖ్యమైన వాటిని 'దశావతారాలని' అంటారు. ఈ దశావతారములలో మూడవ అవతారము 'వరాహావతారము'. మహాలక్ష్మిని సంబోధించే 'శ్రీ' పదాన్ని చేర్చి శ్రీవరాహమూర్తి అని ఈ అవతారమూర్తిని స్మరిస్తాము. వరాహావతారము హిరణ్యాక్షుడిని చంపి భూమిని ఉద్ధరించి వేదములను కాపాడిన అవతారము.

శ్రీవరాహస్వామి ఆదివరాహమూర్తి, యజ్ఞవరాహమూర్తి, మహాసూకరం అని నామాలు కూడా ఉన్నాయి. తిరుమల కొండపై మొదట వెలసిన స్వామి వీరే! వీరి



శ్రమించని వాళ్లను దేవతలు కూడా అభిలషించరు

అనుమతితోనే శ్రీవేంకటేశ్వరుడు అక్కడ నివాసము ఏర్పాటు చేసుకున్నారు.

మహాసముద్రంలో మునిగిపోయిన భూదేవిని హిరణ్యాక్షుడనే రాక్షసుని హతమార్చేందుకు ఈ అవతారం ఎత్తవల్సి వచ్చింది. ప్రళయం తర్వాత కొత్త కల్పం ప్రారంభ మైంది. తిరిగి సృష్టిని ప్రారంభించడానికి బ్రహ్మదేవుడు పూనుకున్నాడు. ప్రళయం వల్ల జగమంతా జలమయమై పోయింది. భూదేవి ఒక మహాసముద్రంలో మునిగిపోయి ఉంది. బ్రహ్మదేవుని దేహం నుంచి స్వయంభువమనువు, శతరూప జన్మించారు. నిష్కల్మషంగా స్వార్థం లేకుండా భూమిని పాలించమని బ్రహ్మదేవుడు వారిని ఆజ్ఞాపించాడు. ఆ సమయంలో భూమినీళ్లలో మునిగిపోయి ఉండడంతో స్వయంభువ, శతరూపులకు ఏం చేయాలో తోచలేదు. బ్రహ్మదేవుని సూచన మేరకు ఇప్పుడు ఏం చేయాలో సూచించమని విష్ణుమూర్తిని ప్రార్థించారు. అప్పుడు వారి ద్దరికి ఒక చిన్న వరాహమూర్తి వారి ముందు ప్రత్యక్షమైంది. క్షణాలలో ఆ వరాహం ఒక పర్వతమంత ఎత్తుకు ఎదిగి పోయింది. ఆ వరాహం వేరెవరో కాదు శ్రీమహావిష్ణువే నని గుర్తించారు. బ్రహ్మ, స్వయంభువు- శతరూపులు నీళ్లలో మునిగిపోయిన భూదేవిని పైకి తీసుకురావడానికి ఆ సముద్రంలోకి ప్రవేశించింది ఆ మహావరాహం. ఆ కాలంలో హిరణ్యాక్షుడనే రాక్షసుడు ఉండేవాడు. అతనికి తన బలం మీద నమ్మకంతో దేవతలను తరిమివేశాడు. దేవతలను రక్షించే విష్ణుమూర్తిని సంహరించి భూమిని చాపలా చేయాలనుకున్నాడు. ఆ సమయంలో హిరణ్యాక్షుడు అడవులలో సంచరించవల్సిన వరాహం పాతాళంలో ఉన్నదే మని, వీడేనేమో ఆ శ్రీహరి అని 'ఓ శ్రీహరి! పందిరూపం దాల్చి పాతాళంలో దాక్కున్నావా' అని, 'ఈనాడు నీకు నా చేతిలో చావు మూడింది రా!' అని, 'నాతో యుద్ధం చెయ్యి రా! గదాదండంతో నీ శిరస్సు ఖండిస్తాను', అని శ్రీహరి వైపు రాసాగాడు. కాని శ్రీహరి ఇవేమి పట్టించుకోకుండా భూమిని తన కోరలపై నిలిపి, పైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న వాడై ఉండగా వానిని హిరణ్యాక్షుడు అడ్డగించి 'ఓయి పిరికిపందా! నా మాటలు పట్టించుకోకుండా పైకి వెళ్తు న్నావా? నాతో యుద్ధం చెయ్యి ఆ భూమి మొత్తం నా సొంతం. నన్ను ఓడించి దానిని తీసుకొని వెళ్లు' అని అనరాని మాటలు అని శ్రీహరిని ఆపాడు. శ్రీమహావిష్ణువు భూమిని ప్రక్కనే ఉంచి, హిరణ్యాక్షునిపై యుద్ధం చేయుటకు సన్నద్ధు డయ్యాడు. ఇద్దరూ భయంకరయుద్ధం చేశారు. చివరకు యజ్ఞవరాహస్వామి ముందు హిరణ్యాక్షుడు తాళలేక పోయాడు. శ్రీహరి తన చక్రంతో అతని యెదను ఒక వేటుతో నరికేశాడు. వరాహమూర్తి అతనిని సంహరించిన తర్వాత అతని రక్తధారలతో భూమిని తన కోరలపై నిలిపి, నీటిపైకి వచ్చి భూమిని నీటిని ఉపరితలాన నిలిపి, శంఖ చక్రగద దివ్యాయుధాలతో తన నిజరూపాన్ని ధరించాడు. శ్రీమన్నారాయణుడు శ్రీయజ్ఞవరాహస్వామి మూర్తిగా అవతరించి ఈ భూమండలాన్ని కాపాడి, సమస్త జీవరాశిని రక్షించాడు. ఈ విధంగా వరాహ అవతారాన్ని పరిసమాప్తం చేశాడు.

## వరాహపురాణం ప్రకారం

ప్రళయం తర్వాత బ్రహ్మసృష్టికల్పనలో నిమగ్నమై ఉన్నప్పుడు మనువును శతరూపను సృష్టించాడు. వారితో భూమాత ఎక్కడ ఉందో తెలుసుకోమని చెప్పాడు. వారు విష్ణువును ప్రార్థించగా, బ్రహ్మనాసికనుండి చిన్ని వరాహ మొకటి ఉద్భవించింది. అది చూస్తుండగానే పర్వతమంత ఎదిగిపోయింది. అది ఎవరోకాదు శ్రీమహావిష్ణువు. హిరణ్యాక్షుడనే రాక్షసుడు శ్రీహరిని వెతుకుతూ వరుణదేవుని చేరుకోగా తాను అతనితో యుద్ధం చేయలేనని శ్రీహరి దగ్గరకు వెళ్లమని చెబుతాడు. హిరణ్యాక్షుడు శ్రీహరిని ఉన్న చోటికి వచ్చి భూమిని తనకు అప్పగించమని లేదంటే యుద్ధం తప్పదని హెచ్చరిస్తాడు. విష్ణువు హిరణ్యాక్షుని మాటలు పట్టించుకోక, భూదేవితో సహా సముద్రంపైకి వెళుతాడు. సముద్రంపైన భూదేవిని నిలబెట్టి సృష్టికి అనుకూలస్థితి కల్పిస్తుంది వరాహం. తన్ను వెంబడించి వస్తున్న హిరణ్యాక్షుణ్ణి సంచరించక తప్పదని, అతనితో యుద్ధానికి తలపడుతుంది వరాహం. ఆ ఇద్దరిలో హిరణ్యాక్షుణ్ణి సంహరిస్తుంది ఆ వరాహం. లోకకంటకుడైన రాక్షసుని సంహరించిన ఆ మహాఅవతారాన్ని ఎన్నో విధాలుగా స్తుతించి ధన్యవాదాలు తెలుపుతారు దేవతలు.

# గోవింద గోవిందయని కొలువరే...

డా॥ ఎన్.వి.శ్రీనివాసరావు



ఓ గోవిందా! గోకులముచేత
ఆశ్రయింపబడిన మహానుభావ!
బృందావన పావన చరిత!
పరమానంద స్వరూప!
నీకు జయమగుగాక!
జయమగుగాక!!

## 'గోవిందనామ' మాహాత్మ్యం

విరాట్స్వరూప సంపూర్ణాంశగా, విశ్వబ్రహ్మగా, సిరికి సొంతంగా, వటపత్ర శాయిగా, యుగాలకు సరైన స్థానం కల్పించిన యుగకర్తగా, అనేకానేక ధర్మాలు, నీతినియమాలు, సూక్ష్మాలు, తర్కాది సర్వవిద్యలు మానవాళికి తెలిపేందుకు అనేక అవతారాలెత్తి, ఒకదానికొకటి పొంతన లేకపోయినా, ప్రతిదానిలోనూ ఏకైక సారూప్యమైన సత్యధర్మాలను సంరక్షించిన శ్రీహరికి ఎన్నో నామాలు, ఎన్నో తీరులూ ఉన్నాయి. అందులో మొదటిది 'కేశవ'నామం. ఏ పూజ, వ్రతం, నోములైనా సంకల్పానికి ముందు ఆచమనం చేయడానికి ఈ 'కేశవనామాలు' మనం పఠిస్తున్నామంటే ఆ 'కేశవనామాలు' ఎంతటి మహిమాన్వితమో కదా! ఆచమనం లేని సంకల్పం లేదు. సంకల్పం లేని పూజలేదు. గనుక, ఈ కేశవనామాలు ఏ పూజకైనా ముఖ్యమైనవని తెలియాలి.

శ్రీమహావిష్ణువుకు గల కేశవనామాలు– 01)ఓం కేశవాయనమః 02)ఓం మాధవాయనమః 03)ఓం విష్ణవే నమః 04)ఓం త్రివిక్రమాయనమః 05)ఓం శ్రీధరాయనమః 06)ఓం పద్మనాభాయనమః 07)ఓం సంకర్షణాయనమః 08)ఓం ప్రద్యుమ్నాయనమః 09)ఓం పురుషోత్తమాయనమః 10)ఓం నారసింహాయనమః 11)ఓం జనార్దనాయనమః 12)ఓం హరయేనమః 13)ఓం నారాయణాయనమః 14)ఓం గోవిందాయనమః 15)ఓం మధుసూదనాయనమః 16)ఓం వామనాయ నమః 17)ఓం హృషీకేశాయనమః 18)ఓం దామోదరాయనమః 19)ఓం వాసుదేవాయనమః 20)ఓం అనిరుద్ధాయనమః 21)ఓం అధోక్షజాయనమః 22)ఓం అచ్యుతాయనమః 23)ఓం ఉపేంద్రాయనమః 24)ఓం శ్రీకృష్ణాయనమః

అమోఘమైన కేశవనామాలలో 'ఓం గోవిందాయ నమః' అనే నామాన్ని పఠిస్తే కలిగే ఫలితం వర్ణనాతీతం. ఎందుకంటే, గోవింద అనే పదంలో శ్రీమహావిష్ణువు దివ్యావతారాలుగా పేర్కొనబడుతూ, మానవదైనందిన జీవనంలో కలిసిపోయే దశావతారాలు అన్నీ నిక్షిప్తమై ఉన్నాయి. అంటే గోవింద అని పలికితే, దశావతార మూర్తులందర్నీ పిలిచినట్లే. దశావతారమూర్తులను పిలవడమంటే భూలోకాన్నంతటిని ఒకే ఊరు చేసి పాలించే సర్వజగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువును ఎలుగెత్తి దీనంగా పిలిచి, మన కష్టాలను తీర్చి, మనలను ఆపదలనుంచి గట్టెక్కించి రక్షించమని అర్థించాడన్నమాట. అలా మనం 'గోవిందా' అంటూ మొరపెట్టుకుంటే చాలు– ఆర్తత్రాణపరాయణుడు అలవైకుంఠపురంలో ఉన్నా... పరుగెడుతూ శ్రీలక్ష్మి చీర చెంగునైనా వదలకుండా వడివడిగా వచ్చి మనలను సంరక్షిస్తాడు.

'గోవింద' అనే ఒక్కపదంలో దశావతారాలు దాగి ఉండడం ఏమిటనే ఆశ్చర్యం కలగవచ్చు. కానీ, ఇది అక్షరాల నిజం. 'గోవింద' పదానికి ఉన్న ప్రత్యేకత అది.

## 'గోవింద'లో దాగిఉన్న కథనం

'గో' అనే పదానికి గల వివిధ అర్థాలే గోవింద నామాన్ని అంత ఉత్కృష్టం చేశాయి.

## 'గో' అంటే వేదం అనే అర్థం ఉంది

వేదం అనగానే రాక్షసబారి నుండి రక్షించిన మత్స్యావతార కథనం మనకు గుర్తుకు వస్తుంది. దశావతారాలలో తొలి అవతారమైన మూర్తిని స్తుతించి పఠించినట్లే. వేదాలు సంరక్షించినట్లు మనలను సంరక్షిస్తాడన్నమాట స్వామి.

## మంథరపర్వతం కథనం స్ఫురింపజేసిన 'గో'

'గో' అంటే పర్వతం అని మరొక అర్థం కూడా ఉంది. దీన్ని బట్టి మంథరపర్వతాన్ని మోసి, దేవదానవులకు ఒక నిర్ణీతత్వం ఆపాదించిన కూర్మావతారం గుర్తుకు వస్తుంది. అంతర్గత పురాణప్రవచనం ప్రకారం పాలసముద్ర మథనం చేసినది శ్రీమహావిష్ణువే అని కూడా అంటారు. కనుక, గోవింద అంటే కూర్మస్వామిని తలంచి పఠించినట్లే!

## భూదేవి పతిగా 'గోవింద'

'గో' అంటే భూదేవి అని మరొక అర్థం కూడా ఉంది. కనుక ఆ అక్షరం భూదేవిని కూడా తలపింపజేస్తుంది. ఈ భూమి నిలవడానికి, ఈ భూమి మీద మానవజీవనం సజావుగా సాగడానికి ఆధారం శ్రీమహావిష్ణువే! సృష్టి తొలిదశలో అమిత సిరిసంపదలతో నిండిన భూదేవిని తన సొంతంగా చేసుకుంటే, సకలైశ్వర్యవంతుడిని, సంపూర్ణ బలసంపన్నుడిని అవగలననే ఆలోచనలతో భూదేవిని అపహరించి కైవసం చేసుకోదలిచాడు. అత్యంత రాక్షసబలక్రూరసంపన్నుడైన హిరణ్యాక్షుడు. అయితే నారాయణుడు అతి అల్పప్రాణి అయిన 'వరాహంగా' జన్మించి, తన వాడియైన దంతాలవంటి కొమ్ములతో పొడిచి సంహరించి– భూమండలాన్ని, సర్వప్రాణికోటిని పరిరక్షించాడు. వరాహస్వామి ఆనాడు ఆ సంహారం సర్వాంతర్యామిగా చేసి ఉండకపోతే ఈనాడు మనకు ఈ జీవనాధారమైన భూమి ఉండేది కాదు. కనుకనే గోవింద అంటే వరాహస్వామిని ఆర్తిగా పిలిచి, భూమిపై నిలిచిన మనలను సదా పరిరక్షించమని ప్రార్థిస్తున్నట్లుగా భావించాలి.

## దేవదేవులే 'గోవింద' అంటూ స్తుతించారు ఉగ్రస్వామిని-

బాలభక్తుడైన ప్రహ్లాదుని దీవించడం కోసం, ఆతని భక్తిని, విశ్వాసాన్ని లోకానికి చాటడంకోసం, క్రూరదౌష్ట్యం నుంచి కాపాడటంకోసం తప్పు చేసినవాడు తండ్రియైన దండించే నీతి తెలిపాడు. భూమికి, తన భక్తులకు నీచ దుష్టుల నుండి విముక్తి కలిగించడం కోసం నిర్ణీతత్వం లేని ఉగ్రరూపంలో నరసింహస్వామిగా అవతరించాడు. శ్రీమన్నారాయణుడిని దేవాదిదేవులే 'గోవింద' అంటూ స్తుతించారు. ఉగ్రత్వం నుంచి స్వామిని శాంత మూర్తిని చేయడం కోసం దేవాదిదేవులు, మహర్షులు, సాధు పుంగవులు పరిపరి విధాలుగా కీర్తించసాగారు పరమాత్ముడిని. నరసింహావతారానికి నిర్ణీతత్వం లేదు గానీ, మహోన్నతం ఉంది. 'దేవుడు అనేవాడు లేడు' అనే నాస్తికులకు, దేవుడు ఉన్నాడనే విషయాన్ని ఖచ్చితంగా ఋజువు చేసినది నరసింహావతారమే. మానవునిగా జనించి పెరగడం, విద్యాబుద్ధులు నేర్చుకోవడం వంటివేవి లేకుండా, ఎవరూ ఊహించని విధంగా యథాలాపంగా అవతరించాడు. ఎవరూ ఊహించలేని విధంగా దుష్టశిక్షణ చేయడంవంటి మహోన్నతాలకు ఆటపట్టైన నరసింహావతారాన్ని 'ఉగ్రం' అనేకంటే నిప్పులాంటి నిజాన్ని నిరూపించడానికి స్వామి పడిన శ్రమకు సంకేతంగా అనుకుంటేనే సమంజసం. అత్యంత కష్టమైన పని చేయాలంటే మనం ఎంతో శ్రమపడతాం. ఆ శ్రమ చెమట రూపంలోనూ, చిరాకుగానూ బహిర్గతం అవుతుంది. మరి అస్త్ర శస్త్ర వివిధశాస్త్రాలు నేర్చిన అత్యంత శక్తిసంపన్నుడైన అసురుణ్ణి సంహరించాలంటే ఎంతో శ్రమపడాలి. శ్రమకు మరో రూపమే ఉగ్రత్వం. కనుకనే ముక్కోటి దేవతలకు దేవుడైనాడు నరసింహస్వామి. అందుకే, ఆయనను అంతా 'గోవింద' అని స్తుతించారు. 'గోవిందా' అని భక్తిగా పిలిస్తే ఎవరూ ఊహించలేని విధంగా పరంధాముడు కదలి వచ్చి మనలను జీవితాంతం అన్ని రకాలుగా కాపాడుతాడన్న మాట.

ఈ విధంగా శ్రీహరి 'గోవింద' అనే నామం ద్వారా దశావతారాలు దాల్చి మానవాళికి శ్రేయస్సును కలిగించాడు. గోవిందనామాలు, గోవింద అనే నామాన్ని అనుక్షణం జపించే వారికి ఆ దేవదేవుని కటాక్షం లభిస్తుంది. వారికి సకలశుభాలు కలుగుతాయి.

*శ్రీనివాస వరద గోవిందా! గోవిందా!! గోవిందా!!*

# శ్రీవిఖనస మునీంద్రుల ఉపదేశసారం

– ఆచార్య వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులు

శ్రీమన్నారాయణాంశసంభూతులు **'విఖనోమునీంద్రులు'**. సృష్ట్యాదియందు సకలచరాచరజీవరాశి వేదధర్మాన్ని ఆశ్రయించాలని, అందరికి వేదమార్గమే శరణ్యమని, లౌకిక జీవనం వలన ఫలం అల్పమని, శాశ్వత సుఖం వైదికధర్మం ద్వారానే సిద్ధిస్తుందని స్వాయంభువమను కాలమున శ్రీమన్నారాయణుడు తన హృదయమందు ఖననము చేసుకొని, తనతో సమానమైన ఒక మునిశ్రేష్ఠుని మనస్సు ద్వారా సృష్టించాడట. మనస్సులో విశేషముగా 'ఖననము' చేయుట వలన ఆ మునిపుంగవునికి **'విఖనసుడు'** అను నామము ఏర్పడినది. వీరిచే ప్రతిపాదింపబడినదే **'వైఖానస సిద్ధాంతం'**. విఖనోమునులు వీరి శిష్యులైన **భృగు, మరీచి, అత్రి, కశ్యప మహర్షులకు** శ్రౌత, గృహ్య, ధర్మ, ప్రవర అనే నాలుగు విభాగాలతో ఒక **'కల్పసూత్రం'** గృహార్చనతో ఉపదేశించినారు. ఆ కల్పసూత్రాన్ని అనుసరిస్తున్న వారే **'వైఖానసులు'**. వీరికి దీక్షా విధానం లేదు. ఆజన్మ వైష్ణవులు, వీరు ఆగర్భ చక్రాంకితులు కూడా. వీరి సిద్ధాంతంలో ఇతరులకు ప్రవేశం లేదు. ఈ వైఖానసాగమ విధానంతోనే అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామికి అర్చనాదులు, షట్కాలపూజలు, పారంపర్యానుగతంగా వైభవంగా జరుపబడుతూ ఉన్నాయి.



అన్ని సంస్కారాలలో హోమమంత్రాలు, ప్రాయశ్చిత్త మంత్రాలు, గృహార్చాప్రతిష్ఠ, గృహార్చనం ఈ అంశాలు విశేషమైనవి. సన్న్యాసిధర్మాలు పరిశీలిస్తే, సన్న్యాసిధర్మం నిష్కామంగా ఉండాలని అది ప్రవృత్తి నివృత్తి రూపంలో నిర్ణయింపబడి, నివృత్తి ధర్మం **'జితేంద్రియో భూత్వా శరీరం విహాయ క్షేత్రజ్ఞ పరమాత్మనోః యోగం కృత్వా అతీంద్రియం సర్వజగద్ బీజం అశేషవిశేషం నిత్యానందం అమృతరసపానవత్ సర్వదాతృప్తికరం పరంజ్యోతి ప్రవేశం (వైఖానస కల్పసూత్రం 9-9-73)'** అని సన్న్యాసి శరీరాన్ని విడిచి పెట్టి పరమాత్మునితో యోగం చెంది ఆ పరంజ్యోతి స్వరూపాన్ని పొందటమే నివృత్తి ధర్మం.

బ్రహ్మచారి-గృహస్థ-వానప్రస్థ-సన్న్యాసి అనువారలు వేదధర్మాల్ని అనుసరిస్తూ, శ్రీమన్నారాయణుని దివ్యానుగ్రహం పొందుతూ, జన్మసాఫల్యం పొందటమే వైఖానస సిద్ధాంతం. వైఖానస సిద్ధాంతంలో ప్రధానమైనది అర్చనం. ఇది ఆలయార్చనమని, గృహార్చనమని రెండురకాలు. గృహార్చనం స్వార్థయజనం. ఆలయార్చనం పరార్థయజనం. పరమాత్మ రెండు



వైభవంతో (సిరిసంపదలతో) గుణాలను పొందలేరు

రకములు. సగుణస్వరూపుడు, నిర్గుణస్వరూపుడు. నిర్గుణ స్వరూపుడు యజ్ఞాధిదేవత. సగుణస్వరూపుడు ఆలయాధిదేవత. సగుణస్వరూపదర్శనం కంటే నిర్గుణస్వరూపదర్శనమే మోక్షప్రవే శనమని వైఖానస సిద్ధాంతం.

**సగుణే బ్రహ్మణి బుద్ధిం నివేశ్య పశ్చాత్ నిర్గుణం బ్రహ్మాశ్రిత్య మోక్షే నిత్యం యత్నం కుర్యాదితి విజ్ఞాయతే. (వైఖానస కల్పసూత్రం 8-11-113)**

## వైఖానస ధర్మాలు

**01)** ద్వేషము లేనివాడై, వాక్కు మనస్సులకు అనుకూలంగా ప్రియము సత్యమునే ఎల్లప్పుడు మాట్లాడవలయును (8-2-21).

**02)** తపస్సులకు మూలము శ్రమణం. అందుచే తపస్సు చేయు వారల యొక్క అగ్నిహోత్రము శ్రామణకం అనబడుచున్నది. (9-5-40).

**03)** ద్విజాతి అయినవాడు సంధ్యావందనాది కర్మలు ప్రతి నిత్యము విధిగా ఆచరించవలయును (9-10-75).

**04)** నిత్యజపహోమ అర్చన ధ్యానములకు అనధ్యయనము లేదు. (9-11-89).

**05)** అందరికీ తల్లి గొప్పది. (9-11-83).

**06)** ఈలోకంలో పరలోకంలో అందరికి శ్రేయస్సును అందించు నది వేదము. వేదాధ్యయనము పారంపర్యానుగతంగా చేయతగినది. (9-12-93)

**07)** నిత్యము శ్రుతి, స్మృతులచే చెప్పబడిన కర్మలను ఆచరిం చుచు మనోవాక్కాయ కర్మలతో ధర్మమును ఆచరించుట శ్రేయస్కరము. (9-15-131).

**08)** అసత్యవాదము శ్రేయస్కరము కాదు. (10-1-11).

**09)** దున్నబడిన భూమిని దాటకూడదు. (10-5-68).

**10)** వేదవేదాంతార్థవిచారణతో ధ్యానయోగియై తపస్సును ఆచ రించవలయును. (10-5-77)

ఇట్టి వైఖానససూత్ర ధర్మాలను ఆచరించి వేద ధర్మ ఆచరణతో జీవయాత్ర సాగిస్తూ, ఆర్షధర్మప్రబోధాన్ని విస్తరిస్తూ అలౌకికమైన ఆనందాన్ని పొందటానికి అనుక్షణం ఆరాటపడ టమే వైఖానస ధర్మం.



ఉపాసనమనగా ఆరాధనం. వేదమంత్రసహిత ఆనంద రూపుడగు పరమాత్ముని అనుగ్రహం పొందటమే ఉపాసన. ఈ ఉపాసనారూపక్రియ ఉత్తమబ్రహ్మవిద్య. సమారాధనరూప జప- హోమ- అర్చన- ధ్యానములలో అర్చన సర్వార్థసాధనం. అర్చనం లక్ష్మీ సహిత శ్రీమన్నారాయణునకే చేయునది. అది శరణాగతి తత్త్వంతో నిర్ణయింపబడినది. ఆ శరణాగతి తత్త్వం వైఖానసులకు జన్మసిద్ధం. 'ఉపాసనం' సమారాధనం, 'ఉపా స్యుడు' పరమాత్మ, 'ఉపేతుడు' జీవుడు, పరమాత్మ అనంతకల్యాణ గుణాకరుడు హేయగుణరహితుడు ఆకారవాచ్యుడు సర్వకారణ భూతుడు సర్వరక్షకుడు వేంకటగిరివాసుడైన శ్రీనివాసుడు.

వేదసమ్మతమై వైదికారాధన సర్వదైవత్య వాఙ్మయ సర్వస్వమై ఐహిక- ఆముష్మిక ఫలసాధనమై శ్రీనివాసునకు అత్యంత ప్రీతిపాత్రమై విలసిల్లు వైఖానస వాఙ్మయ ధర్మం సర్వులకు శిరోధార్యం.

*ఓం నమో నారాయణాయ*

# శ్రావణఉపాకర్మ

- శ్రీ వేదార్థం మధుసూదనశర్మ

శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రమైన శ్రవణానక్షత్రం పేరు మీదుగా ఏర్పడినది 'శ్రావణమాసం'. ఇది సకల సౌభాగ్యాలకు, సిరిసంపదలకు, శుభకార్యాలకు ఆవాసం.

*'ఉత్సర్జనోపాకర్మణీ ఋగ్యజుఃశ్రావణీ, రక్షాబంధః పౌర్ణమాసీ వ్రతం'*– అనే శాస్త్రవచనం అనుసరించి శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఉత్సర్జన, ఉపాకర్మ, రక్షాబంధనం మొదలైన వాటిని ఘనంగా జరుపుకుంటారు.

## శ్రావణ ఉపాకర్మ

వేదకాలంలో ప్రజలు ఎక్కువగా వేదాధ్యయనం, వేదశ్రవణం చేసేవారు. వర్షాకాలంలో తీరుబడిగా ఉండటం వల్ల అది మరింత ఫలదాయకంగా జరిగేది. వర్షాకాలం గృహస్థులకు పంటలు వేసిన తర్వాత విశ్రాంతి సమయం. సాధుసత్పురుషులు చాతుర్మాస్యదీక్షవల్ల ఆశ్రమాలలోనే ఉండాల్సి వచ్చేది. వర్షంలో పర్యటనలు చేయడం కష్టం కాబట్టి మఠాలు, ఆశ్రమాలు, వనాలు తదితరాలలో ఏదైనా ఒక చోట ఉండి వేదాధ్యయనం, వేదశ్రవణం, పూజాది కార్యక్రమాలు, ప్రవచనాలు వినిపించడం మొదలైనవి చేసేవారు. సాధారణ ప్రజలు కూడా సత్సంగాలుగా ఏర్పడి వేదాంతచర్చలు చేసేవారు. బ్రహ్మచారులు వారి గురువులు దగ్గర స్వాధ్యాయం, అనుశీలనం చేసేవారు. ఏ రోజు వేదపారాయణ ప్రారంభం అవుతుందో దానినే 'ఉపాకర్మ' అంటారు. ఇది శ్రావణపౌర్ణమినాడు జరుపుకుంటారు. ఏ విద్యావిజ్ఞానాలు మీద సంస్కృతీ, సంప్రదాయాలు ఆధారపడ్డాయో వాటిని గుర్తు చేసేదే **'శ్రావణపౌర్ణమి'**. ఈ ఉపాకర్మ గురించి పారస్కరగృహ్యాసూత్రం ఇలా చెప్పింది.

**అథాతోధ్యాయోపాకర్మ। ఓషధీనాం ప్రాదుర్భావే శ్రవణేన॥**
**శ్రావణ్యాం పౌర్ణమాస్యాగ్ం। శ్రావణస్య పంచమగ్ం హస్తేన వా॥**

శ్రవణానక్షత్రం పూర్ణిమతో కూడినదే శ్రావణ పౌర్ణమి. ఈ రోజు ఓషధుల ఉత్పత్తి జరుగుతుంది. ఇలాంటి విశిష్ఠ సమయంలో అధ్యయనాన్ని ప్రారంభించడం శుభం.

చంద్రుడు మనఃకారకుడు. ఓషధులపై అతని ప్రభావం ఉంటుంది. అది మానవుల మనస్సుపై కూడా పడుతుంది. కాబట్టి శ్రావణపౌర్ణమి అధ్యయనానికి ఆరంభ దినం అయ్యింది. ఇది మొదట ఉపాకర్మగా ప్రచారమై, ఋషులకు ప్రీతికరం కాబట్టి 'ఋషితర్పణం'గా ప్రసిద్ధమైంది. శ్రావణపౌర్ణమినాడు ఆరంభమైన ఈ అధ్యయనం నాలుగునెలల తర్వాత ముగిసేది. దానికే 'ఉత్సర్జనం' అని పేరు.

**శ్రావణ్యాం ప్రౌష్ఠపద్యాం వ్యాప్యుపాకృత్య యథావిధిః।**
**యుక్తశ్ఛందారిస్య దీయితా మాసాన్ విప్రోర్ధ పంచమాన్॥**
**పుష్యేతు ఛందసాం కుర్యార్భహిరుత్సర్జనం ద్విజః**
**మాఘశుక్లస్యవా ప్రాప్తే పూర్వాహ్నే ప్రథమేஉహనిః॥**

వేదాధ్యయనపరులు శ్రావణపౌర్ణమినాడు ఉపాకర్మను ఆచరించి, ఆనాటినుండి నాలుగునెలలు నియమంగా వేదాధ్యయనం చేయాలి. పుష్యమీ నక్షత్రంతో కూడిన పౌర్ణమినాడు అంటే పౌష్యమాసపౌర్ణమి రోజు గ్రామానికి బయటకు వెళ్లి వేదాధ్యయన సమాప్తిని తెలియజేసే 'ఉత్సర్జన' కర్మను ఆచరించాలి. రానురాను ఈ ఉపాకర్మ–ఉత్సర్జన రెండూ ఒకేరోజు జరుగుచున్నాయని 'ధర్మసింధు' తెలియజేసింది. మొత్తానికి ఇది రూపాంతరాలు చెందినా శ్రావణపౌర్ణమినాడు మాత్రం ఎవరి సంప్రదాయాన్ని అనుసరించి వారు వేదాధ్యయనాన్ని ప్రారంభిస్తారు.

ఈ ఉపాకర్మ రోజున 'బృహద్దవన యజ్ఞం', కామోకార్షీత్ జపాన్ని కూడా చేస్తారు. అధ్యాయోపాకరణోత్సర్జనలో అంతర్భాగమైన 'కామోకర్షీత్ జపం' చాలా ముఖ్యమైంది.

**కామోకార్షీత్ మన్యురకార్షీత్। కామఃకరోతి నాహం కరోమి।**
**కామఃకర్త నాహం కర్తా। కామఃకారయితా నాహం కారయితా॥**
**ఏషతే కామ కామాయ స్వాహా।**

ఉపాకర్మలో జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ జపాన్ని చేస్తారు. "నా వల్ల చేయబడ్డ లోపాలు, కామక్రోధాల వల్ల చేసినవే. నేను చేసేవాణ్ణి కాదు. చేయించేవాణ్ణి కాదు". అని తన అంతరంగపరిశీలన చేసే జపాన్ని 108 సార్లు చేసి, మధ్యాహ్నం చెరువు పక్కనకో, నది పక్కకో వెళ్లి నూతన యజ్ఞోపవీతాన్ని ధరించాలి. యజ్ఞోపవీతాలు(జంధ్యాలు) ధరించే పౌర్ణమి కాబట్టి దీనికి 'జంధ్యాలపౌర్ణమి' అనేపేరు కూడా వచ్చింది. వేద అధ్యాయానికి గుర్తుగా చతుర్వేద ఆద్యంత వాక్యాలను పఠించి, ఇంటి దగ్గరకు వచ్చి 'అధ్యయనహోమం, బృహద్దవన యజ్ఞాలను' ఆచరిస్తారు. మరుసటిరోజు 108 సార్లు గాయత్రీ జపం చేస్తారు.

## శ్రావణపౌర్ణమి-యజ్ఞోపవీతం

ఇప్పుడు చెప్పుకున్న ఉపాకర్మలో భాగంగా వేదాధ్యయనాన్ని ప్రారంభించేటప్పుడు విధిగా యజ్ఞోపవీతాన్ని ధరించాలి.

యజ్ఞోపవీతం(జందెం) వైదికసంస్కృతికి మరియు ఆధ్యాత్మిక జీవనానికి చిహ్నం. అందుకే వైదికధర్మ పరాయణులు అందరూ దీనిని ధరిస్తారు. కొత్తగా దీన్ని ధరించేవారు, చక్కగా చదువుటకు, రాయుటకు వచ్చిన బ్రహ్మచారులు మరియు అప్పటివరకు ధరించని గృహస్థులు, వివాహం చేసుకోబోయే వరుడు మొదలైనవారు తప్పకుండా వేదపండితులద్వారా నూతనంగా యజ్ఞోపవీతాన్ని ధరించి, హవనయజ్ఞాన్ని జరుపుకొని, గాయత్రీజపాన్ని ఆచరించాలి.

ఓం యజ్ఞోపవీతం పరం పవిత్రమ్।
ప్రజాపతేర్యత్సహజం పురస్తాత్ ॥
ఆయుష్యమగ్ర్యం ప్రతిముంచ శుభ్రం।
యజ్ఞోపవీతం బలమస్తు తేజః॥

అనే శ్లోకాన్ని చెప్తూ యజ్ఞోపవీతాన్ని ధరించాలి.



"పరమపవిత్రమైన వైదికధర్మాచారమునకు చిహ్నంగా యజ్ఞోపవీతాన్ని ధరించుట, ప్రజాపతి అయిన ఆ పరమేశ్వరుని యొక్క సృష్టి ఆది నుండి వచ్చుచున్నది. దీనిని ధరించు మానవులు పరిశుద్ధమైన మానవతా జీవనాన్ని అలవరచుకొని, యోగసాధనతో దీర్ఘాయుష్మంతులగుటయేగాక వారిలో ఆత్మ బలం (శక్తి) పెరిగి తేజోస్వరూపులు అవుతారని" భావం.

" 'ఓం యజ్ఞోపవీత మసియజ్ఞిస్స త్వా, యజ్ఞోపవితేన ఉపసహ్యామి'-అంటే పరమపవిత్రమైన వేదసంస్కృతికి చిహ్నామైన ఈ యజ్ఞోపవీతాన్ని ధరించిన నేను అనుదినం పతంజలిమహర్షి యొక్క అష్టాంగయోగసాధన చేయుచూ, పంచమహాయజ్ఞాలను చేయుచూ, వైదిక మానవతా జీవనాన్ని ఆత్మ, పరమాత్మలను సాక్షాత్కారం చేసుకుని, బ్రహ్మానందప్రాప్తిని పొందుదును గాక" అని మంత్రాలను ఈ ఉపాకర్మ సందర్భంగా పఠిస్తారు.

## యజ్ఞోపవీత నిర్మాణం

యజ్ఞోపవీతంలో ముఖ్యంగా మూడుబ్రహ్మముడులు ఉంటాయి. ప్రతి ముడిలో మూడుపోగులు, ప్రతి పోగులో మూడుదారాలు పేని ఉంటాయి. ఇలా దీనిలో అన్నీ మూడు అనే అంకెను అనుసరించి ఉండటం అనేది వైదిక సిద్ధాంతాలకు, సభ్యతకు, సంస్కారానికి చాలా దగ్గర సంబంధం ఉంది. ఇందులో ఉన్న మూడుదారాలు-మూడుపోగులు-మూడు బ్రహ్మముడులు-అనేవి ప్రతి మనిషి దేవ, పితృ, ఋషి ఋణాలను తీర్చే బాధ్యత తనపై ఉందని సూచిస్తుంది. ఈశ్వర, జీవ, ప్రకృతులు మూడు అనాదులను; సృష్టి, స్థితి, లయలు అనే మూడు పరమేశ్వరుని క్రియలను; సత్త్వరజో తమోలనే మూడు గుణాలను, భూత భవిష్యత్ వర్తమానాలనే మూడుకాలాలను, మాతా, పితా, ఆచార్యులనే ముగ్గురు గురువులను సూచించే విధంగా ఉన్నాయని శాస్త్రవచనం.

కాబట్టి, వీటిన్నంటి యొక్క మూలతత్త్వాన్ని తెలిసికొని, ప్రతిరోజూ ఈశ్వరస్తుతి, ప్రార్థన, ఉపాసన చేయుట, అష్టాంగ యోగసాధన చేయుట, అందరికీ ఉపకారమైన పంచమహాయజ్ఞాలను యథాప్రకారం చేస్తూ, వైదిక మానవతాజీవనాన్ని గడపడం అనేది యజ్ఞోపవీతధారి యొక్క ముఖ్యకర్తవ్యం.

## హయగ్రీవారాధన

శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాలలో హయగ్రీవ అవతారం ఒకటి. గుర్రం తల, మానవశరీరంతో అవతరించిన హయగ్రీవుడు జ్ఞానానికి ప్రతీక. రాక్షసులు దొంగలించిన వేదాలను హయగ్రీవుడే తిరిగి తెచ్చినట్లు విష్ణుధర్మోత్తర పురాణం చెబుతుంది. లక్ష్మీదేవికి ధనాధిపత్యాన్ని, సరస్వతీదేవికి విద్యాధిపత్యాన్ని ఇతడే ఇచ్చినట్లు పురాణకథనం. హయగ్రీవుడు ఆవిర్భవించిన శ్రావణపౌర్ణమినాడు శ్రీమహావిష్ణువుని హయగ్రీవుని రూపంలో యజ్ఞోపవీతధారులు పూజించి, ప్రార్థిస్తే వాక్శుద్ధి, ఆయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యం, పాండిత్యం కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

# 'శ్రీయామునాచార్యుల' వైభవము

డా॥ ఎమ్.టి. ఆళ్వార్

**యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥**

అంటూ శ్రీకృష్ణపరమాత్మ ఎప్పుడు అధర్మానికి కష్టం ఏర్పడుతుందో అప్పుడు తిరిగి ధర్మసంస్థాపన చేయడానికి అవతరిస్తానని భగవద్గీతలో తెలియచేసుకున్నారు. అది ఎంతో నిజం. 918 సంవత్సరంలో దక్షిణ ఆర్కాట్‌లోని 'వీర నారాయణపురం'లో (కాట్టుమన్నార్‌కోయిల్) అనే ఊరిలో **శ్రీయామునమునులు** అవతరించారు. వీరి తాతగారు **నాథ మునులు.** వీరి దయవలనే నాలాయిర దివ్యప్రబంధాలు మరల ఈ భూలోకంలోనికి ఆవిర్భవించాయి. వీరు **నమ్మాళ్వార్ల** అనుగ్రహం పొందినవారు. వీరి కుమారులు **ఈశ్వర మునులు.** ఈశ్వరమునులు తమ తండ్రివద్ద సకలశాస్త్రాలు నేర్చుకున్నారు. వీరు తమ ధర్మపత్నితో ఉత్తరదేశయాత్ర చేయుచుండగా బృందావనం మథురలోని శ్రీకృష్ణభగవానుని అనుగ్రహం లభించింది. వీరికి కలిగిన పుత్రునికి **'యమునైత్తురవన్'** యమునాతీర విహారిగా నామకరణం చేశారు. శ్రీనాథమునులు తమకు ఈశ్వరమునులు ద్వారా కలుగబోయే మనుమడు శ్రీమహావిష్ణువు భక్తుడై శ్రీవైష్ణవ లోకమునకు గొప్ప ఆచార్యునిగా వెలుగొందుతాడని తన శిష్యులకు ముందే భవిష్యవాణిని వినిపించాడు. అతనికి నా వద్ద నుండి మీరు పొందిన యోగవిద్యలు ద్రవిడవేదరహస్యాలు నేర్పమని ఆదేశించాడు. వారు చెప్పిన విధంగానే జరిగింది. ఆషాఢమాసంలో ఉత్తరాషాఢనక్షత్రంలో ఈశ్వర మునులకు కుమారునిగా అవతరించి, నాథమునులు శిష్యులైన శ్రీరామమిశ్రుల ద్వారా సకలవేదవేదాంతాలు చిన్నతనం లోనే నేర్చుకున్న ధీశాలి ఈ యామునాచార్యులు. వీరు అతి పిన్నవయస్సులోనే ఏకసంథాగ్రాహి. తమ తండ్రి శిక్షణలో సకలశాస్త్రాలు అధ్యయనం చేసి, అందరి ప్రశంసలు పొందారు. మహాభాష్యభట్టరువద్ద వ్యాకరణశాస్త్రాన్ని నేర్చుకునే సమయంలోనే చోళరాజు ఆస్థానపండితుని విద్యాగర్వం అనే కోరలు తన యుక్తిచే ఊడబెరికినాడు. అలనాడు రాజులకు అతని పత్నికి వీరి విషయంలో కలిగిన పందెంలో వీరు రాణిగారి పక్షముగా విజేతలై – రాజ ఆస్థానపండితుని గర్వమణచిన సందర్భంగా ఆ రాణి ఈ బాలయామునాచార్యులను చూచి **'ఎన్నై ఆళవందారో?'** నన్ను రక్షించడానికి వచ్చారా? అని ప్రశ్నించింది. అందువల్లననే వీరికి **'ఆళవందార్'** అనే పేరు సార్థకమయ్యింది. అప్పుడు చోళరాజు సంతోషించి, మాట ప్రకారం అర్ధరాజ్యాన్ని ఇచ్చాడు. యామునులను రాజభోగాలు వరించాయి. శ్రీనాథమునులు,





కష్టంతో కూడి ఉండని సుఖాన్ని, చెడుతో కూడి ఉండని మంచిని పొందడం అసాధ్యం

శిష్యులు ఇది తెలిసి వీరికి తాతముత్తాతలనాటి ధనం నిధిగా శ్రీరంగనాథుని ఆపాదమస్తకం సేవింపజేశారు. శ్రీయామునులు యథార్థం గ్రహించి తాతగారి నుండి లభించిన అపూర్వవిద్యలు గ్రహించి సన్న్యసించారు. **'యామునాచార్యులు'**గా శ్రీవైష్ణవ పీఠాధిపతియై, ఎన్నెన్నో రహస్యవిద్యలను, శ్రీమహావిష్ణు పారమ్యాలను తన శిష్యులకు అందించారు. వీరి వద్ద విద్యలను అభ్యసించిన **తిరుక్కచ్చినంబి, పెరియనంబి, మార నేతిసూరి, తిరుక్కోట్టి యూర్‌నంబులు** తర్వాతి కాలంలో శ్రీరామానుజులవారికి గురువులై శ్రీరామానుజులను లోకోత్తర మహిమాన్వితులుగా జగదాచార్య సింహాసనాధిపతులుగా చేశారు. వీరు ఎందరెందరినో శ్రీమన్నారాయణ చరణకమల దాసులుగా తీర్చిదిద్ది శ్రీవిశిష్టాద్వైత సిద్ధాంత సార్వభౌమునిగా శ్రీరంగంలో ఎన్నో కైంకర్యములు అందించారు. వీరు రచించిన గ్రంథాలలో **1)శ్రీస్తుతి 2)స్తోత్రరత్నం (ఆళవందార్ స్తోత్రం) 3)గీతార్థసంగ్రహం 4)ఆగమ ప్రామాణ్యం 5)సిద్ధిత్రయం** మనకు లభిస్తున్న గొప్ప నిధులు. వీరు రచించిన మరో గ్రంథం **పరమపురుషనిర్ణయం** మాత్రం లుప్తమైపోయింది.

శ్రీస్తుతి గ్రంథంలో నర నారాయణుడివలె శ్రీలక్ష్మీదేవి కూడా సృష్టి- స్థితి- లయలకు స్వామితో బాటే కారణమౌతుందని నిరూపించడం ఈ స్తోత్రంలో తెలుపబడింది. శ్రీవైష్ణవభావజాలంతో మూర్ధన్యమైన స్తోత్రం రెండవదిగా పేర్కొనదగినది **'స్తోత్రరత్నం'** లేదా **'ఆళవందార్ స్తోత్రం'**.

ఈ స్తోత్రంలో యామునాచార్యులు భగవానుని దివ్యమహిమలు, భగవానుడు ఈ చరాచరసృష్టిని రక్షించిన విధము, సర్వోన్నత సాత్త్విక దైవముగా శ్రీమన్నారాయణుని విరాట్‌స్వరూపము, శ్రీహరి అద్భుతకల్యాణ గుణాలు, నారాయణభక్తి పరాకాష్ఠ, ప్రపన్నులప్రార్థన, భగవానునితో చనువుగా ఆతని స్వాతంత్ర్యమును ప్రశ్నించుట మొదలైన విషయాలను గురించి తెలియబరిచారు. ఇవిగాక, శ్రీవైకుంఠములో స్వామికి చేసే నిత్యసూరుల కైంకర్యవివరాలు, శ్రీమన్నారాయణుడే చిదచిద్విశిష్టుడని, దయాళువని మనమంతా అతనికి శేషులమని పలుపలు రకాలుగా కీర్తిస్తారు. ఈ స్తోత్రరత్నమును ఆధారముగా చేసుకొని శ్రీరామానుజులు గొప్ప గొప్ప వేదశ్రుతులకు సమన్వయం చేశారు. 'శ్రీవైష్ణవసకల గ్రంథాలలో



శ్రీయామునాచార్యులవారి స్తోత్రరత్న శ్రీసూక్తి లేని గ్రంథ ముండదు' అన్నది ఎంతో సత్య మైన విషయము. ఏ వ్యాఖ్యాతలు కూడా యామునాచార్యుల వారిని, వారి గ్రంథాలను స్మరించకుండా తమ వ్యాఖ్యానాలు చేయలేరు. వేదాంతచర్చలలో గీతార్థసంగ్రహము, సిద్ధిత్రయము, ఆగమ ప్రామాణ్యాదులు విశిష్ట కోటిగా ఉంటాయి.

ప్రస్తుతం ఆ స్తోత్రంలోని కొన్ని విశేషాలను అను సంధించుకుందాం! గ్రంథారంభంలో –

నమోఽచిన్త్యాద్భుతాక్లిష్ట జ్ఞానవైరాగ్య రాశయే।
నాథాయ మునయేఽగాథ భగవద్భక్తి సింధవే॥

మా తాతగారైన నాథమునులవారు జ్ఞానవైరాగ్యభక్తి అనే సముద్రంలాంటివారని, వారి శ్రీపాదాలు ఇహపరాలలో నాకు దిక్కని, యోగులలోవారు సాటిలేనివారని, శరణు వేడుతున్నారు. వీరితో బాటు శ్రీపరాశరమహర్షిని కూడా శరణువేడారు. వీరు విష్ణుపురాణం ద్వారా అనేక విషయాలు బోధించారు కదా! 'తస్మై నమో మునివరాయ పరాశరాయ'– అని మా వంశంలో ఉన్న అందరికీ దిక్కు ఆ నమ్మాళ్వారులే అని వారి శ్రీపాదాలను మంగళాశాసనం చేశారు. వారిని స్తుతిస్తూ పరమసత్త్వ సంపన్నుడవైన నీవెక్కడ తండ్రీ! భృగుమహర్షిలాంటివారు, త్రిమూర్తులలో నీవే పరమసాత్త్వి కుడు, యజ్ఞభోక్తవు అని నిర్ణయించారు. నీవు పుండరీకాక్షు డవు, ఎర్రని తామరరేకుల వంటి మనోహరనేత్రములు కల్గినవాడవు. ఈ సమస్త అండపిండ బ్రహ్మాండాలకు నీలోని ఒక చిన్న అంశ కారణం అంటే, ఏమి నీ వైభవం అన్నారు. ఈ శ్లోకమే శ్రీరామానుజులవారిని గొప్ప విశిష్టాద్వైతసిద్ధాంత ప్రవర్తకునిగా మార్చి వేసింది.

తిరుమల శ్రీవారికొలువులో ప్రతినిత్యం ఈ ఆళ వందార్‌స్తోత్రంలోని మధురభావగర్భాలైన శ్లోకాలు చదువు తూనే ఉంటారు. అందులో 'కదా పునఃశంఖ.... కరిష్యతి'– అంటే "తండ్రీ! భూలోకాలు కొలిచిన నీ పాదం శంఖ చక్రలాంఛనములతో దివ్యచిహ్నాలతో శోభిస్తుంటాయి. ఆ పాదాలు నా శిరస్సు మీద మళ్లీ ఎప్పుడు అలంకరిస్తాయో?" అని. ఈ శ్లోకంతోనే దేవాలయాలలో శఠారి మనకు ఇస్తారు. ఈ శ్లోకం ఆళవందార్ శ్లోకం లోనిదే అంటే ఆశ్చర్యం కలిగిస్తుంది కదా! శ్రీవైకుంఠంలోనే శ్రీరంగం, తిరుపతి, అహోబిలం, కంచి వంటి దివ్యతిరుపతులలో ఉండే నారా యణుని దివ్యశోభను వర్ణించేశ్లోకాలు– ఆదిశేషులవారు– గరుడాళ్వారు చేసే కైంకర్యాలు తెలిపే శ్లోకాలు తేనెకన్నా తీపిగా వీరు తమ స్తోత్రాల ద్వారా తెలియజేశారు. ఇవన్నీ, పరతత్త్వబోధకంగా ఉంటాయి. వీరు స్వామినివేడుకునే విధానం అనన్యభక్తిపరంగా శరణాగతి రీతిలో ఉంటుంది. అందుకు ఎన్నో శ్లోకాలు ఈ గ్రంథంలో తార్కాణాలుగా చెప్పబడి ఉన్నాయి. అందులో 'నీ భక్తి ఒక్కటే చాలు ఈ సంసారసాగరం దాటడానికి ఆ భక్తినే నాకు ప్రసాదించు' అని వేడుకునే శ్లోకాలు రసమయాలు. 'నీతో సంబంధంలేని బ్రహ్మరుద్రాదిపదవులు నాకు వద్దు.. వద్దు!– కానీ, నీదాసులు నివసించే స్థలంలో చిన్నకీటకంగా పుట్టించినా సంతోషిస్తాను' అని చెప్పే శ్లోకంలో వారికి భగవంతునితో ఉండే చనువును తెలుపుతాయి.

'భక్తులందరినీ రక్షిస్తావని అభయమిచ్చావు కదా! శ్రీరామావతారంలోను, భగవద్గీతలోను దీని గురించే తెలిపావు కదా! మరి నన్ను తప్ప అందరినీ రక్షిస్తానని నన్ను జాప్యం చేస్తున్నావా?' అంటూ శ్రీయామునాచార్యులవారు చివరిగా "అకృతిమత్వచ్చరణారవింద"– 'దేవా! నీపాదాలలో నాకు కృత్రిమభక్తి వద్దు. సహజమైన భక్తితో నన్ను సేవించే విధంగా అనుగ్రహించాలి. ఎలా అంటే మా తాతగారైన నాథమునులమీద ఉన్న ప్రేమ నామీద కూడా చూపించాలి తండ్రీ!' అని ముగిస్తారు. ఈ స్తోత్రానికి పెరియవాచ్చాం బిళ్లై– శ్రీవేదాంతదేశికులువంటి వారు గొప్పగొప్ప వ్యాఖ్యా నాలు వ్రాశారు. ఎన్నోభాషలలోకి అనువదించబడ్డాయి. అందుకే ఈ స్తోత్రరత్నం **ఆళవందార్ స్తోత్రం**గా ప్రసిద్ధి చెందింది. అలాగే పిలుస్తారు కూడా!

*ఆళ్వార్ తిరువడిగళేశరణమ్!!!*


సత్సాంగత్యం మనస్సును ప్రక్షాళన చేస్తుంది

**శ్రీ హయగ్రీవ జయంతి**
**03-08-2020**




**విశుద్ధవిజ్ఞానఘనస్వరూపం విజ్ఞానవిశ్రాణనబద్ధదీక్షం**
**దయానిధిం దేహభృతాం శరణ్యం దేవం హయగ్రీవమహం ప్రపద్యే**


నిర్మలమైన విజ్ఞానమే స్వరూపముగా కలిగినవాడు,
అట్టి విజ్ఞానమును అనుగ్రహించుటయే దీక్షగా కలిగినవాడు, దయకు నిధి,
ప్రాణులకు గొప్ప శరణము అగు శ్రీహయగ్రీవ దేవుని శరణువేడుచున్నాను


శ్రీ వేదాంత దేశికులు - హయగ్రీవ స్తోత్రం - 5

తిరుమల శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవం జరిగింది.
శ్రీశ్రీశ్రీ చిన్న జీయంగారు స్వామి,
తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి. ధర్మారెడ్డి దంపతులు,
ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో
శాస్త్రోక్తంగా శ్రీ వరలక్ష్మీ వ్రతం జరిగింది.
తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., దంపతులు,
సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పి. బసంత్ కుమార్, ఐ.ఏ.ఎస్., దంపతులు,
ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
















తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగిన పవిత్రోత్సవ దృశ్యాలు.



శ్రీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా
ఆన్‌లైన్‌లో టిక్కెట్టు నమోదు చేసుకున్న భక్తులకు
తపాలాశాఖ ద్వారా
శ్రీపద్మావతీ అమ్మవారి ప్రసాదాలను
తి.తి.దే. పంపిణీ చేసారు




# దివ్యక్షేత్రం... తిరుమల

12

శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

*గత సంచిక తరువాయి భాగం...*

## అనంతాళ్వారు

తిరుమలలో శ్రీనివాసునికి పుష్పకైంకర్యం చేసి తరించిన మరోభక్తుడు అనంతాళ్వారు. ఈయన భగవద్రామానుజుల వారికి ప్రియశిష్యుడు.

శ్రీరంగక్షేత్రంలో ఒక రోజు రామానుజాచార్యులు పాఠం చెబుతూ, "తిరుమల శ్రీస్వామికి పూలంటే చాలఇష్టం. అక్కడికి వెళ్లి పుష్పకైంకర్యం ఎవరైనా చేస్తారా! అక్కడ ఆ కొండలో విపరీతంగా చలిబాధ, కీటకాల బాధ ఉంటుంది. వీటిని సహిస్తూ పుష్పకైంకర్యం చెయ్యాలి" అంటూ, అందుకు ఎవరైనా అంగీకరించగలరా? అని అడిగారు రామానుజాచార్యులవారు.

వెంటనే అనంతుడు అనే శిష్యుడు లేచి నిలబడి, నమస్కరిస్తూ, "గురువుగారూ! మీరు అనుమతిస్తే, తిరుమలకు వెళ్లి వేంకటేశ్వరునికి నేను పుష్పకైంకర్యం చేస్తాను" అంటూ ప్రార్థించాడు.

'భళీ! అనంతా! నీవేనయ్యా అసలైన మగాడివి'. అని మెచ్చుకొని పంపించాడు రామానుజులవారు. ఆనాటినుంచి 'అనంత పురుషుడు' అనే పేరు పొందిన ఆ శిష్యుడు తన భార్యతో తిరుమలక్షేత్రం చేరుకొన్నాడు.

స్వామివారి పుష్పకైంకర్యం కోసం, తిరుమలలో ఒక చెరువును తవ్వడం ప్రారంభించాడు. తాను మట్టిని తవ్వడం, తనభార్య మట్టిని దూరంగా పోయడం, ఇదీ వాళ్లిద్దరి పని. ఇలా కొంతకాలం సాగింది. భక్తిగా ఈ భార్యా భర్తలిద్దరూ చేస్తున్న చెరువు తవ్వే పనిలో శ్రీనివాసుడు సాయం చేద్దామనుకొన్నాడు. ఒక కుర్రవాడిగా మారి పోయి, వాళ్ల దగ్గరికి వెళ్లి తాను సాయం చేస్తానన్నాడు.

అనంతార్యులు కోపంగా 'ఒరే! వెధవా నిన్ను పిలిచానా? సాయం చేయమన్నానా? వెళ్లు వెళ్లు. వెళ్లకపోతే దెబ్బలు తింటావు. జాగ్రత్త.' అంటూ హెచ్చరించగా ఆ కుర్రవాడు (స్వామి) వెళ్లిపోయాడు.

మళ్లీ కొన్నాళ్లకు ఆ యువకుడు (స్వామి) వాళ్ల దగ్గరికి వచ్చి చూశాడు. పాపం! అనంతుడు మట్టిని తవ్వుతుండగా ఆయన భార్య మెల్లగా ఆయాసంగా ఆ మట్టిని దూరంగా పోసివస్తూ ఉంది, ఆమె నిండుగర్భిణి. అందువల్లే ఆమె చాల ఆయాసపడుతోంది. వెంటనే ఆ యువకుడు ఆమె దగ్గిరికి వెళ్లాడు. 'అమ్మా! నాకు మట్టిగంపను ఇవ్వు. నేను పోసి వస్తాను. నీవు బాగా అలసివున్నావు' అంటూ మట్టిగంపను అందుకొని దూరంగా పోసి వస్తూ ఉండినాడు.

కొంతసేపటికి మట్టిని తవ్వుతున్న అనంతాళ్వారు ఇది గమనించి, మట్టి తవ్వడం ఆపి వేసి, గడ్డపారతో కూడా గుంటపైకి వచ్చాడు. కోపంగా ఆ కుర్రవాణ్ణి చూస్తూ 'వెధవా! మళ్లీ పిలవని పేరంటానికి వచ్చావా!' అంటూ గడ్డపారతో వాణ్ణి కొట్టడానికి వెంటపడ్డాడు. వాడు దొరికినట్లే దొరికి పారిపోగా కోపంతో చేతిలోని గునపాన్ని వానిపైకి విసిరాడు.

అంతే! ఆ గడ్డపార ఆ కుర్రవాడి గడ్డానికి తగిలింది. గాయమై రక్తం బొట బొట కారింది. అయినా అనంతుడికి ఆవేశం తగ్గలా. వెంటపడ్డాడు. ఆ కుర్రవాడు పరుగెత్తుతూ చివరకు ఆలయంలో దూరాడు. ఈ కుర్రాడు మళ్లీ అయినా దొరకడా! అనుకొంటూ అనంతుడు తిరిగి వెళ్లి, స్నానం చేసుకొని ఆ సాయంత్రం శ్రీస్వామివారి దర్శనం కోసం ఆలయంలో ప్రవేశించాడు. **(ఇంకా ఉంది)**



# నమామి నంద సంభవమ్

– శ్రీమతి యర్రమిల్లి విజయలక్ష్మి

## తిరుమల గోవిందుడే శ్రీకృష్ణుడు

శ్రీకృష్ణుడు అవతారం కాదు. సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపం. శేషాద్రిపై వెలసి ఉన్న వరదహస్తుడైన ఘనవేంకటేశ్వరుడే ధర్మసంస్థానార్థమై యుగయుగాల్లో అవతరించాడు. అలాగే ద్వాపరయుగంలో అవతరించి, పురిటిలోనుంచి ఎన్నో అద్భుతలీలల్ని చూపి, అర్జునునికి గీతోపదేశం చేసి పరం జ్యోతియై ప్రకాశించిన శ్రీకృష్ణుడు కలియుగంలో భక్తుల కొంగు బంగారమై వెలసిన తిరుమల గోవిందుడు ఒక్కడేయని భక్తుల విశ్వాసం. కేవలం విశ్వాసం మాత్రమే కాదు. ఇది యథార్థమని ఎందరో ఆళ్వారులు, కర్ణాటక హరిదాసులు... ఇలా ఎందరో... మరెందరో శ్రీవేంకటేశ్వరుని కృష్ణునిగా వర్ణించారు, స్తుతించారు. అలాగే పదకవితా పితామహుడైన శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల దృష్టిలో తిరుమల శ్రీనివాస ప్రభువు సాక్షాత్తు శ్రీకృష్ణుడే. అందుకే అన్నమయ్య శ్రీవేంకటాద్రి గోవిందునికి, ద్వాపరయుగంనాటి గోపాలకృష్ణునికి అభేదం కల్పించి ఇద్దరూ అభిన్నులని వర్ణించారు.

శ్రీనివాసస్వామి తానే కృష్ణుణ్ణి అని స్వయంగా చెప్పుకొన్న ఘట్టాలున్నాయి. వైకుంఠం నుండి వీడివచ్చిన శ్రీనివాసుడు తొలిసారిగా పద్మావతిని కలిసినపుడు, తన పేరు కృష్ణుడనీ, తన తల్లిదండ్రులు దేవకీ వసుదేవులనీ, అన్న బలరాముడనీ చెప్పుకొంటాడు.

అలాగే పద్మావతీ పరిణయ సందర్భంలో కన్యాదాన సమయంలో చెప్పబడే సంకల్పంలో, శ్రీవేంకటేశ్వరుడు కృష్ణుడనీ, ఆయన తల్లిదండ్రులు దేవకీ వసుదేవులని శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో పేర్కొనబడింది.

## శ్రీకృష్ణతత్త్వము

యం బ్రహ్మావరుణేంద్రరుద్రమరుతః స్తున్వన్తి దివ్యైః స్తవై
ర్వేదైః సాఙ్గపదక్రమోపనిషదైర్గాయన్తి యం సామగాః।
ధ్యానావస్థిత తద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాన్తం స విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః ॥

బ్రహ్మ, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు మరుద్గణముల దివ్యస్తుతుల చేత; వేదములు, వేదాంగములు, పదక్రమ ఉపనిషత్సమూహము సామగానము ద్వారా ఎవని మాహాత్మ్యమును గానము చేయుచుందురో– యోగులు సమాధిలో నుండి ఏకాగ్రచిత్తముతో ఎవ్వని స్వరూపమును దర్శింతురో – సురాసురులెవని మాహాత్మ్యము యొక్క అంతమును తెలుసుకొనలేరో అట్టి పరమదేవతాస్వరూపుడగు శ్రీకృష్ణునికి నమస్కరించుచున్నాను.

లోకంలో ధర్మం నశించి అధర్మం పెరిగిపోతున్నప్పుడు తాను మనుష్యరూపంలో అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూంటానని శ్రీకృష్ణుడు చెప్పాడు. 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని అవతారతత్త్వానికి ఇదే ప్రమాణం. శ్రీకృష్ణుడు పూర్ణావతారం.

'స ఏవాగ్ర దంతర్యామి..... స ఏవ మోక్షప్రదః' – కృష్ణుడే ఈ జగత్తుకు సర్వాంతర్యామి. అతడే సర్వాత్మకుడు... అతనిని స్మరించినవారు సమస్త పాపములనుండి ముక్తులగుచున్నారు. అతని నామ కీర్తనలు చేసి విష్ణు సాయుజ్యాన్ని పొందుతున్నారంటుంది ఉపనిషత్తులు.

'భువో భరావతారకం భవాబ్ధి కర్ణదారకం.......
దినే దినే నవం నవం నమామి నంద సంభవమ్'

శ్రీకృష్ణుడు తన అవతారంతో భూభారాన్ని తొలగిస్తూ ఆశ్రితులను సంసార సముద్రాన్ని దాటించు నావికుడై– భక్త చిత్త చోరుడై, యశోదానందులకానంద సంధాయకుడైనాడు.

"శ్రీకృష్ణదర్శనం సమస్తలౌకిక దృశ్యములలో కెల్ల అలౌకికమైనది– అలౌకిక దృశ్యములలోకెల్ల పరమలౌకికమైనదంటాడు' ఉద్ధవుడు విదురుడితో. నందయశోదలు ఎంతటి తపస్సు చేసారో కదా! సాక్షాత్తు శ్రీహరియే పుత్రుడై వారిని అనుగ్రహించాడు. బ్రహ్మ, మహేశ్వరులే కాదు– నిరంతరం భగవంతుని అర్ధాంగిగా విలసిల్లే లక్ష్మీదేవి కూడా వారు పొందిన అనుగ్రహాన్ని పొందలేక పోయారు. 'గోపికాసుతుడైన శ్రీకృష్ణుడు భక్తుల వద్ద పొందిన సుఖం, ఆనందం దేహాభిమానులగు తాపసుల వద్ద కాని ఆత్మ దర్శులగు జ్ఞానులవద్ద కానీ పొందలేదంటాడు' శుకమహర్షితో పరీక్షిత్తు.

శ్రీకృష్ణుడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువే. అందువల్లనే శ్రీహరి సర్వశక్తులు ఆయన్ని ఆశ్రయించుకుని ఆయన వెంట



వచ్చాయి. అందులో ముఖ్యంగా ఆదిశేషుడు బలరాముడిగా. శ్రీకృష్ణుడు పూర్ణపురుషుడైన పురుషోత్తముడు. భక్తులను అనుగ్రహించటానికే అవతరించి ఎన్నోలీలలు ప్రదర్శించాడు. శరీరధారులందరిలాగానే మానవసహజమైన ప్రేమాభిమా నాలు, సుఖదుఃఖాలు, అహంకార మమకారాలు ఉన్నట్లు, అనుభవిస్తున్నట్లు కనిపిస్తూనే-యుగధర్మానికి భిన్నంగా పరబ్రహ్మ స్వభావాన్ని సూచిస్తాడు. ఎట్లంటే 'కృష్ణస్య గోప్యారుచిరం వీక్ష్యకౌమారచాపలమ్...' విశ్వాన్ని తన రూప గుణాతిశయంతో ఆకట్టుకునేవాడు, కష్టాలుతీర్చేవాడు, కలిమి నిచ్చే వాడుగా గోచరిస్తారు.

గోపబాలురతో కలిసి గోవులను కాయుచు, పక్షుల కిలకిలారవములతో, వృక్షములచే కప్పబడిన యమునా తీర ఉద్యానవనములయందు విహరించి తన లీలలను చూపాడు. తెల్లని ఆవులు, ఎద్దులవంటి గోధనము వెంట తిరుగుచు మిత్రులైన గోపాలురను వేణునాదముతో సంతోషపరుస్తూ గోవులను కాచేవాడు.

"నందరాజా! నీ కుమారుడు పూర్వం శుక్ల, రక్త, పీత మనే వర్ణాలతో ప్రకటితమయ్యాడు. ప్రతి యుగమందున తన శ్రీమూర్తిని ప్రకటిస్తాడు. ఇప్పుడీ అవతారంలో కృష్ణవర్ణంలో ప్రకటితుడయ్యాడు. నీ యీ పుత్రుని గుణకర్మలకు తగిన నామ ములు రూపములు ఎన్నో ఉన్నాయి. సామాన్య మానవులు వాటిని తెలుసుకోలేరు" అంటారు గర్గుడు నందునితో.

"నీ రూపగుణములు విజ్ఞానప్రకాశకములు, అజ్ఞాన నాశకములు, శుద్ధ సత్త్వాత్మకములు... ఇట్టి నీ రూపగుణము లను చింతించిన యెడల క్రమముగా స్వరూపగత నిర్గుణత్వము పొందుతారు. ఆ పిమ్మట క్రమముగా నీ గుణములు ప్రకాశ మగును" అంటారు దేవతలు.

శ్రీకృష్ణకథశ్రవణఫలాన్ని గూర్చి రుక్మిణీదేవి కృష్ణునికిలా తెలియజేస్తుంది 'హేభువన సుందర..! హే అచ్యుత...! శ్రవణము చేయు శక్తి ఎవరికి కలదో వారి కర్ణపుటములు ద్వారా ప్రవేశించిన నీ గుణగణములు సమస్తపాపములను హరించును. ఎవరికి దర్శనము చేయు శక్తి కలదో వారు చక్షువులు ద్వారా నీ రూపాన్ని దర్శించి అఖిలార్థాలను పొంద గలరు."

శ్రీకృష్ణుడు ఎన్నో రూపాలు ధరించి విహరించటం పూర్ణవతారాన్ని నిరూపిస్తుంది. పరమాత్మ తన సంకల్పం వలన తన నుండే ప్రపంచాన్ని సృష్టిస్తాడు. ఇదే పరబ్రహ్మపూర్ణశక్తి. అలాగే తన యశోదకు త్రిభువనాలూ చూపించాడు. గీతోపదేశ సమయంలో అర్జునునికి తన రూపంలో సమస్త ప్రపంచాన్ని ప్రదర్శించి చూపాడు.

గీతోపదేశం చేసిన పరమగురువుగా ఉంటూనే, మరొక వైపు రాజనీతిజ్ఞునిగా, యుద్ధనీతి విశారదుడుగా కనిపిస్తాడు. ఆ పరమపురుషుని అనుగ్రహం వల్లనే ద్రౌపది మానసంరక్షణ, లాక్షాగృహదహనం, కుచేలునికి సంపద, దుష్టశిక్షణ, శిష్టరక్షణ మొదలైన జరుగవలసినవన్నీ జరిగాయి. ప్రపంచంలో మానవునిగా సుఖదుఃఖాలను అనుభవిస్తూ ప్రజల యోగక్షేమాలను తెలుసు కుని తానే చూసి చూపిస్తూ, జీవితాన్ని ఆనందిస్తూ దానితో తాదాత్మ్యం చెందినట్లుగా కనిపించే విధంగా నటించినందు వల్లే కృష్ణుడ్ని జగన్నాటక సూత్రధారి అన్నారు.

శ్రీకృష్ణుడు అందించిన సందేశాలు ఉపదేశాలు మాన వాళి అభ్యున్నతికి తోడ్పడుతుంది. అందుకే 'కృష్ణస్తు భగవాన్ స్వయం'.

*ఓమ్ శ్రీకృష్ణాయ నమః*

బాలవాక్కు

# భేదం

ఒక ఊళ్లో ఇద్దరు విష్ణు భక్తులుండేవారు. నిరంతరం విష్ణువుని స్మరిస్తూ ఉండేవారు. వారికి వాసుదేవుడు ప్రత్యక్షమై, వారితో సంభాషిస్తూ ఉండేవాడు.

ఆ ఊళ్లో ఒక గుడ్డివాడు ఉండేవాడు. పాపం అతనికి ఎవరూ లేరు. అతను చాలా బాధపడేవాడు. అతనిని చూసి అందరూ బాధపడేవారు. ఒక నాడు అతను ఒక విష్ణుభక్తుడి వద్దకు వచ్చి, భగవంతుడిని తన గురించి అడగమని వేడుకున్నాడు. అందుకు అతడు సరేనన్నాడు.

వాసుదేవుడు రాగానే ఆ భక్తుడు ఆ గ్రుడ్డివాడిని గురించి అడిగాడు. అందుకు దేవాదిదేవుడు, "అతను తన కర్మ ఫలాన్ని అనుభవిస్తున్నాడు" అని సమాధానం చెప్పాడు.

భగవంతుడు ఏమి సమాధానం చెప్పాడోననీ ఆసక్తితో ఉన్న అంధునికి భగవంతుడు చెప్పిన సమాధానం చెప్పాడు ఆ భక్తుడు. అందుకు విచారించి, ఆశ వీడక రెండవ భక్తుని వద్దకు వెళ్లి భగవంతునితో తన సంగతి చెప్పమని ప్రాధేయపడ్డాడు గుడ్డివాడు. సరేనన్నాడు ఆ భక్తుడు. రెండు రోజులలో అంధునికి చూపు వచ్చింది. కళ్లు చక్కగా కనిపించ సాగాయి. కారణం అడిగిన అందరికీ అతను రెండవ భక్తుని గురించి చెప్పసాగాడు.



మాస్టర్ జె.శ్రీవివస్వత్,
9వ తరగతి,
భారతీయవిద్యాభవన్ శ్రీవేంకటేశ్వరవిద్యాలయ,
తిరుపతి.

ఈ సంగతి మొదటి భక్తునికి కోపం తెప్పించింది. తన వద్దకు వచ్చిన భగవంతుడిని అతను ఇలా నిందించాడు, "నీకు అందరూ సమానమేననీ, భేదమే, లేదని అందరూ అంటారు. నీ భక్తులందర్నీ నీవు ఒకేలా చూస్తావనీ అంటారు. అదంతా అబద్ధమే"

"ఎందుకలా అంటున్నావ"ని ప్రశ్నించాడు భగవంతుడు. "లేకపోతే మరేమిటి? నేను గుడ్డి వాడిని గురించి అడిగినప్పుడు నీవేమన్నావు? అతను కర్మఫలం అనుభవిస్తున్నాడు అన్నావు. మరి అదే ప్రశ్న రెండో భక్తుడు అడిగినప్పుడు అతనికి నేత్రదృష్టిని ప్రసాదించావు. దీనిని ఏమంటారు? ఇది భేదం చూపెట్టడం కాకపోతే ఇంకేమిటి?" అని ప్రశ్నించాడు. అందుకు భగవంతుడు నవ్వి ఇలా అన్నాడు, "నిజమే, నీవు కారణం అడిగావు. నేను సమాధానం చెప్పాను. అందుకు నీవు మాట్లాడకుండా ఊరుకున్నావు కానీ ఆ భక్తుడు అలా చేయలేదు. అతను నేను రాగానే, ఆ గుడ్డివాడు చాలా కష్టపడుతున్నాడనీ, అతనికి చూపు ప్రసాదించమనీ ప్రార్థించాడు. భక్తులు కోరినది ఇవ్వడమే నా పని. వెంటనే అతనికి దృష్టి ప్రసాదించాను. ఆ భక్తుడు నన్ను సర్వశక్తిమంతుడననీ, నాకు అసాధ్యమైనది ఏదీ లేదనీ, నమ్మకం ఉన్నవాడు. అందుకే అలా అడిగాడు. కర్మఫలాన్ని నిర్మూలించే శక్తి నాలో ఉందనీ, నీకు తోచలేదు. నీవు అతడిని కనికరించమనీ అడుగలేదు. దృష్టిప్రసాదించమని అడుగలేదు. అందుకే, నీవు చెప్పినప్పుడు, నేను అతడికి దృష్టిని ప్రసాదించలేదు."



"ఇద్దరూ సాక్షాత్కారం పొందినవారే. మీరు ఇద్దరూ భక్తులే! నాకు ఇద్దరూ సమానమైన భక్తులే. అందులో నాకు భేదభావం లేదు. భేదం అల్లా మీరు అడిగే విధానంలోనే ఉంది" అన్నాడు భగవంతుడు.

ఆ భక్తుడు ఆ మహామాయావికి నమస్కరించాడు.

# 'గాయత్రీ' సాధన

డా॥ వై. శివరామప్రసాద్

సకల మంత్రములలో అత్యంత శక్తివంతమైనది, మహోన్నత మైనది **'గాయత్రీ'** మంత్రం. ఈ మంత్రరాజ ప్రభావమందు విశ్వాసముంచి, సాధన చేయు సత్యాన్వేషులకు అత్యంత ప్రయోజనకరమైనది. ఆధ్యాత్మిక విజ్ఞానకాంతులు వెదజల్లి, రక్షణకవచముగా పరిఢవిల్లి, ప్రతిక్షణము సాధకుని ఉన్నతశిఖరములకు చేర్చునది **'గాయత్రి'**. విశ్వవ్యాప్తమై, కేవలము ఒక దేశపరిధికి మాత్రమే పరిమితముగాక, సకలచరాచర సృష్టికర్తనుద్దే శించి, మేధస్సు, తేజస్సును ప్రసాదించుటకు చేయుప్రార్థనే 'గాయత్రి'. పరబ్రహ్మయొక్క నిర్గుణతత్త్వము, మాతృవాత్సల్యత, అమృతత్త్వము, విష్ణు తత్త్వములను మేళవించి, ఆదిత్యతేజస్సుతో అన్ని వర్గములకు చెందిన సాధకులకు ఆదర్శముగా నొప్పుచున్నది.

గాయత్రీమంత్రరాజము గాయత్రీ ఛందస్సుతో ఇరువది నాలుగు అక్షరములు గలిగి, త్రిపాదముగా, ప్రతిపాదము ఎనిమిది అక్షరముల చొప్పున వేదపరముగా వెలసినది. ఈ మంత్రము పరమాత్ముని ఆదిత్య రూపునిగా ఉద్దేశించి, ఆ ఆదిత్య తేజస్సును తన అంతరాత్మలోనికి ఆహ్వానించుట ఈ మంత్ర గూఢార్థం.

ఈ మంత్రమునకు విశ్వామిత్రుడు ఋషి. విశ్వా మిత్రుని బ్రహ్మర్షిగా అంగీకరించిన వెంటనే బ్రహ్మర్షి వశిష్టుడు విశ్వామిత్రుని భ్రూమధ్యము తాకినంతనే, అతని మూడవ నేత్రము తెరువబడి అందుండి సప్తవ్యాహృతులతో గాయత్రీ మహామంత్రం ఆవిర్భవించినది.

ప్రప్రథమముగా, గాయత్రీమంత్రము ఋగ్వేదములోను, ఆ తదుపరి యజుస్, సామవేదములలోను సాక్షాత్కరించినది. సూర్యతేజస్సును ఉపాసించుట ఈ మంత్రము ముఖ్య ఉద్దేశ్యముగాన, సూర్యతేజస్సు విశ్వవ్యాప్తమైనందువల్ల, ఈ మంత్రం ప్రపంచబాహుళ్యమునకు సంపూర్ణంగా ఉపాధే యము. 'సకలమానవాళి బుద్ధులను ప్రేరేపించు ఓ సూర్యతేజమా, సృష్టి, స్థితి, లయ కారకుడైన ఓ పరమాత్మా! నీ జ్ఞానప్రకాశం మా బుద్ధులందు ప్రవేశించి, మాకందరకును ఉత్తేజమును కలి గించుగాక' అనే ప్రార్థన ఈ మంత్రబాహ్యార్థము. గాయత్రీమంత్ర, జప, ధ్యానాదులచే, శక్తి జనించి, బ్రహ్మచర్య పటిమ, వాక్‌శుద్ధి, రోగనివారణ, ఆధ్యాత్మిక పటుత్వము వంటి అలౌకిక ప్రజ్ఞలు చేకూరును. ఇంకనూ, ఈ మంత్రసాధనతో, సంపూర్ణ ఆరోగ్యం, నిరాడంబరత, వినయవిధేయతలు, సహనం, సౌభ్రాతృత్వము, సత్యసంధత, ఇత్యాది సద్గుణములు కల్గుతాయి. ఇంకనూ, ఈ మంత్రప్రభావముచే, నిర్భయత్వము, జీవన్ముక్తి కలిగించి, చోర, రాక్షస, మహావ్యాధి ఇత్యాది దుష్టశక్తులను పారద్రోలును.



గాయత్రీమంత్రంలో బ్రహ్మతేజస్సు, గృహస్థుని ఐశ్వర్యం, వానప్రస్థుని వైరాగ్య సంపద నిబిడీకృతమై ఉన్నవి. మనుస్మృతి మూడవ ఆధ్యాయంలో ఉదహరించిన రీతిలో, ఋగ్, యజుస్, సామ మూడువేదముల నుండి బ్రహ్మ మూడు బీజాక్షరములు – ***'అ, ఉ, మ'*** లను చిలికించి, వీని నుండి భూమి, ఆకాశము, స్వర్గ తత్త్వములు మేళవించి, ***'భూః, భువః, సువః'*** అను వ్యాహృతులు సృజించి, వీనికి 'తత్' జోడించి, ***'సావిత్రి'*** లేక ***'గాయత్రి'*** మంత్ర రాజమును లోకమునకు వెల్లడించెను. వేదమాత, సకలపాపహర, సకలశుద్ధికర, పవిత్రాతి పవిత్రమై వెలసిన గాయత్రి మంత్రజపం అంగాంగ సహితముగా చతుర్వేద పఠనంతో సమానము.

గాయత్రీ మంత్రమును సూక్ష్మముగా పరిశీలించి నచో, 'భూః' అను బీజము పృథ్వి, 'భువః' అను బీజము బ్రహ్మాండము, 'సువః' అను బీజము మహర్లోకము. 'ఓం' పరమాత్మను సూచించును. నిత్యకర్మానుష్ఠానమైన సంధ్యావందనమందు 'గాయత్రి' హృదయస్థానమైనది. బ్రహ్మసంకేతమైన 'ఓం'కారము, అగ్ని భట్టారకుడు 'దేవత', గాయత్రి 'ఛందస్సు', పరమాత్మ స్వరూపముగా గాయత్రీమాతను సంధ్యావందన ప్రక్రియలో ఆహ్వానింపబడును. జగన్మాత స్వరూపిణి అయిన 'గాయత్రి' సర్వవర్ణములచే స్తుతింపబడు పరదేవత. ఆద్యంతములు లేనిది, సరస్వతిగా వెలుగొందుచూ, యశస్సు, బలము, ధైర్యము, అరిషడ్వర్గములను పారద్రోలు దిక్సూచి, తన అఖండ తేజో పుంజములతో, సూర్య, చంద్ర, అగ్ని ఇత్యాది తేజోరాసులకు కూడా తేజస్సును నింపునది.

| | | |
|---|---|---|
| ఓం | - | పరమాత్మ సంకేతం |
| ఓం భూః | - | సర్వాంతర్యామి పరమాత్మ |
| ఓం భువః | - | సృష్టికర్త పరమాత్మ |
| ఓం సువః | - | సర్వస్వతంత్ర పరమాత్మ |
| ఓం మహః | - | వందనీయుడు పరమాత్మ |
| ఓం జనః | - | ఆదిలేని పరమాత్మ |
| ఓం తపః | - | తపస్సు పరమాత్మ |
| ఓం సత్యం | - | సత్యమే పరమాత్మ |
| ఓం తత్ | - | సర్వేశ్వరుడు పరమాత్మ |
| సవితుః | - | ఆదిత్యుని ద్వారా వ్యక్తమగు పరమాత్మ |
| వరేణ్యం | - | దేవతలందరిచే ఉపాసింపబడు పరమాత్మ |
| భర్గో | - | జ్ఞానప్రసాది పరమాత్మ |
| దేవస్య | - | స్వయంప్రకాశతేజస్సు పరమాత్మ |
| ధీమహి | - | ధ్యానించెదను |
| ధియః | - | మా మేధస్సు |
| యోనః | - | పరమాత్ముని దిశగా ప్రసరించి |
| ప్రచోదయాత్ | - | ప్రబోధించును |

గాయత్రీమాత స్వరూపము తపశ్శక్తితో పరిశీలించి నచో, గాయత్రీమంత్రం అధిష్ఠాన దేవతముఖము- అగ్ని; శిరస్సు-బ్రహ్మ; హృదయము- విష్ణువు, కేశసంపద- శంకరుడు, ప్రాణవాయువులైన- ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానలు, ప్రాణశక్తులు, వేదాంగములైన శిక్ష, వ్యాకరణము, కల్ప, నిరుక్త, జ్యోతిషములు శిరస్థానములు.

ఆద్యంతములు లేని సత్య, జ్ఞాన, తేజస్వరూపము, సర్వస్వతంత్ర ప్రమాణము, సకలచరాచర సృష్టి స్వరూపిణి, ఇంద్రాది దివ్యదేవతలచే ఉపాసింపబడి, గ్రహముల ద్వారా పూర్వతేజస్సును ప్రసరించు దయామయి, ఉపాసించు సాధకులకు క్షేమము, ఐశ్వర్యము, సద్బుద్ధులను ఆశీర్వాదపూర్వకంగా అందించు కృపారాశి, అణువులలో అణువు, మహత్తులో మహత్తు, అయిన గాయత్రీమాత సకల చరాచర జగత్తునంతటికీ జ్ఞానజ్యోతిగా వెలుగుగాక.

సర్వేజనాః సుఖినోభవంతు

# శ్రీపద్మావతీ అమ్మవారి పవిత్రోత్సవాలు

**సిరులతల్లి తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో మూడురోజులపాటు పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలకు ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యహవచనం, మత్సం గ్రాహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం జరుగుతాయి. వైదిక సంప్రదాయం ప్రకారం యాత్రికులవల్లగానీ, సిబ్బందివల్ల గానీ తెలిసితెలియక, దోషాలు జరుగుతుంటాయి. వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ మూడురోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పవిత్రోత్సవాలలో ఆలయశుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవిత్రప్రతిష్ఠ, పవిత్రసమర్పణ, పూర్ణాహుతి కార్యక్రమాలు ఇందులో ఉంటాయి.**

**ఇవి ప్రతిసంవత్సరం భాద్రపద మాసం పున్నమినాటికి పూర్తి అయ్యేటట్లుగా 3 రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతాయి.**

**ఈ సందర్భంగా యజ్ఞాలు, యాగాలు పాంచరాత్రాగమానుసారం వైభవంగా శ్రీపద్మావతీదేవికి అనుబంధ ఆలయాలు వాటికి ఈ ఉత్సవాలు జరుగుతాయి.**



గృహలక్ష్మి

# 'శ్రీ'నివాసం

- డా॥ ఎస్. లక్ష్మి



'అలక్ష్మిః మే నశ్యతామ్' అని ఋగ్వేదం వివరిస్తోంది. అనగా నాకు అలక్ష్మి నశించుగాక అని అర్థం. ఈ వాక్యం శ్రీసూక్తం లోనిది. జీవులకు కావలసిన సకలైశ్వ ర్యాలు లభించాలని వేదమాత ఆకాంక్ష. అందువల్లనే శ్రీసూక్తం వంటి మంత్రగుచ్ఛాల ద్వారా మనకు కావలసిన బహుప్రయో జనాలను సిద్ధింపచేసుకొనే సాధన లను ప్రసాదించింది.

శోభ, కాంతి, ఉత్సాహం, ఉల్లాసం, సంపద, ధర్మం, కీర్తి, శుచి, అభయం – వంటి దివ్య గుణాల సమాహారమే **'శ్రీమహా లక్ష్మి స్వరూపం'**. వాటికి విరుద్ధమై నవి అలక్ష్మి, ఆ అలక్ష్మి మనకు తొలగుగాక! అని కోరుకోవాలి. మన సంప్రదాయాలలో లక్ష్మిని ఇంటిలో సుస్థిరం చేయడానికి తగిన సదాచారాలనెన్నిటినో ప్రాచీన గ్రంథాలలో తెలియబరి చారు. పరంపరగా మనవారు అనుసరిస్తూ వచ్చారు.

సూర్యోదయానికి మునుపే నిద్రలేవడం, ఇళ్లూ – వాకిళ్లు శుభ్రపరచుకోవడం, ముగ్గువేయడం, తాను శుచిగా స్నానాదులు చేయడం, శుభవస్త్రాలను ధరించటం, వంట పాత్రల శుద్ధి, శుచిగా వండిన ఆహారాన్ని దేవతలకు నివే దించడం, ఉభయసంధ్యలలో దీపారాధన, కఠినంగా కరకుగా మాట్లడకపోవడం, ఇంట్లో– స్నేహమయ వాతావరణాన్ని నెలకొల్పడం, చిరునవ్వు చెదరకుండా ప్రసన్నంగా ఉండడం, సుగంధం, కుసుమం, పసుపు, కుంకుమ వంటివి దాల్చడం, వస్తువులను దుర్వినియోగ పరచకుండా ఉపయోగించడం– వంటివన్నీ గృహకృత్యాలలో ప్రధానాలు. ఇవే సంపదలకు మూలం. వీటిని నిర్వహించడం సామాన్య విషయం కాదు.

వీటిని సమర్థవంతంగా సాగించగలిగే గృహిణికి పూజ నీయుల స్థానాన్నిచ్చింది హిందూధర్మం. ఇందుకు గృహస్థు, పిల్లలు కూడా సహకరించాలి. 'గృహిణీ గృహముచ్యతే' 'ఇయం గేహే లక్ష్మీః'– వంటి సంస్కృత సూక్తులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

ఈ పాత్రను నిర్వహించడానికి పూర్తికాలం, వినియోగించే బాధ్యత తక్కువేమీ కాదు. ఇలా కాలం గడిపే ఇల్లాలిలో మహాలక్ష్మీకళ సహజంగా దీపిస్తుంది. ఆమె ప్రభావంచేత ఎలాంటి దుఃస్వభావమైనా మార్పు చెంది ప్రసన్నమౌతుంది.

ఇల్లు బాగుంటే సమాజం బాగు న్నట్లే. సంపద అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు, ధన, ధాన్య, వీర, ధైర్య, దయా, క్షమ, తృప్తి, సత్సం తానం, సిద్ధి, బుద్ధి, జ్ఞానం ఇవన్నీ లక్ష్మీ స్వరూపాలని వైదిక సంస్కృతి సంభావించింది. ఇవి వృద్ధిచెంది అలక్ష్మి తొలగాలని నిత్యం ఆకాంక్షించాలి.

సంపద సమృద్ధిగా ఉండాలని ప్రతివారి ఆకాంక్ష. దానికి ముఖ్యమైన సంప్రదాయ సదాచార సమృద్ధిని సమ కూర్చుకోవాలి. "అశౌచం, అనాచారం, హింస– వంటి ప్రవృత్తుల వలన రాక్షసులను విడిచిపెట్టాను– సాత్త్వికత, శౌచం, సదా చారం, సర్వభూతహిత బుద్ధివంటి సల్లక్షణాల వలన దేవతలను కరుణించాను" అని శ్రీమహాలక్ష్మి స్వయంగా తెలియజేసింది.

చక్కగా తృప్తిగా ఉన్న ఇంట ధనసమృద్ధి గోచరించక పోయినా, ధనం వల్ల కలిగే ఆరోగ్యం సుఖశాంతులు వంటివి స్పష్టంగా కనిపిస్తాయి, కావలసిన ఫలితాలే లభించాక– ఇంకా ధనసమృద్ధి లేదే అనే విచారం అక్కర లేదు. కొందరు ధనమే లక్ష్మి అనుకొని దానిని సంపాదించడంలో అన్యాయాన్ని పాటిస్తారు. అలా గడించిన లక్ష్మి శాంతినీ సంతోషాన్ని ప్రదానం చేయదు.

తాత్త్వికంగా సంభావిస్తే అజ్ఞానమే అసలు దరిద్రం. దానిని సైతం తొలగించి జ్ఞానసమృద్ధిని పొందడమే మహాలక్ష్మి ఉపాసనలో ప్రధాన తాత్పర్యం.

# పరమపావనం-వామనచరిత్ర

- శ్రీ వేమరాజు అనంతపద్మనాభం

పరమాత్ముని అవతారములు అనేకములు. కొన్ని అవతారములతో రాక్షససంహారము చేసి ధర్మసంస్థాపన చేయడమే లక్ష్యం. **వామనావతారం** యొక్క లక్ష్యం రాక్షస సంహారము కాదు. రాక్షసుడైననూ బలిచక్రవర్తి విష్ణుద్వేషి కాడు. కాని, మహత్వకాంక్షతో శుక్రాచార్యులవారి కృప వలన విశ్వజిత్ యాగంచేసి మహిమాన్వితమైన దివ్యరథం, దివ్యకవచం, అభేద్యమైన, తిరుగులేని శస్త్రాస్త్రములు సంతరించుకొని, సురాధిపత్యాన్ని సాధించాడు. ఇంద్రాది దేవతలు స్వర్గాన్ని వీడి ఎక్కడో తలదాచుకోవలసిన పరిస్థితి ఏర్పడినది.

ఇంద్రుని తల్లియైన అదితి తన పతి అనుగ్రహంతో పయోవ్రతాన్ని నియమంగా, నిష్ఠగా ఆచరించి శ్రీమహావిష్ణువు యొక్క దివ్యసాక్షాత్కారము పొందినది. నేత్రములలో ఆనందము పెల్లుబకగా సంతోషతరంగితయై శ్రీమహావిష్ణువును స్తుతించినది.

పోతనామాత్యులవారి పద్యం ఎంతో మనోహరంగా, హృద్యంగా, రమణీయంగా శోభిస్తున్నది.

**"యజ్ఞేశ! విశ్వంభరాచ్యుత! శ్రవణమంగళనామ**
**ధేయ, లోకస్వరూప! ఆపన్న భక్తజనార్తి విఖండన!**
**దీన లోకాధార! తీర్థపాద! వినుత**
**మందార! గుణహార! వేదసార! ప్రణతవత్సల!**
**పద్మాక్ష! పరమపురుష"** - అలా కొనసాగుతుంది.

ఈ స్తోత్రమునకు ప్రసన్నుడైన శ్రీహరి అదితితో 'నీ సుతుడనై నర్తించి వర్తింపగాన్' అని చెప్పగా, అదితి ఎంతో ఆనంద పరవశురాలైనది. 'బలిని నిర్జించుట సమంజసం గాదు. కాని, ఏదైనా ఉపాయంతో దేవతలకు తిరిగి సామ్రాజ్యం, సుఖం, వైభవం వచ్చేలా చూస్తాను. చింతించవలదు' అని శ్రీహరి అంతర్ధానమైనాడు.

అనంతరం కొంతకాలానికి భాద్రపదశుద్ధ ద్వాదశినాడు (దీనినే విజయద్వాదశిగా వ్యవహరిస్తారు) చంద్రుడు, గ్రహాలు ఉచ్ఛస్థితిలో ఉండగా మిట్టమధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో శ్రీహరి **'వామనుని'**గా అవతారం దాల్చెను. తొలుతగా అదితి కశ్యపులకు తన దివ్యమంగళ దర్శనం ప్రసాదించి తిరిగి వామనుడై జన్మించాడు.

వామనుని చూచి ఆనందంతో అదితి 'నను c గన్న తండ్రి! నా పాలిదైవమ! నాకులదీపక!' అంటూ పరవశించిపోయింది.

కశ్యప ప్రజాపతిని ముందు ఉంచి ఋషులు వామనునికి ఉపనయన సంస్కారము చేశారు. సూర్యుడు గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించినాడు. బృహస్పతి జంధ్యాన్ని, కశ్యపుడు మొలత్రాడునూ, అదితి కౌపీనాన్ని, భూదేవి నల్ల జింకచర్మాన్ని, చంద్రుడు దండాన్ని, ఆకాశం గొడుగునూ, బ్రహ్మ కమండలాన్నీ, సరస్వతీదేవి జపమాలికనూ, సప్తర్షులు పవిత్రదర్భలనూ ఇచ్చారు. కుబేరుడు భిక్షాపాత్రనూ, పార్వతీదేవి అక్షయం అంటూ పూర్ణభిక్షనూ పెట్టింది.

తర్వాత తన అవతార లక్ష్యం నెరవేర్చుటకై బలిచక్రవర్తి నిర్వహిస్తున్న యజ్ఞము జరిగే ప్రదేశమునకు వామనుడే వెళ్ళెను.

బలిచక్రవర్తి యజ్ఞవాటికలో వామనుని ప్రవేశము వలన కలవరము మొదలైనది. మహాత్ముల రాకతో హోమాగ్ని దివ్యకాంతులతో వెలుగుతుంది. వామనుని చూచి అచ్చటి వారందరూ సంభ్రమాశ్చర్యములకు లోనై రహస్యంగా సంభాషించుచూ 'శంభుడో, హరియో' అంటూ తలపోస్తున్నారు.

వామనుడు ఆ యజ్ఞవాటికంతా తిరుగుతూ యజ్ఞాన్ని చూస్తూ, సామవేదగానం వింటూ కొందరితో జటలు చెప్పుచూ, కొందరితో తర్కిస్తూ, కొందరితో నవ్వుతూ, అందరినీ తృటిలో ఆకర్షించి సమ్మోహితులను గావించెను.

బలిచక్రవర్తి వద్దకు వెళ్లి మర్మగర్భంగా 'స్వస్తి జగత్రయీ భువన శాసనకర్తకు..... దానవలోక భర్తకున్" అని ఆశీర్వదించాడు. బాహ్యంగా బలిచక్రవర్తిని కీర్తిస్తున్ననూ ఆంతరములో 'స్వస్తి' అంటే నా వైభోగం, రాజ్యం ఇంకేమిగలదు. త్వరలో దాన రూపంగా హరిస్తున్నాను అనే సూచన ఇచ్చాడు.


బలి మహదానందంతో 'వటువా! నీరాక వలన నా జన్మ సఫలమైనది, యజ్ఞం విజయవంతమైనది. నా కోరికలన్నీ తీరాయి.' అంటూ ఏమి కావాలో కోరుకో ఇస్తాను అంటూ 'మాడలో, ఫలములో, వన్యంబులో, గోవులో, హరులో, రత్నములో, రథములో, కాంచనమో, భూములో...' అని ఏదైనా కోరుకోమంటాడు.

వామనుడు మాత్రం 'ఇవన్నీ నాకెందులకు? భూములు, ధనము బ్రహ్మచారినైన తనకు వలదు. మూడడుగుల నేల ఇచ్చిన అదే బ్రహ్మాండంబు నాకు' అని సమాధానమిచ్చాడు.

ఇంతలో శుక్రాచార్యుడు రహస్యాన్ని గ్రహించి బలికి హెచ్చరిక చేస్తాడు. 'వచ్చినది బ్రహ్మచారి కాదు, శ్రీమహావిష్ణువు. నీ రాజ్యన్నీ సంపదనూ గ్రహించడానికై వచ్చాడు. మూడడుగుల నేల ఇస్తానని చెప్పలేదు' అని అబద్ధమాడమని చెప్పాడు.

'శ్రీమహావిష్ణువు దానగ్రహీతగా వచ్చిన అది నా భాగ్యం గదా!' అని పలికెను.

భార్య వింధ్యావళి బంగారు పళ్లెము తేగా, బంగారు పాత్రలో నీరందించగా బలిచక్రవర్తి వామనుని సాదరంగా పిలిచి, పాదములు కడిగి మూడడుగుల నేల లోకాలన్నీ ఆశ్చర్యం పొందేలా ధారపోశాడు. వామనుని పాదం మునులచే, దేవతలచే నిరంతరం అర్చించబడేది. అనంతరం వామనుడు త్రివిక్రముడై తన రెండు పాదములతో భూమ్యాకాశములనూ, అన్ని లోకాలనూ ఆక్రమించిన విధము పోతనా మాత్యులవారు చక్కని పద్యములో మనోహరంగా వర్ణించారు.



**"ఇంతింతై, వటుఁడింతయై, మఱియుఁ దానింతై, నభోవీథిపై నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై నంతై, చంద్రుని కంతయై, ధ్రువునిపై నంతై, మహర్వాటిపై నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై"**

వామనుడు బ్రహ్మాండమంతా నిండిపోతున్న సమయాన రవిబింబం క్రమక్రమంగా ఎలా మారిపోయిందంటే మొదటగా గొడుగుగా, శిరోమణిగా, కర్ణకుండలంగా, కంఠాభరణంగా, భుజకీర్తిగా మారుతూ శ్రీమహావిష్ణువునకు పాదపీఠంగా గోచరించింది. ఇది ఎంతో అద్భుత దృశ్యం.

బ్రహ్మ, మరీచి మున్నగు ఋషులతో వచ్చి, శ్రీమహావిష్ణువుయొక్క పాదములు కడిగి ఆ జలాన్ని తలపై చల్లుగొనగా ముల్లోకములను పావనము చేసే మందాకినిగా, తర్వాత గంగా నదిగా మారింది. శ్రీరామాయణంలో ఈ సందర్భంగా జాంబవంతుడు త్రివిక్రమావతారమునకు 21మార్లు ప్రదక్షిణం చేసినట్లు వర్ణించడమైనది.

కేవలము రెండుపదములతో అన్ని లోకాలను విస్తరించి, తిరిగి వామనుడై తన మూడవ అడుగు ఎక్కడ పెట్టాలి? అని బలిని అడుగగా తన శిరముపై పెట్టమని ప్రార్థించాడు. శ్రీమహావిష్ణువు పవిత్రమైన పాదమే అన్నమాచార్యులవారు పరవశిస్తూ కీర్తించిన **'బ్రహ్మకడిగిన పాదము బ్రహ్మము తానె నీపాదము'**గా ఉదహరించవచ్చు.

తర్వాత బ్రహ్మ, ప్రహ్లాదుడు మున్నగువారి ప్రార్థనలపై శ్రీహరి బలిని అనుగ్రహించి రసాతలమునకు వెళ్లి నివసించమని వరమిచ్చాడు. రాబోవు మన్వంతరములో ఇంద్రపదవి గూడ అనుగ్రహించాడు. సదా బలిని స్వయంగా రక్షిస్తానని వరమిచ్చాడు.

వామనపురాణం చెప్పే నీతి గొప్పది. దానమును, సత్యమును వ్రతముగా ఆచరించిన బలిని శ్రీహరి అనుగ్రహించడం విశేషం. బలిలోని రాక్షసదోషమును పరిహరించి నివృత్తి మార్గాన్ని బోధించుట గొప్ప విషయం.

వామనావతార ఘట్టమును అత్యంత శ్రద్ధాభక్తులతో పఠించే వారు, వినేవారు, స్మరణము చేసేవారు మోక్షమును పొందుతారు అని శ్రీమద్భాగవతం ఫలశ్రుతిగా చెప్పుతున్నది.

**సర్వం శ్రీకృష్ణార్పణ మస్తు**

# శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రము సింగరాయకొండ

– శ్రీమతి జి.సత్యవతి

శింగరాయాద్రిపై వెలసి శ్రీరామునేలినాడ
శ్రీవరాహలక్ష్మీ హృదయేశ యోగనరసింహుడ?
శ్రీతాతయ్యను బిరుదాంకిత బాలునేలినాడ
సింగరకొండ నివాస శ్రీసింగరాయుడ?

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లా సింగరాయకొండ మండలం పాతసింగరాయ గ్రామంలో కొండమీద వెలసిన శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామి క్షేత్రము మహామహిమాన్విత మైనది. ద్వాదశ నారసింహక్షేత్రములలో ఒకటిగా ప్రసిద్ధినొందిన ఈ క్షేత్రంలో తాతయ్యగుడిగా పిలువబడే స్వయంభువు శ్రీయోగా నందనరసింహస్వామి, శ్రీరామునిచే ప్రతిష్ఠింపబడిన శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామివార్లు కొలువు దీరి, భక్తుల కోర్కెలుతీర్చి మోక్షాన్ని ప్రసాదిస్తున్న ఆర్తత్రాణపరాయణులు.

## స్థలపురాణం

'సింగరాయకొండ' అనేపేరు ఈ గ్రామానికి రావడానికి శ్రీనృసింహరాయుడు ఇచ్చట కొండపై వెలసినందున సింగ రాయకొండగా ప్రసిద్ధి చెందిన క్షేత్రం. స్థలపురాణాన్ననుసరించి ఈ కొండపై ఒకానొకప్పుడు తపమాచరించిన నారదుని కోరిక మీదట స్వామి ఈ కొండపై యోగనరసింహ స్వామిగా వెలి శారు. యోగముద్రలో ఉన్నందున ఈ స్వామి సమక్షంలో అమ్మ వారు ఉండరు.

ఒకప్పుడు ఈ ప్రాంతమంతా 'కరాటి' అనే పేరుతో ప్రసిద్ధినొందినది. కరాటి మొదలు కడపవరకు విస్తరించిన ఈ రాజ్యము ఖరదూషణాదుల పాలనలో కొనసాగేది. ఖరాసురుడు నృసింహస్వామి భక్తుడు. ఆ స్వామిని పూజిస్తూ, స్వామిని మోక్షం కోరగా, తాను శ్రీరామచంద్రుని రూపంలో వచ్చి మోక్షమిస్తానని చెప్పాడు. ఖరుడు అజేయుడు. ఆ గర్వంతో మునులను బాధిస్తూ, యజ్ఞయాగాదులను ధ్వంసంజేస్తూ విచ్చల విడిగా సంచరిస్తూ ఉంటాడు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు వనవాసకాలంలో ఋష్యాశ్రమాల రక్షణనిమిత్తం అజేయులైన ఈ ఖరదూషణాదులను సంహరించాలని బయలుదేరి కరాటి రాజ్యం చేరతారు. ఖరుడు నృసింహాభక్తుడు కావటంవలన శ్రీరామచంద్రుడు యోగనిద్రనందు నృసింహాతేజమును పొంది, శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామిని ఈ కొండపై ప్రతిష్ఠించి, తద నంతరం ఖరదూషణాదులను వధించి మునులను రక్షించి, ఖరుడికి ముక్తి ప్రసాదిస్తాడు.

## తాతయ్యగుడి

ఇక్కడ వెలసిన శ్రీయోగనరసింహస్వామి స్వయం భువుగా ఎంతో మహిమాన్వితమైన వారు. ఈ స్వామివారి కళ్ళలో అద్భుతమైన శక్తి ఉందని అంటారు. స్వామి కొండపై దుర్భేద్యమైన అరణ్యప్రాంతంలో ఉండేవాడు. ఇచ్చటికి 5 కి.మీ. దూరంలో సోమరాజుపల్లి అనే గ్రామం నుండి అతిప్రయాసతో అర్చకస్వామి వేంచేసి ఈ కొండపైన ఉన్న స్వామివారికి ప్రతినిత్యమూ ధూపదీప నైవేద్యములు కైంకర్యం చేసి వెళ్ళేవారు. ఒకనాడు అర్చకస్వామి తనవెంట 5–6 సంవత్సరాల ప్రాయం గల తన మనుమడిని కూడ తీసుకుని వచ్చాడట. అర్చక స్వాములవారు స్వామివారి పూజాకార్య క్రమాలలో నిమగ్నమై మనుమడి ఉనికిని గ్రహించలేదు. ఆయన పూజ పూర్తిచేసుకుని యథావిధిగా దేవాలయం తాళం వేసుకుని తిరిగి వెళ్ళుతూ మనుమడిని వెతుకుతాడు. ఎంత వెతికినా మనుమడి జాడ తెలియక చింతించుచూ కొండదిగి ఇంటికి వెళతాడు. కుటుంబం లోని వారంతా ఏ క్రూరజంతువో పిల్లవాణ్ణి చంపివేసిందేమోనని, స్వామివారి భక్తులైన తమకీదుర్గతికి పూర్వజన్మ పాపఫలంగా రోదిస్తారు.


మర్నాడుదయాన్నే మళ్ళీ స్వామివారికి అర్చనార్థం కొండచేరి గుడితలుపులు తెరువగా పిల్లవాడు గర్భగుడిలో సజీవంగా ఉండటం చూచి ఆశ్చర్యచకితుడయ్యాడు ఆ అర్చకుడు. గర్భాలయంలో ఒక్క కిటికీగాని, చీమలు దూరే సందుగాని లేని ఈ చీకటి గదిలో సజీవంగా ఉండవీలులేదు. మనుమడు తాత గారికి విషయం వివరిస్తూ తాను గర్భాలయంలో ఉత్తరదిక్కులో ఉన్న బిలంలో పడుకుని నిద్రపోయానని, లేచేసరికి చీకటి

గుహలో భయంవేసిందని, అయితే ఈ నృసింహ తాతయ్య తనకి అన్నం తినిపించి నిద్రపుచ్చాడని చెప్పాడు. పసిబాలునికి దర్శనమిచ్చి అతనిని ధన్యుడిని చేసిన స్వామికి అనేక వందనా లర్పించి తమవంశం ధన్యమైనదని అర్చకస్వామి ఆనందిస్తాడు. ఈ వింత గ్రామంలో యావన్మందికి తెలిసి స్వామివారి మహిమలు వేనోళ్ళ చర్చించుకున్నారు. అప్పటినుండి శ్రీయోగనర సింహస్వామిగుడిని 'తాతయ్యగుడి'గా పిలవడం ప్రసిద్ధినొంది ఈ నాటికీ అదే పేరు సార్థకనామధేయంగా కొనసాగుతోంది.

## ఆలయ సందర్శనం

పాత సింగరాయకొండ గ్రామంలో కొండపై విరాజిల్లు తున్న శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి, యోగనరసింహస్వామి వేరువేరు గర్భాలయాలలో విరాజిల్లుచున్నారు. యాభైమెట్లు నడిచి తూర్పువైపు నుండిగాని, దక్షిణంవైపు నుండిగాని పైకి వెళ్ళాలి. నేరుగా కొండపైకి వెళ్లినా లేదా నడిచి కొండ ఎక్కినా మొట్టమొదటిగా శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామివారినే దర్శిం చాలి. తూర్పువైపున 5 గవాక్షాలతో ఎత్తైనముఖమండపం, వివిధ చిత్రశిల్పాలతో కూడి ఆకాశాన్ని అంటేలాగా ఆకర్షణీయంగా ఉంటుంది. ధ్వజస్తంభం చుట్టి దాని మొదట ఉన్న గరుడుని దర్శించి, విశాలప్రాంగణం గల ఆలయానికి ప్రదక్షిణ చేయాలి. సభామండపం విశాలమైనది. దానిని దాటి అంతరా లయంలో ప్రవేశించి, ఉత్తరం వైపు దక్షిణముఖంగా ఆళ్వార్ల సన్నిధిని దర్శించాలి. తరువాత గర్భాలయంలో శ్రీలక్ష్మీసహిత నరసింహ స్వామివారిని దర్శిస్తాము. ఉదయం స్వామివారి నిజరూపం తోను, తదనంతరకాలం అలంకార భూషితుడైన స్వామిని దర్శించి తరించాలి. ప్రధాన అర్చామూర్తి శ్రీవరాహలక్ష్మీనర సింహస్వామి గర్భాలయానికి ఆనుకుని ఉత్తర దక్షిణంవైపు ప్రత్యేక ఆలయాలలో తూర్పుముఖంగా విరాజిలుతున్న రాజ్యలక్ష్మి అమ్మవారిని, గోదాదేవి అమ్మవార్లని దర్శించాలి.


ఇక దక్షిణంవైపు రెండుగవాక్షాలు కల్గి, ప్రాచీన కట్టడానికి చిహ్నంగా ఉన్న ముఖమండపం నుండి ఆలయ ప్రవేశం చేసిన భక్తులు ముందుగా ద్వారానికి లోపల ఎడమ వైపు తూర్పుముఖంగా ఉన్న గణపతి విగ్రహాన్ని దర్శిస్తారు. విష్ణ్వాలయంలో గణపతి విగ్రహం శివకేశవుల కభేదమని తెలుపుతుంది. ప్రధాన ఆలయప్రాకారంలో దక్షిణం వైపు నైఋతి మూల వాహన మండపంలో స్వామివారి ఉత్సవవాహనాలు దర్శించ వచ్చు.



తదనంతరం ఆగ్నేయ మూల 20 మెట్లు దిగి ప్రత్యేక గర్భాలయంలో విరాజమానవై, తూర్పు ముఖంగా విలసిల్లుతూన్న చతుర్భుజ యోగానంద నర సింహస్వామి ఆలయంలో స్వామి రెండు చేతులు యోగ ముద్రతోను, దక్షిణహస్తం శంఖ, వామహస్తం చక్రం తోను ఉన్నస్వామిని దర్శిం చాలి. ఈస్వామి 'తాత'గారనే

పేరుతో ప్రఖ్యాతి నొందినాడు. ఈ గుడిలో అమ్మవారు ఉండరు. ప్రత్యేక ధ్వజస్తంభం, దానిలో స్వామిని వీక్షిస్తున్న ఆంజనేయ స్వామి ఉన్నారు. బాలుని కాపాడి, బాలునిచే తాతగా పిలువ బడిన ఈ స్వామి ఆలయాన్ని 'తాతయ్యగుడి'గా ప్రసిద్ధి చెందింది. యోగనరసింహస్వామి గర్భాలయంలో ఉత్తరం వైపు సొరంగ మార్గం ఉంది. ఇది 50 కి.మీ. దూరంలో ఉన్న మాల్యాద్రి శ్రీజ్వాలానరసింహస్వామి ఆలయం చేరుతుందని చెబుతూంటారు. కొందరు భక్తులు ఆ మార్గాన్వేషణ చేసే నిమిత్తం సొరంగ మార్గంలో బయలుదేరి తిరిగి రాలేదట. అందువల్ల ప్రభుత్వం వారు ఆ బిలమార్గాన్ని మూయించివేశారు.

యోగనరసింహస్వామి ఆలయం ప్రక్కనే ఉత్తర దిశలో తూర్పుముఖంగా ప్రత్యేక గర్భాలయంలో విరాజిల్లే వీరాంజ నేయస్వామి సంజీవినీపర్వతం ఎత్తినట్లున్న శిలాప్రతిమ. ఈ ప్రతిమ యాభైసంవత్సరాల క్రితం అదే ప్రదేశంలో ఒకరాతి శిఖరంపై చూచాయగా కనపడిందట. ఆ శిల సంజీవరాయునిగా రూపుదిద్దుకోవడానికి పదిసంవత్సరాలు పట్టినదట. ఏ శిల్పి కూడ సుత్తి, ఉలి పట్టి చెక్కిన శిల్ప ప్రతిమకాదు. అక్కడే కొండను తొలిచి స్వామివారు వెలసిన విగ్రహం చుట్టూ గుడిని కట్టారని చెబుతారు. ఇక్కడే భవనాశిని పుష్కరిణి గుడికి వెనుకభాగాన ఉంది.



క్షేత్రపాలకుడు శ్రీకాలభైరవుడు. ప్రధాన దేవాలయం దక్షిణముఖ మండపానికెదురుగా ఉత్తరాభిముఖంగా ఆలయాన్ని చూస్తూ ఉన్న శిలావిగ్రహం దర్శించవచ్చు.

## ఉత్సవాలు

స్వామివారి ఆలయం ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 8 గంటల వరకు తెరచి ఉంటుంది. స్వామివారికి నిత్యోత్సవాలు, పక్షోత్స వాలు, సంవత్సరోత్సవాలు వైఖానస ఆగమసిద్ధాంతానుసారంగా నిర్వహిస్తారు. ఆలయంలో శనివారం మాత్రం అన్నదానం పరి మిత భక్తులకు ఏర్పాటు చేస్తారు. వైశాఖ శుద్ధ చతుర్దశినాడు జరిగే నృసింహజయంతి ఉత్సవాలలో ప్రత్యేకపూజలు నిర్వ హిస్తారు.

స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతిసంవత్సరం జ్యేష్ఠ శుద్ధ దశమి స్వాతి నక్షత్రం మొదలు పదకొండురోజులపాటు అంగ రంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలలో అయిదవ రోజు హనుమంతసేవ, ఆరవరోజు గరుడసేవ, ఏడవనాడు గజోత్సవం (ఏనుగు ఉత్సవం), పౌర్ణమినాడు స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో రాష్ట్రంలోని నలుమూలల నుండి ప్రఖ్యాత విద్వాంసులచే నాదస్వర వాయిద్యం, సంగీత కచ్చేరీలతో పాటు ప్రతిరోజు వివిధ పౌరాణిక నాటకాల ప్రదర్శన కూడా జరుగుతుంది. బ్రహ్మోత్సవాలలో కొండయావత్తూ విద్యుద్దీపా లంకరణలతో ప్రకాశించే ఈ సింగరాయకొండ చూచి తరిం చాల్సిందే.

ఈ స్వామికి శ్రీరామనవమి, కృష్ణాష్టమి, ధనుర్మాసంలో వేడుకలు, ప్రత్యేకపూజలు జరుగుతాయి. మహామహిమాన్వితమై భూలోకవాసులనుద్ధరించి తరింపజేసే శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామి, శ్రీయోగనరసింహస్వామిని దర్శించినంతనే భక్తులు తరించగలరు.

శ్రీ మన్నృసింహ విభవే గరుడధ్వజాయ
తాపత్రయోపశమనాయ భవౌషధాయ ।
తృష్ణాది వృశ్చిక, జలాగ్ని భుజంగ, రోగ
క్లేశ వ్యయాయ హరయే గురవే నమస్తే॥

# బలరామ వైభవం

– డా॥ మరింగంటి లక్ష్మణాచార్యులు

**మీనాకృతే, కమఠ, కోల, నృసింహ, వర్ణిన్ స్వామిన్, పరశ్వథ తపోధన రామచంద్ర। 'శేషాంశరామ' యదునందన కల్కిరూప శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్॥**

అఘటిత ఘటనాసమర్థుడు, ఆపదమ్రొక్కులవాడు, అడుగడుగుదండాలవాడు, ఆంధ్రులకేకాక విశ్వమంతా వ్యాపించి ఉన్న అశేషభక్తజనావళికి ఆరాధ్యదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారికి సుప్రభాతసేవలో ప్రతినిత్యమూ వినిపించే పై శ్లోకం ఎంతో విశిష్టమైనది. ఈ కలియుగ వరదుడు శ్రీమన్నారాయణుడేనని, దశావతారములను దాల్చి శిష్టరక్షణ, దుష్టశిక్షణ, ధర్మసంరక్షణ చేసినది ఈ స్వామియే నని, ఈ విలక్షణ అవతారములలో **'బలరాముడు'** కూడా ఒకరని ఈ శ్లోకం ద్వారా మనకు అవగతమౌతుంది.

శ్రీవైష్ణవులు ఎంతో భక్తిప్రపత్తులతో ప్రతిదినం పఠించే 'భజ యతిరాజమ్' అనే అద్భుతమైన స్తోత్రంలో 'బలరాముడు' కూడా ఒకరని ఈ శ్లోకం ద్వారా మనకు అవగతమౌతుంది.

**ఆదౌ జగదాధారః శేషః**
**తదను సుమిత్రానందన వేషః ।**
**తదుపరి ధృత"హలముసల" విశేషః**
**తదనంతర మభవత్ గురురేషః ॥**

హలము (నాగలి), ముసలము(రోకలి) లను ధరించిన వాడుగా వర్ణించబడింది.

క్లుప్తంగా చెప్పాలంటే బలభద్రుడు శేషావతారమే! త్రేతాయుగంలో శేషుడే లక్ష్మణ స్వామియై భగవంతుని సేవించాడట. తిరిగి అన్న బలభద్రుడుగా జన్మించి కూడా ఆయనే తమ్మునికి తన విశేషసేవలందించాడట.

భగవంతుడికి, భాగవతుడైన బలరామునికి చేసే శేషత్వము (సేవ) రెండూ వేరు వేరు కావని ఒకే వస్తువు యొక్క రెండుస్థితులు. కృష్ణబల రాములు వేరుగా కనబడుతున్నా, పరస్పరం భిన్నత్వము లేనివారని అంతరార్థంగా పెద్దలు వివరిస్తారు. 'ప్రకృష్ట విజ్ఞాన బలైకధామని'– అనే దాని ప్రకారం ఉత్కృష్టమైన విజ్ఞాన బలముగలవాడు ఆదిశేషుడు. అటువంటి ఆదిశేషుని అంశయే బలరాముడు. రోహిణీ వసుదేవుల కుమారుడుగా భాగవతంలో వర్ణించబడిన బలరాముని జీవితవిశేషాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. శ్రీమహావిష్ణువు కృష్ణావతారం ధరించినప్పుడు ఆయన శయ్య అయిన ఆదిశేషుడు కూడ దేవకీదేవి సప్తమ గర్భమున పెరుగుచుండెనట. కాని,



కంసుడు ఆమెకు జన్మించిన సంతానమును సంహరింపదలచి ఉండుటచే ఈ పిండమును బయటతీసి నందుని ఇంట ఉన్న రోహిణీ గర్భమున ఉంచమని హరి యోగమాయ నాజ్ఞాపించగా ఆమె అట్లే చేసెను. బృందావన జనులకు బాగా ఇష్టమైనందున రాముడనియు, అతి బలశాలి అయినందున బలరాముడనియు ఇతనికి పేరు వచ్చెను. ఇతడును, కృష్ణుడును మిత్రులతో కలసి గోరక్షణ, గోదోహనము, గోపరిపాలన చేసెడివారు.

ఒకనాడు వీరిని వధించుటకై గోపవేషమున వచ్చిన ప్రలంబాసురుడను వానిని బలరాముడు ఆటలలోనే మట్టు పెట్టెను.

బలరాముని ప్రభావాన్ని ప్రాభవాన్ని గమనిస్తే, సుగ్రీవుని మంత్రి మైందుని సోదరుడైన ద్వివిదుడు నరకాసురునికి మిత్రుడు. కృష్ణునిపై పగతో, అతడు ఒకనాడు బలరాముని ఇబ్బంది పెట్టగా, కోపించిన బలరాముడు ఆతనిని సంహరించెను. మరొక సందర్భంలో కృష్ణుడు, కౌరవుల మధ్య యుద్ధము ఏర్పడగా, బలరాముడు, కృష్ణుని పక్షమున దుర్యోధనుడితో యుద్ధము చేసి తన హలాయుధముతో హస్తినను పెకలించగా, భయపడిన భీష్మాదులు బలరాముని క్షమించమని ప్రార్థించిరి. కొంతకాలము తర్వాత, కౌరవపాండవుల మధ్య యుద్ధం జరుగగా, అది చూడడం ఇష్టం లేక, బలరాముడు తీర్థయాత్రలకు తరలి పోయి, చివరకు నైమిశారణ్యము చేరెను. ఆ సందర్భములో వ్యాసశిష్యుడైన రోమహర్షణుడు వారిని గౌరవించని కారణాన, బలరాముడు కోపంతో ఆతనిని కుశాగ్రమ్ముతో చంపివేసెను. తిరిగి మునుల ప్రార్థనపై బలరాముడు ఆతని కుమారుడైన సూతుని దీర్ఘాయువుతో గొప్ప పౌరాణికుడవు తాడని దీవించి, వారందరి సూచనపై తనకు కలిగిన బ్రహ్మహత్యా పాతకమునుండి విముక్తుడు కావడానికై తీర్థయాత్రలు చేసెను. అప్పుడే పల్వలుడను లోకకంటకుని ఆయన వధించి, ఆపై ఎన్నెన్నో పుణ్యక్షేత్రాలను దర్శించి దానధర్మాలు చేసెను. మహాత్ములను సేవించెను. చివరకు బలరాముడు ప్రభాసతీర్థము చేరెను. ఈ లోగా భారత యుద్ధము ముగిసింది. బలరాముడు అక్కడి నుండి నైమిశారణ్యము వెళ్లి అక్కడ ఎన్నో యజ్ఞాలు నిర్వహించి ఋషులకు ఆత్మజ్ఞానము ప్రసాదించెను.

బలరాముని బలపరాక్రమాలు కూడా చెప్పుకోదగినవే! కంసుని కొలువులో ఉన్న చాణూర, ముష్టికులను మల్లులను బలరామకృష్ణులిరువురునూ కలసి సంహరించిరి. ఇంతకు ముందే ధేనుకాసురుడు బలరాముని చేతిలోనే చచ్చెను. గదాయుద్ధము నందు బలరాముడు నిష్ణాతుడని, ఆయనే దుర్యోధనుడి గురువని మనకు తెలుస్తున్నది. బహుశా ఈ కారణముచేతనేమో దుర్యోధనుడిపై బలరాముని శిష్యవాత్సల్యము చెప్పుకోదగినది. తన చెల్లెలైన సుభద్రా వివాహఘట్టములో ఆయనకుగల గౌరవము, తన చిన్ననాడు గురుదక్షిణగా తమ్మునితో కలిసి, దనుజుడపహరించి సాగరములో దాచిన గురువు సాందీపని కుమారుని తెచ్చి ఇచ్చుటలో గురువుల పట్ల ఆయనకు గల ఆదరము మనకు తేటతెల్లమౌతున్నవి.

బలరాముని పత్ని రేవతి. ఇరువురిది ఆదర్శ దాంపత్యము. రుక్మిణీ శ్రీకృష్ణుల వివాహములో కూడ బలరాముడు ముఖ్యపాత్రనే పోషించెను. కాలక్రమములో జరిగిన దుస్సంఘటనలు యాదవకాల వినాశనముకు సంకేతములని గ్రహించి, బలరాముడు శరీరము విడిచి వైకుంఠము చేరి తిరిగి అనంతరూపము (ఆదిశేషుడు) పొందెను. శేషత్వమునకు, భగవత్సేవకు, కార్యదీక్షకు, బలపరాక్రమాలకు, పెద్దలపట్ల వినమ్రతకు, శిష్యవాత్సల్యమునకు, ప్రతీకగా బలరాముని చెప్పుకోవచ్చు. ఎన్నో సంవత్సరాలుగా తిరుమల తిరుపతి దేవస్థానములవారు తిరుచానూరు ప్రధానదేవాలయ ప్రాంగణములోనే ఉన్న ఉపాలయములో వెలసి ఉన్న బలరామునికి కూడా విశేష పూజలు, సేవలు, సమర్పించుకొనుట ముదావహము.




# ప్రత్యక్షదైవం- పరమదయాళువు

- శ్రీమతి రాచపూడి శరత్‌కౌముది

మాది ప్రకాశం జిల్లా దర్శి. అమ్మా, నాన్న, తమ్ముడువాళ్లు ఉండేది గుంటూరు జిల్లా మాచర్ల పట్టణంలో. మేమందరమూ కలిసి తిరుమలకు బయలుదేరాము. తీరికలేని కారణంగా మావారు మాతో రాలేదు. తిరుమలకు చేరుకున్న తర్వాత మాకు కౌస్తుభంలో వసతి లభించింది. మా నాన్నగారు హార్ట్ పేషంట్. మా నాన్నతో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా దర్శించాలనుకున్నాను. కానీ, నిబంధనల ప్రకారం భార్యాభర్తలను మాత్రమే అనుమతిస్తారని చెప్పగానే నిరాశకులోను అయ్యాను. ఈ పరిస్థితిలో మా పిల్లాడు, మా అమ్మా నాన్న ప్రత్యేకంగా వయోవృద్ధులకు కల్పించే క్యూలో శ్రీవారి దర్శనానికి వెళ్లారు.

నాకు, మా తమ్ముడికి శ్రీవారి దర్శనానికి వీలు కాలేదు. ఆ రాత్రి రెండు గంటల వేళ, మా తమ్ముడు వెళ్లి తెల్లారేసరికి శ్రీవారి దర్శనం చేసుకున్నాడు. నేను ఒక్కదానినే దర్శనం కాకుండా మిగిలి పోయాను. మరుసటి రోజు ఉదయం నేను మా తమ్ముడు ఆలయానికి వెళ్లాము. స్పెషల్ దర్శనానికైనా 8 నుండి 10 గంటలు పడుతుందని తెలిసి, నేను మరింత నిరాశకు గురి అయ్యాను. పిల్లవాడిని నాతో తీసుకు వెళ్లడానికి లేదు. మా అమ్మనాన్న దగ్గర ఉంచి వెళ్లడానికి కుదరదు. పిల్లాడికి నేనే అన్నం తినిపించాలి. ఏమి చేయాలో తెలియలేదు.

ఇలా ఆలోచిస్తూ... నేను, మా తమ్ముడు స్వామి వారిని దర్శనభాగ్యం కల్పించమని, ఆ పద్మావతీ శ్రీనివాసుల్ని వేడుకుంటూ ముందుకు అడుగులేస్తూ వెళ్లుతున్నాము.

అప్పుడు మాకు ఓ స్త్రీ మూర్తి ఎదురైంది. ఆమె నదుటి మీద ఎర్రని ఇంతేసి బొట్టు. నలుపువర్ణం. ఆమె ముఖంలో గొప్ప ఆకర్షణ. నా ముఖంలోకి చూస్తూ అంది- 'నిన్నంతా దర్శనం కాలేదుగా. బెంగ పడకు. పిల్లాడికి అన్నం పెట్టుకొని ఈ మధ్యాహ్నం వెళ్లు! దర్శనం అవుతుందిలే! నేనిక్కడే ఉంటుంటాన్లే... అక్కడికెళ్లగానే వాన కూడా పడ్తుందిలే! వెళ్లు!!' అంటూ పలికి మరోమాటకు అవకాశమీయకుండా వెళ్లిపోయింది. ఆశ్చర్యపోయాన్నేను. ఆమె ఎవరో నాకు తెలీదు. పూర్తిగా నాకు క్రొత్త.

నాకు నిన్న దర్శనం కాలేదని ఆమెకు ఎలా తెల్సు? అను కుంటూ ఉన్నాను. ఇంతలో మా తమ్ముడు నన్ను అడిగాడు ఎవరని? ఏమిటని? 'చెప్పాను'. ఈ విషయాన్ని ఇద్దరమూ తేలిగ్గా తీసుకున్నాం. నేను మధ్యాహ్న సమయంలో ఆలయంవద్దకు వెళ్ళాను. రూ.300/- టిక్కెట్ తీసుకున్నాను. క్యూలో నడుచుకుంటూ వెళ్లాను. ఎక్కడా ఆగింది లేదు. ఎంత తేలిగ్గా- సౌకర్యంగానో ఉంది నాకు!! బైట వాన! వానపడ్తోంది!!

ఏ కష్టం లేకుండా సునాయాసంగా మహా ద్వారం దాకా తోపుడు నెట్టివేతలు లేకుండా వెళ్ళాను. ఇంత సౌకర్యంగా ఆ తిరుమలేశుని సన్నిధికి ఎవ్వరూ వెళ్లి ఉండరనిపించింది. తిరుమలేశుని దర్శనం అపూర్వంగా తోచింది. కలియుగ ప్రత్యక్షదైవం ఏడు కొండల వాడు దర్శనభాగ్యం కల్గించాడు.

ఇంతకూ ఇలా నాకు మార్గనిర్దేశనం చేసిన ఆ స్త్రీ మూర్తి ఎవరు? సాక్షాత్తు శ్రీనివాసుడు పంపిన శ్రీపద్మావతీయే కదా! పరమదయాళువు కదా ఆస్వామి!! ఆ శ్రీవేంకటేశ్వరస్వామివారి లీలలు అద్భుతంగా ఉంటాయి. ఎవ్వరినీ నిరాశపరచడు. స్వామిపై నమ్మకం, విశ్వాసం ఉండాలే కాని, ఆ చల్లని కృపాకటాక్షవీక్షణం ఉంటూనే ఉంటుంది. ఏ రూపంలోనైనా ద్యోతక మౌతాడు. మన అభీష్టాలు నెరవేరేట్టు చూస్తాడు.

# భక్తప్రహ్లాదుని ఉపదేశాలు

- డా।। వైష్ణవాంఘ్రి సేవకదాస్

భక్తప్రహ్లాదుడు గురువుల దగ్గర సమస్తవిద్యలను నేర్చుకొని, వినయవిధేయతతో తండ్రి హిరణ్యకశిపుని వద్దకు వచ్చాడు. "పుత్రా! ప్రహ్లాదా! ఆయుష్మంతుడా! గురువుల దగ్గర నీవు ఇంతకాలం ఎన్నో విషయాలను విన్నావు, నేర్చుకున్నావు. అయితే వాటిలో ఏది నీకు సర్వోత్తమమైన జ్ఞానమని అనిపించిందో అది నాకు చెప్పు."

తన తండ్రి ఈ విధంగా ప్రేమతో అడగగానే భక్త ప్రహ్లాదుడు వెంటనే నిర్భయంగా ఇలా అన్నాడు– "విష్ణు భగవానుని నామరూపగుణ లీలాదులను వినడము, కీర్తించడము, వాటిని స్మరించడము, ఆ దేవదేవుని పాదపద్మాలను సేవించడము, ఆతనికే షోడశోపచార విధితో పూజ చేయడము, నమస్కరించడము, ఆతనికి దాసునిగా అవ్వడము, ఆతనినే ఉత్తమ మిత్రునిగా భావించడము, త్రికరణ శుద్ధిగా ఆతనికే సమస్తాన్ని సమర్పించడము అనే తొమ్మిది పద్ధతులే విశుద్ధ భక్తియోగంగా చెప్పబడినాయి. ఈ తొమ్మిది పద్ధతుల ద్వారా జీవితాన్ని శ్రీహరిసేవకు అంకితం చేసిన మహనీయుడే సర్వోత్తముడు" అని అన్నాడు.

ప్రహ్లాదుని మాటలు హిరణ్యకశిపునికి తీవ్రమైన క్రోధాన్ని కలిగించాయి. అతని ముఖం ఎఱ్ఱబడింది. వెంటనే అతడు కోపాతిరేకంతో గురుపుత్రులను దూషించసాగాడు. అపుడు చండామార్కులు భయంతో వణికిపోయారు. ప్రహ్లాదుడు పలికిన విషయం తాము చెప్పలేదని, తమ సన్నిధిలో వేరెవ్వరు చెప్పలేదని తెలియజేసారు. గురువులు చెప్పని విద్య ఎక్కడ నుండి లభించిందని అతడు ప్రహ్లాదుని గద్దించి అడిగాడు. అయినా శ్రీహరి రక్షణలో ఉన్న ఆ బాల భాగవతుడు ధైర్యంగా ఇలా అన్నాడు. "దానవేంద్రా! విషయ భోగభావనలో చిక్కుబడినట్టి వారు అంధునే తమ నాయకునిగా, ఎన్నుకొంటారు. గ్రుడ్డివాడిని అనుసరించే గ్రుడ్డి వారు దారితప్పి గుంటలో పడినట్లుగా, ఇంద్రియాలను అనుసరించేవారు కర్మపాశ బద్ధులై మరల మరల జనిస్తూ త్రివిధ తాపాలకు గురియౌతారు."

భక్తప్రహ్లాదుడు ఈ విధంగా సమాధానం ఇవ్వగానే, హిరణ్యకశిపుడు అతనిని తన ఒడిలో నుండి దూరంగా తోసేసాడు. సుకుమార శరీరుడైన ప్రహ్లాదుడు క్రిందపడిపోయాడు. అయినా అతడు నిర్భయంగానే ఉన్నాడు. ఏమాత్రం తొణకలేదు. హిరణ్యకశిపుడు మాత్రం తోక తొక్కిన త్రాచు లాగా చెలరేగాడు. ఎవ్వని అరుణనేత్రాలను చూసి ఇంద్రాది దేవతలే భీతావహులౌతారో అటువంటి దానవేంద్రుడు ఎన్నడూ లేనంత క్రోధంతో భటులను ఉద్దేశించి ఇలా అన్నాడు–

"అసురులారా! ఈ ప్రహ్లాదుని సాధ్యమైనంత తొందరగా నా ఎదుట నుండి తీసికొని పొండి. బాలుడని కనికరించకుండా ఇతనిని వెంటనే వధించండి. ప్రహ్లాదుడు నా శత్రువైన విష్ణువుకు దాసుడైనాడు. కాబట్టి ఏదో విధంగా ఇతనిని చంపివేయండి."

తమ నాయకుని మాటలు అసురులలో ఉత్సాహాన్ని నింపాయి. వారు ప్రహ్లాదుని దూరంగా తీసికొనిపోయారు. ఘోరరూపులైన అసురులు అపుడు "నరకండి, పొడవండి, కొట్టండి" అని భీకరంగా అరుస్తూ కత్తులతో, శూలాలతో ప్రహ్లాదుని పై దాడి చేసారు. కాని ప్రహ్లాదుడు మాత్రం కళ్ళు మూసుకొని హృదయంలో అచ్యుతుని తలుస్తూ ధ్యానమగ్నుడయ్యాడు. అసురుల కత్తులు ప్రహ్లాదుని నరకలేకపోయాయి. వారి శూలాలు అతనిని పొడవలేకపోయాయి. వారి గదలు ప్రహ్లాదుని హరిభక్తి ముందు ఓడిపోయాయి, వారి భీకరమైన అరుపులు ధ్యానమగ్నుడైన ప్రహ్లాదుని చెవులలోకి చేరలేకపోయాయి. తమ ప్రయత్నాలు విఫలం కాగానే అసురులు పరుగులతో హిరణ్యకశిపుని దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వెల్లడించారు. ఈ విషయం దానవేంద్రునికి కూడ విస్మయాన్ని కలిగించింది. అతనికి కొంత భీతి కలిగింది. దేవతలను గడగడ లాడించిన తన అసురగణం ఒక చిన్నబాలుని వధించలేకపోవడం అతనికి అతి విచిత్రంగా తోచింది. అయినా తన దగ్గర వేరే ఉపాయాలు ఉన్నాయని వాటిని ఒక్కొక్కటిగా ప్రయోగించడం

మొదలుపెట్టాడు. మొదట చిన్నారి బాలుని ఏనుగులతో తొక్కించాడు, తరువాత విషసర్పాలతో కరిపించాడు. తరువాత వినాశకరమైన మంత్రప్రయోగం చేయించాడు. తరువాత ఎత్తైన కొండల మీద నుండి లోయలలోనికి తోయించాడు. తరువాత విషప్రయోగం చేసాడు; తరువాత పెద్ద పెద్ద రాళ్ళ క్రింద నలిపి వేయడానికి యత్నించాడు, అన్నం పెట్ట కుండా పస్తులుంచాడు. మంటలలో తోయించాడు. మసిలే నూనెలో పడవేయించాడు. తాను ఎన్నో ఉపాయాలతో యత్నించినప్పటికిని ప్రహ్లాదునికి ఏమాత్రం కీడు చేయలేక హిరణ్యకశిపుడు ఖిన్నుడయ్యాడు. అతనికి దిక్కు తోచలేదు. "ఇతడు మరణాతీతుడైనట్లు గోచరిస్తోంది. ఇతని వైరంతోనే నాకు మరణం సంభవిస్తుందేమో!" అని భయంతో అతడు తనలో తాను అనుకోసాగాడు. ఈ విధంగా అనేక రకా లుగా ఆలోచిస్తున్న హిరణ్యకశిపుని వదనం వాడిపోయింది. ఈ పరిస్థితిని చూసి చండామార్కులకు ఏకాంతంగా హిరణ్యకశిపుని కలిసికొని కొంతధైర్యాన్ని చెప్పడానికి ప్రయత్నించారు.

"ప్రభూ! నీ భ్రుకుటి ముడికే దేవతలు కలత చెందుతారని మాకు తెలుసు. నీవు ముల్లోకాలను జయిం చావు. ఇక చిన్నపిల్లవాడైన ప్రహ్లాదుని విషయం ఏమాత్రం భయపడవలసింది కాదు. మన గురువైన శుక్రాచార్యుడు ఉండనే ఉన్నాడు. ఆయన వచ్చేటంత వరకు ఈ పిల్లవాడిని బంధించి ఉంచుదాము. అయినా పెద్దవాడైతే ఇతనే తన పద్ధతిని మార్చుకుంటాడు. మా ఉద్దేశ్యం ప్రకారం కొంత కాలానికి ఇతడు గురువుకు సేవ కూడ చేస్తాడు. కాబట్టి ఈ విషయంలో మీరు ఏమాత్రం చింతించకండి. ప్రహ్లాదుని మళ్ళీ మా వెంట పంపండి."

గురుపుత్రుల సాంత్వన వాక్కులను వినగానే హిరణ్యకశిపునికి కొంత ఉపశమనం కలిగింది. తన పుత్రుడు హరిభక్తిని విడిచి తిరిగి తన మార్గానికి వస్తాడనే ఆశ చిగురించింది. ఇక ప్రహ్లాదునికి గృహస్థరాజుల ధర్మాలను మాత్రమే బోధించండని అతడు చండామార్కులకు చెప్పాడు. వారు సరేనని చెప్పి ప్రహ్లాదుని తమ వెంట ఆశ్రమానికి తీసుకొని వెళ్ళిపోయారు. *(సశేషం)*

విశ్వదాభిరామం

## అపకారికి ఉపకారం


వేమన పద్యసూక్తి

**చంపదగినయట్టి శత్రువు తనచేత**
**చిక్కె నేని, కీడు సేయరాదు;**
**పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు,**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** శత్రువు= పగవాడు; కీడు= అపకారము; చిక్కెనేని= చిక్కినప్పటికి; పొసగ = తగినట్లు.

**భావం:** చంపదగిననేరం చేసినశత్రువు తనచేతికి చిక్కి నప్పటికీ వానికి కీడు చేయగూడదు. అవసరమైన మేలు చేసి విడిచిపెట్టడమే సమంజసం.

**వివరణ:** కనబడితే చంపివేయాలనిపించేంతగా వైరం కలి గిందంటే అతడు ఎంతో దారుణమైన అపకారం చేసి, బాధలు పెట్టాడన్నమాట. వాడు అపకారం



చేస్తామేమోనని మనకు కన బడకుండా తప్పించుకుని తిరుగుతాడు. అటువంటివాడు చేతికి చిక్కితే పగ తీర్చుకో కుండా ఎవరూ వదిలిపెట్టరు. కాని అలా అపకారం చేయ కుండా, ఇంకా అవసరమయి నంతమేలు చేసి విడిచిపెడితే సరిపోతుంది అంటున్నాడు వేమన. కీడు చేయకపోగా, మేలు చేయడంవలన ఎంతటి శత్రువు కూడా మిత్రుడు అవుతాడు. శారీరకంగా హింసించ కుండా, మానసికంగా మార్పు తీసుకురావడం సమాజానికి శ్రేయస్కరం.

– విద్వాన్ కట్టా నరసింహులు

బాలప్రబోధం

# 'విద్యాదదాతి వినయం'

– డా॥ గంగిశెట్టి లక్ష్మీనారాయణ

విద్య వల్ల ఏం సంపాదించాలి? అని ఎవరైనా ప్రశ్నించగానే, వెంటనే మన మంతా 'ధనం సంపాదించాలి' అని తడుముకోకుండా సమాధానమిస్తాం. విద్యకు ధనమే పరమ ప్రయోజనం అని భావిస్తాం.

చివరకు తల్లిదండ్రులు కూడా పిల్లలను విద్యద్వారా డబ్బును సంపాదించే యంత్రాలుగా తీర్చిదిద్దే ప్రయత్నంలో తలమునకలై ఉన్నారు.

కానీ మన ఆర్షధర్మం (ఋషులు ఏర్పరచిన మార్గం) విద్యకు లక్ష్యాలను చాలా చక్కగా వివరించింది.

**విద్యా దదాతి వినయం వినయాత్ యాతి పాత్రతాం!**
**పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాత్ ధర్మం తతస్సుఖమ్!!**

విద్యవల్ల 'వినయం' రావాలి. వినయం అనే మాటకు అణకువ, విధేయత అనే అర్థాలే కాక 'జ్ఞానం' అనే అర్థముంది.

విద్యవల్ల ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుస్తుంది. ఆ ప్రవర్తనకు కూడా వినయమనే పేరు. ఇక్కడ 'వినయ' శబ్దానికి ఈ అర్థాలన్నింటినీ తీసుకోవచ్చు. విద్యవల్ల విధేయత, విజ్ఞానం, ప్రవర్తనా సరళి లభిస్తాయి. దాని ద్వారా అర్హత. ఆ అర్హతవల్ల ధనం, ఆ ధనంవల్ల ధర్మం తద్వారా సుఖం కలుగుతాయి. ఈ వరుసలో ఉన్న ఔచిత్యం ఎంత గొప్పది! విద్యకి ధనానికి మధ్య వినయం, పాత్రత ఉన్నాయి. ధనానికి, సుఖానికి మధ్య ధర్మం ఉంది.

ఇక్కడ విద్యకి లక్ష్యం, ధనానికి లక్ష్యం రెండూ చెప్పారు. ధనం వల్ల సంపాదించవలసినది ధర్మం. ధర్మం ద్వారా సుఖాన్ని సంపాదించాలి. ఎంత నిశితమైన అవగాహన ఇందులో ఉందో గమనించారా?

ఈ ఒక్క శ్లోకాన్ని విద్యార్థులు, విద్యాలయాలూ గమనిస్తే విలువలుగల విద్యా వ్యవస్థను సాధించవచ్చు, ధనానికి ముందూ వెనకా ఉత్తమలక్షణాలుంచారు. ఆ లక్షణాలవల్ల వ్యక్తి నియంత్రణ సాధ్యపడుతుంది. సమాజానికి భద్రత ఉంటుంది.

ధర్మాన్ని ఆచరించడానికి తగిన వనరులు లేక చాలా మంది అసహాయులైపోతారు. కానీ, ధర్మాచరణకు తగిన సంపాదన కలిగి ఉండటం భాగ్యం. ఆ భాగ్యాన్ని వినియోగించుకోవడమే ధనాన్ని ధర్మంకోసం ఖర్చు చేయడం.

ధనం ద్వారా వచ్చే సుఖం కన్నా, ధర్మం ద్వారా లభించే సుఖంలో సంతృప్తి, శాంతి ఉంటాయి. జీవితంలో లభించే సుఖాలకు దూరంగా ఉండమని, వ్యర్థమైన విరక్తిని బోధించలేదు మనధర్మం. హాయిగా బ్రతకమంది. ఆనందంగా బ్రతకమంది. అయితే ఆ ఆనందం అర్థవంతం కావాలి. వ్యక్తికి హాని కలిగించనిదై ఉండాలి. అలాంటి అర్థవంతమైన అవగాహన కలిగించేదే 'విద్య'. ఆ అవగాహనతో ఆర్జించేదే 'ధనం'. ఆ లక్ష్యం కోసం వినియోగం కావడమే దాని ఉద్దేశం. ఆ వినియోగం వల్ల లభించే ఆనందమే జీవిత సార్థకం. సమాజంలో శాశ్వత సౌఖ్యంకోసం పరితపించే బుద్ధి ఉన్నవారు ఈ విధంగా ఆలోచిస్తారు.



ఒక్క శ్లోకంలోనే వ్యక్తి జీవిత మార్గనిర్దేశాన్ని ఇంత సమగ్రంగా బోధించిన మన సనాతన ధర్మానికి మోకరిల్ల వలసిందే.

నిరంతర అధ్యయనం వల్లనే నిరంతర ధర్మం, తద్వారా సుఖం వర్ధిల్లుతాయి. సత్యస్పృహతో అసలైన ఆనందాన్ని పొందాలంటే ధనానికి ముందు వెనుక ఉన్న మంచిలక్షణాలను సాధించవలసిందే.

పాఠం-03

# సంస్కృతం నేర్చుకుందాం..!!

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

## संयुक्ताक्षराणि (సంయుక్తాక్షరాలు)

| | |
|---|---|
| ध् + न = ध्न | ధ్ + న = ధ్న |
| ध् + म = ध्म | ధ్ + మ = ధ్మ |
| ध् + य = ध्य | ధ్ + య = ధ్య |
| ध् + र = ध्र | ధ్ + ర = ధ్ర |
| ध् + व = ध्व | ధ్ + వ = ధ్వ |
| न् + ख = न्ख | న్ + ఖ = న్ఖ |
| न् + त = न्त | న్ + త = న్త |
| न् + थ = न्थ | న్ + థ = న్థ |
| न् + द = न्द | న్ + ద = న్ద |
| न् + ध = न्ध | న్ + ధ = న్ధ |
| न् + न = न्न | న్ + న = న్న |
| न् + प = न्प | న్ + ప = న్ప |
| न् + म = न्म | న్ + న = న్మ |
| न् + य = न्य | న్ + య = న్య |
| न् + र = न्र | న్ + ర = న్ర |
| न् + व = न्व | న్ + వ = న్వ |
| प् + त = प्त | ప్ + త = ప్త |
| प् + न = प्न | ప్ + న = ప్న |
| प् + प = प्प | ప్ + ప = ప్ప |
| प् + म = प्म | ప్ + మ = ప్మ |
| प् + य = प्य | ప్ + య = ప్య |
| प् + र = प्र | ప్ + ర = ప్ర |
| प् + ल = प्ल | ప్ + ల = ప్ల |
| प् + व = प्व | ప్ + వ = ప్వ |
| प् + स = प्स | ప్ + స = ప్స |
| फ् + य = फ्य | ఫ్ + య = ఫ్య |
| फ् + र = फ्र | ఫ్ + ర = ఫ్ర |
| ब् + ज = ब्ज | బ్ + జ = బ్జ |
| ब् + द = ब्द | బ్ + ద = బ్ద |
| ब् + ब = ब्ब | బ్ + బ = బ్బ |
| ब् + भ = ब्भ | బ్ + భ = బ్భ |
| ब् + य = ब्य | బ్ + య = బ్య |
| ब् + र = ब्र | బ్ + ర = బ్ర |
| ब् + स = ब्स | బ్ + స = బ్స |
| भ् + न = भ्न | భ్ + న = భ్న |
| भ् + य = भ्य | భ్ + య = భ్య |
| भ् + र = भ्र | భ్ + ర = భ్ర |
| भ् + व = भ्व | భ్ + వ = భ్వ |
| म् + न = म्न | మ్ + న = మ్న |
| म् + प = म्प | మ్ + ప = మ్ప |
| म् + फ = म्फ | మ్ + ఫ = మ్ఫ |

| | |
|---|---|
| म् + ब = म्ब | మ్ + బ = మ్బ |
| म् + भ = म्भ | మ్ + భ = మ్భ |
| म् + म = म्म | మ్ + మ = మ్మ |
| म् + य = म्य | మ్ + య = మ్య |
| म् + र = म्र | మ్ + ర = మ్ర |
| म् + ल = म्ल | మ్ + ల = మ్ల |
| य् + य = य्य | య్ + య = య్య |
| य् + व = य्व | య్ + వ = య్వ |
| र् + क = र्क | ర్ + క = ర్క |
| र् + ख = र्ख | ర్ + ఖ = ర్ఖ |
| र् + ग = र्ग | ర్ + గ = ర్గ |
| र् + घ = र्घ | ర్ + ఘ = ర్ఘ |
| र् + च = र्च | ర్ + చ = ర్చ |
| र् + छ = र्छ | ర్ + ఛ = ర్ఛ |
| र् + ज = र्ज | ర్ + జ = ర్జ |
| र् + झ = र्झ | ర్ + ఝ = ర్ఝ |
| र् + ट = र्ट | ర్ + ట = ర్ట |
| र् + ठ = र्ठ | ర్ + ఠ = ర్ఠ |
| र् + ड = र्ड | ర్ + డ = ర్డ |
| र् + ढ = र्ढ | ర్ + ఢ = ర్ఢ |
| र् + ण = र्ण | ర్ + ణ = ర్ణ |
| र् + त = र्त | ర్ + త = ర్త |
| र् + थ = र्थ | ర్ + థ = ర్థ |
| र् + द = र्द | ర్ + ద = ర్ద |
| र् + ध = र्ध | ర్ + ధ = ర్ధ |
| र् + न = र्न | ర్ + న = ర్న |
| र् + प = र्प | ర్ + ప = ర్ప |
| र् + फ = र्फ | ర్ + ఫ = ర్ఫ |
| र् + ब = र्ब | ర్ + బ = ర్బ |
| र् + भ = र्भ | ర్ + భ = ర్భ |
| र् + म = र्म | ర్ + మ = ర్మ |
| र् + य = र्य | ర్ + య = ర్య |
| र् + र = र्र | ర్ + ర = ర్ర |
| र् + ल = र्ल | ర్ + ల = ర్ల |
| र् + व = र्व | ర్ + వ = ర్వ |
| र् + श = र्श | ర్ + మ = ర్మ |
| र् + ष = र्ष | ర్ + ష = ర్ష |
| र् + स = र्स | ర్ + స = ర్స |
| र् + ह = र्ह | ర్ + హ = ర్హ |
| ल् + क = ल्क | ల్ + క = ల్క |
| ल् + ग = ल्ग | ల్ + గ = ల్గ |

| | |
|---|---|
| ल् + प = ल्प | ల్ + ప = ల్ప |
| ल् + भ = ल्भ | ల్ + భ = ల్భ |
| ल् + म = ल्म | ల్ + మ = ల్మ |
| ल् + य = ल्य | ల్ + య = ల్య |
| ल् + ल = ल्ल | ల్ + ల = ల్ల |
| ल् + व = ल्व | ల్ + వ = ల్వ |
| व् + य = व्य | వ్ + య = వ్య |
| व् + र = व्र | వ్ + ర = వ్ర |
| श् + च = श्च | శ్ + చ = శ్చ |
| श् + म = श्म | శ్ + మ = శ్మ |
| श् + य = श्य | శ్ + య = శ్య |
| श् + र = श्र | శ్ + ర = శ్ర |
| श् + ल = श्ल | శ్ + ల = శ్ల |
| श् + व = श्व | శ్ + వ = శ్వ |
| श् + श = श्श | శ్ + శ = శ్శ |
| ष + क = ष्क | ష్ + క = ష్క |
| ष् + ट = ष्ट | ష్ + ట = ష్ట |
| ष् + ठ = ष्ठ | ష్ + ఠ = ష్ఠ |
| ष् + प = ष्प | ష్ + ప = ష్ప |
| ष् + म = ष्म | ష్ + మ = ష్మ |
| ष् + य = ष्य | ష్ + య = ష్య |
| ष् + व = ष्व | ష్ + వ = ష్వ |
| ष् + ष = ष्ष | ష్ + ష = ష్ష |
| स् + क = स्क | స్ + క = స్క |
| स् + ख = स्ख | స్ + ఖ = స్ఖ |
| स् + त = स्त | స్ + త = స్త |
| स् + थ = स्थ | స్ + థ = స్థ |
| स् + न = स्न | స్ + న = స్న |
| स् + प = स्प | స్ + ప = స్ప |
| स् + फ = स्फ | స్ + ఫ = స్ఫ |
| स् + म = स्म | స్ + మ = స్మ |
| स् + य = स्य | స్ + య = స్య |
| स् + र = स्र | స్ + ర = స్ర |
| स् + व = स्व | స్ + వ = స్వ |
| स् + स = स्स | స్ + స = స్స |
| ह् + ण = ह्ण | హ్ + ణ = హ్ణ |
| ह् + न = ह्न | హ్ + న = హ్న |
| ह् + म = ह्म | హ్ + మ = హ్మ |
| ह् + य = ह्य | హ్ + య = హ్య |
| ह् + र = ह्र | హ్ + ర = హ్ర |
| ह् + ल = ह्ल | హ్ + ల = హ్ల |
| ह् + व = ह्व | హ్ + వ = హ్వ |



హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

5

కర్ణాటక హరిదాసులను పేర్కొనేటప్పుడు ముఖ్యంగా మొట్టమొదట శ్రీపాదరాయలను ఆ తర్వాత వ్యాసరాయలను, వాదిరాజులను పేర్కొని ఆ తర్వాత కర్ణాటక సంగీత పితామహులైన పురందరదాసులను, కనకదాసులను, విజయదాసులు, గోపాలదాసులను, జగన్నాథదాసులను పేర్కొని ఆ తర్వాత వీరి మార్గములోనే వచ్చిన ఆనాటి హరిదాసుల నుండి ఈ మధ్యకాలం వరకు వచ్చిన శ్యామ సుందరదాసుల వరకు పేర్కొన వచ్చును. వీరందరు శ్రీమన్మ ధ్వాచార్యులవారి సత్సిద్ధాంత సంప్రదాయాన్ని అనుసరించి వేద, శాస్త్ర, పురాణోపనిషత్తులనాధారంగా ఆచార్య మధ్వుల సిద్ధాంతములను తమ కృతులలో నిక్షిప్తంచేసి, సులభ సుందర పదముల కూర్పుచే, సుందర రాగతాళముల సహాయంతో పాడుకొని ఆనందించుచూ, తద్వార అందలి అంతరార్థములను ఆలోచనతో అర్థమొనర్చుకొని ఆనం దించేటట్లు చేసినారు. "ఏకమాపాత మధురం అన్యదాలో చనామృతం". ఏది ఏమైనప్పటికి వీరి సాహిత్యము సార్వ కాలీనములు సకలజన సమ్మతములు, ఆరోగ్యప్రదములు, ఐశ్వర్యప్రదములై, ఆయుర్వృద్ధికి హేతువులై, విశ్వమునకు హితాన్ని కల్గించే విశ్వసాహిత్యమైనది.

కర్ణాటక హరిదాసుల కీర్తనలలో దేవతాస్తుతులు, వైరాగ్య ప్రబోధకములు ప్రామాణికములుగా చోటు చేసు కొన్నాయి. భారతీయ దేవతామూర్తులైన దేవతలను కొలుస్తూ, చివరకి విఠలునికి అంకితమును చేసి యున్నారు. శ్రీపాదరాయలవారినుండి నేటి హరిదాసులవారకు ముఖ్యంగా గణపతి, పార్వతి, వారుణి, సౌపర్ణి, భారతీ, సరస్వతులను, గరుడ శేష రుద్రులను, వాయుదేవుని మూడవ తారములను, మహాలక్ష్మిని, శ్రీహరి లీలావతారములను అభీష్టసిద్ధికై కొలిచినారు. పురందరదాసులవారు ఈ పై దేవతలనంతా ఉద్దేశ్యపూర్వకముగా కొలుచుటను ఈ క్రిందిస్తుతిలో మచ్చునకు చూడవచ్చును.

"సతత గణనాథ సిద్ధియ నీవ కార్యదలి ।
మతి ప్రేరిసువళు పార్వతీదేవి ము-
కుతిపథకె మనవీవ మహరుద్రదేవరు హరిభ -
కుతి దాయకళు శ్రీ భారతీదేవి- యు
కుతి శాస్త్రగళల్లి వనజసంభవనరసి
సత్కర్మ గళనదెసి సుజ్ఞాన మతియత్తు
గతిపాలిసువ నమ్మ గురు పవమానను
చిత్తదలి ఆనందసుఖవ నీవళు రమా భ-
కుత జనరొడయ శ్రీపురందర విఠలను
సతత ఇవరొళు నింత ఈ కృతి నడెసువను॥"

అనగా సకలకార్యసిద్ధికి గణపతిని, సద్బుద్ధి కొరకు పార్వతీదేవిని, ముక్తిపథము వైపునకు మనస్సును నడి పించుటకుగాను రుద్రుని, భక్తి ప్రసాదమునకై భారతీదేవిని, సకలశాస్త్రపరిజ్ఞానము కొరకు సరస్వతీదేవిని, సద్గతిని ప్రసాదించమని పవమానుని, చిత్తమునకు ఆనందమును కల్గించుటకు రమాదేవిని ఇట్లు సకలదేవతలను ప్రారంభంలో స్తుతించి సర్వోత్తముడైన శ్రీపురందరవిఠలుని వీరిలో నుండి నన్ను అనుగ్రహించమని అన్నారు. ఈ దేవతలను అసంఖ్యా కముగా విడివిడిగా కూడ కీర్తించినారు. శ్రీహరి దశావ తారములను వాటి లీలలను కాక భాగవతోక్తమైన శ్రీహరి మరికొన్ని అవతారములను కూడ రసవంతముగా స్తుతించి పాడినారు. వాటిలో నరసింహ, శ్రీరామ, కృష్ణావతారములనే అధిక కీర్తనములచే స్తుతించినట్లు కనిపిస్తుంది.

(ఇంకా ఉంది)



మనోనిగ్రహంలేనివారికి ఈ లోకం చెడ్డగా కన్పిస్తుంది

# ఆగష్టు, 2020 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-** ప్రయాణాలకు విఘ్నాలు కలుగుట, హృదయమున సంకటం, సుఖం, భోజనసౌఖ్యం తగ్గుట. అయిననూ గురుబలం వల్ల సమస్త కార్యాలను జయించుకుని రాగలరు.



**వృషభం-**వృత్తివ్యాపారాలందు అధికధనలాభాలు, సంపదవృద్ధి, ఆర్థికవికాసం, ఇష్టకార్యార్థసిద్ధి. బాకీలు వసూలగుట, మాసాంతంలో భోజన సౌఖ్యం. దూరప్రయాణాల వల్ల అలసట, ప్రయాణాలందు అను కోని సంఘటనలు.



**మిథునం-**ఈ మాసంలో వృత్తివ్యాపారాలు క్రమేపి అనుకూలించును. భయం ఆందోళనలు తొల గును. మానసిక ప్రశాంతత కల్గును. ఆరోగ్యం కల్గును. సంపదలను సృష్టించ గల్గుతారు.



**కర్కాటకం-** శిరోవ్యథ, వృత్తివ్యాపారాలు కలిసి రాకపోవుట, ధననష్టం, మాసాంతంలో కుటుంబ సౌఖ్యం, వృత్తివ్యాపారాలలో ముందంజ వేయు దురు. దూరప్రయాణాలు వాయిదా వేయుట మంచిది.



**సింహం-** సాంకేతిక పరమైన ఉద్యోగాలలో అవకాశాలు వచ్చుట, పుష్కలమగు కీర్తి, సంపదలను అనుభవించుట, వృత్తివ్యాపారాలలో వృద్ధి. గృహమున కల్యాణశోభలు, శుభకార్యాలలో పాల్గొనెదరు.



**కన్య-**రవి బుధ గురులు అనుకూల ప్రభావాన్ని చూపుతారు. గతంలోని పెట్టుబడులు షేర్లు అధిక లాభాల్నిస్తాయి. స్థానచలసూచనలు. ఉన్నతవిద్యల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.



**తుల-**ఆశించిన ఫలితాలు, ధనం లభ్యమగుట, ఎల్లప్పుడూ ఆరోగ్యం, బంధుమిత్రులతో కలసి ఉండుట, రాజదర్శనం, ఉన్నతవర్గం వారి అండదండలు లభిస్తాయి.



**వృశ్చికం-** వాహనసౌఖ్యం, యత్నకార్యసిద్ధి, సంతోషం, మిత్రులసహాయసహకారాలు పెద్దల అండదండలు లభిస్తాయి. మాసాంతంలో ధన లాభాలు. సంపదవృద్ధి, శత్రుజయం కల్గుతుంది. గతంలో రావలిసిన బాకీలు వసూలు అవుతుంది.



**ధనుస్సు-** పనుల తొందర, శారీరిక మానసిక ఒత్తిడులను అధిగమించ గల్గుతారు. శత్రుపీడ తొలగుతుంది. సర్వత్రా మీదే జయం. విద్యార్థులు పోటీపరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు.



**మకరం-**తలచిన కార్యాలు నెరవేరుతాయి. శుభ కార్యనిర్వహణ, ఎల్లప్పుడూ ఆరోగ్యం సంతోషం, యత్నకార్యసిద్ధి, విద్యలలో పరిశోధనలు చేసి గుర్తింపు సాధించుట, నూతన ఆవిష్కరణలు సత్ఫలితాన్ని స్తాయి.



**కుంభం-** దూరప్రయాణాలు చేయవలసి వస్తుంది. సంతానం చదువుల గురించి వ్యథ చెందుతారు. అవసరానికి ధనము చేతికి అందు తుంది. మాసాంతానికి మానసిక స్థిమితము ఉంటుంది.



**మీనం-** వృథాప్రయాసలకు గురి అవుతారు. పెట్టుబడులకు అధికంగా ధనం వెచ్చిస్తారు. స్నేహితులవల్ల కష్టం, సోమరితనం, ధన వ్యయం, బుద్ధి చాంచల్యం కలుగును.

ఆయుర్వేదం

## ఔషధగుణాల పవిత్ర వృక్షం...

# శమీవృక్షం



డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

**భా**రతీయ సనాతన వాఙ్మయంలో, సంస్కృతీ సంప్రదాయాల్లో విశిష్ఠ స్థానాన్ని పొందిన పవిత్ర దేవతా వృక్షం 'శమీ'. దీన్నే 'జమ్మి చెట్టు' అని తెలుగులో వ్యవహరిస్తారు.

"శమయతి రోగం ఇతి శమీ"– రోగాలకు శమింప చేయుటచే దీనిని 'శమి' అంటారు.

శుభాలను కలుగజేయటం వల్ల 'శివ' అని, మంగళ ప్రదమైనది కావున 'మాంగల్య' అని, అగ్నితత్త్వం కలిగి ఉండటం వల్ల 'అగ్నిగర్భ' అనే సంస్కృత నామాలు కూడా దీనికి ఉన్నాయి.

ఆంగ్లంలో స్పాంజ్‌ట్రీగా పిలువబడే మైమోసేసి అను వృక్ష కుటుంబానికి చెందిన ఈ వృక్ష శాస్త్రీయనామం 'ప్రోసోపిస్ సినరేరియ'.

దేవదానవుల క్షీరసాగరమథన సమయంలో పాల కడలి నుంచి మహాలక్ష్మి, కామధేనువు, కల్పవృక్షాలతో పాటు శమీవంటి దేవతా వృక్షాలు కూడా ఉద్భవించాయట.

సమస్త సృష్టిలో భాగంగా ప్రజాపతి అగ్నిని కూడా సృష్టించాడు. అగ్ని తక్షణమే తన ప్రభావాన్ని చూపించి తనని సృష్టించిన ప్రజాపతినే కాల్చనారంభించటంతో ప్రజాపతి శమీ వృక్షం యొక్క పచ్చని చెట్టు కొమ్మలతో ఆ అగ్నిని శమింపచేసి ఆర్పి వేసాడు. అలా అగ్ని శమకానికి ఉపయోగపడింది శమీ.

శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన బిల్వాష్టకాలలో శమీ కూడా ఒకటి. అందుచేత శివుడి కిష్టమైన కార్తిక మాసంలో దైవశక్తి నిబిడీకృతమైన ఈ చెట్టుకు పూజలు చేయటం కూడా మన సంస్కృతిలో ఒక భాగం.

శ్రీరామచంద్రులవారు శమీవృక్షాన్ని పూజించిన పిదప రావణాసురునితో యుద్ధం చేసేందుకు ఉద్యుక్తుడు అయ్యాడని చారిత్రకులు చెబుతారు.

పాండవులు అజ్ఞాతవాసం చేయడానికి వెళ్ళే ముందు గాండీవం, అస్త్రాలను శమీ వృక్షం మీద దాచిన విషయం సర్వజన విదితమైన చారిత్రక సత్యం.

ఒక్క అర్జునుడికి తప్ప ఆ దివ్యాస్త్రాలు ఇతరులకు విషసర్పాల్లా కనిపించే లాగున చేసి వాటిని ఈ దేవతా వృక్షమైన శమీవృక్షం కాపాడిందని చెబుతారు. అలా పాండవుల విజయానికి కూడా కారణమైంది కావున విజయదశమి పండుగ సందర్భంలో...

**"శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశినీ।**
**అర్జునస్య ధనుర్ధారి శ్రీరామ ప్రియదర్శినీ॥"**

–అను శ్లోకాన్ని పఠిస్తూ, ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేయటం, ఆ చెట్టు పత్రిని బంగారుగా భావించి పెద్దలకిచ్చి వారి ఆశీర్వాదాన్ని పొందటం, ఆత్మీయతానుబంధాలను పంచుకోవటం, పై శ్లోకాన్ని కాగితాలపై రాసి వాటిని జమ్మి చెట్టుకు కట్టి పూజించటం లాంటి విధివిధానాలను పాటిస్తారు.

దీనికున్న విశిష్టత, పవిత్రత వల్లే చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమినాడు శమీ పూజను ఆచరించటం ఆనవాయితీగా వస్తూ ఉంది. మరియు గ్రామ ప్రజలంతా ఊరి పొలిమేర దాటి ఈశాన్య దిక్కున ఉన్న శమీ వృక్షాన్ని పూజించటం ఒక ఆచారంగా వస్తూ ఉంది.

ఇటువంటి పవిత్ర దేవతావృక్షం జమ్మిచెట్టులో వివిధ రకాల అనారోగ్యాలకు పరిష్కారం చూపే ఔషధ సమ్మిళిత శక్తులు అపారం.

**తేలు కాటుకు–** జమ్మి చెట్టు చెక్కని తగినంత నీటితో మెత్తగా నూరి తీసిన గంధాన్ని లేపనం చేస్తే శీఘ్రంగా విషం



శ్రీనివాసుని మించిన పరదైవం లేదు

హరించటమే కాక తేలు కాటువల్ల కలిగే మంట, పోటు, బాధ, సలుపు లాంటి బాధలు తగ్గుతాయి.

**అవాంఛిత రోమాల సమస్య తగ్గేందుకు–** ఎండిన జమ్మి ఆకులు, కొమ్మలు కాల్చి బూడిద చేసి చల్లార్చి, జల్లించి ఉంచుకొని ఆరింతల నీటిలో బాగా కలిపి ఒక రోజంతా అలాగే ఉంచితే, అడుగున తెల్లటి పదార్థం సంచితమవుతుంది. నీటిని వంచేసి ఆ పదార్థాన్ని సేకరించి చల్లార్చి నిల్వ ఉంచుకొని రోజు ఒక(రెండుసార్లు తగినంత ఔషధంలో తగినంత నీరు చేర్చి పేస్టులా చేసి, లేపనం చేస్తుంటే త్వరగా ఆ సమస్య తగ్గిపోతుంది. అవాంఛిత రోమాలను తొలగించే ఔషధ శక్తి ఉండుటచే ఈ జమ్మి చెట్టుకు 'కేశహంత్రి' అను సంస్కృత నామం కూడా కలదు.

**కొలెస్ట్రాల్ సమస్యకు–** రోజూ ఒకసారి 200 మి.లీ. నీటిలో 5 గ్రాముల పచ్చి బెరడు లేదా రెండు గ్రాముల ఎండించిన బెరడు పొడి, అర టీ స్పూన్ జీలకర్ర, పదిమిరియాలు (నలగొట్టాలి) వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి చల్లార్చి వడగట్టి సేవిస్తుంటే హానికారక చెడు కొలెస్ట్రాల్ తగ్గి శరీరానికి ఉపయోగపడే మంచి కొలెస్ట్రాల్‌స్థాయి పెరిగేందుకు దోహదపడుతుంది. ఈ ఔషధాన్ని ఇలా సేవించటం వల్ల మధుమేహం నియంత్రణలో ఉండటమే కాక జ్వరం, ఒంటి నొప్పులు కూడా తగ్గుతాయి.



### వైకుంఠపాళి
### :: 56– సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ద్రు | | 2 శ | చి | 3 కాం | త | 4 ము | | |
| ప | | చి | | చ | | వ్వ | | 5 క |
| 6 దు | వ్వ | | 7 వి | న | యం | | 8 పు | రి |
| డు | | 9 వ | | ము | | 10 త | | ణి |
| | 11 త | ల | పు | | 12 త | ప | తి | |
| 13 కై | | పు | | 14 వా | | స్తు | | 15 త్రి |
| 16 క | త్తి | | 17 దు | హి | త | | 18 గ | ద |
| సి | | 19 దృ | | ని | | 20 బా | | శ్య |
| | | 21 శి | ల్పి | | 22 న | కు | లు | డు |

**స్త్రీల గర్భాశయ సమస్యలకు–** రోజూ ఒకసారి 200 మి.లీ. నీటిలో 5–10 జమ్మి ఆకులు, అర టీ స్పూన్ తాటికలకండ వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి చల్లార్చి వడగట్టి సేవిస్తుంటే అధిక రుతుస్రావ సమస్య తగ్గుతుంది. గర్భస్రావం జరుగకుండా కాపాడుతుంది.

**రక్తస్రావం తగ్గేందుకు–** జమ్మి ఆకులకు కొద్దిగా నీరు చేర్చి మెత్తగా నూరి పేస్టులా చేసి లేపనం చేస్తుంటే దెబ్బలు, గాయాల వల్ల కలిగే రక్తస్రావం తగ్గుతుంది.

**పుళ్ళు, వ్రణాలు, గాయాలు త్వరగా మానేందుకు–** 200 మి.లీ. కొబ్బరినూనెలో 50 గ్రాములు జమ్మి ఆకులను వేసి నురుగు వచ్చేంత వరకు సన్నని మంటపై మరిగించి దించి చల్లార్చి వడగట్టి రోజూ రెండుసార్లు ఆ నూనెను లేపనం చేస్తుంటే త్వరగా ఆ సమస్య తగ్గుతుంది.

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(సచిత్ర మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2.** కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# 56 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)'చంద్రకాంతశిల' మరియొక పేరు(5); 6)దుమ్ము(2); 7)ఎంతటి వారికైనా ఇది ఉండాలి(3); 8)నెమలి(2); 11)స్మరణ; ఆలోచన అను అర్థాలనిచ్చే పదం(3); 12)సూర్యుని కూతురు(3); 16)కూర గాయలను కోసే ఆయుధం(2); 17)కూతురు(3); 18)హనుమంతుని చేతిలోనున్న ఆయుధం(2); 21)శిల్పాల్ని చెక్కేవాడు(2); 22) త్రిగర్తరాజైన సురథుణ్ణి చంపినవాడు(4)


### నిలువు

1)పాంచాలదేశపురాజు(4); 2)ఇంద్రుని భార్య(2); 3)బంగారము(4); 4)అందె(2); 5)ఆడు ఏనుగు(3); 9)ప్రేమ (3); 10)మహర్షులు ఎల్లప్పుడూ ఇదే చేస్తారు(3); 13)రావణ కుంభకర్ణ విభీషణుల తల్లి(3); 14)నది(4); 15)లోపాముద్ర, అగస్త్యులకు కల్గిన పుత్త్రుడు(4); 19)ప్రకాశము(2); 20)రాజులు శత్రువుల్ని చంపుటకుపయోగించే ఆయుధాల్లో ఇది ఒకటి(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.



## తిరుమల
# శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవం
### 2020 అక్టోబరు 16 నుండి 24 వరకు

**16-10-2020**
శుక్రవారం
పగలు: వజ్రకవచాద్యాభరణములతో బంగారు తిరుచ్చి ఉత్సవం
రాత్రి: పెద్దశేషవాహనం

**17-10-2020**
శనివారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**18-10-2020**
ఆదివారం
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

**19-10-2020**
సోమవారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**20-10-2020**
మంగళవారం
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం


**21-10-2020**
బుధవారం
పగలు: హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం

**22-10-2020**
గురువారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**23-10-2020**
శుక్రవారం
పగలు: స్వర్ణరథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**24-10-2020**
శనివారం
పగలు: చక్రస్నానం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 30-08-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020



## శ్రీ విఖనసాచార్యస్వామివారి జయంతి

03-08-2020